అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 30-11-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 284 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50

ఫుడ్ పాయిజన్ ఘటనల్లో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హస్తం !

- హాస్టళ్లలో ఘటనలపై సమగ్ర విచారణ చేయిస్తున్నాం
- సైకోరావు కుట్రలెన్ని చేసినా ఐదేండ్లు రేవంతన్న పాలనే
- కేసీఆర్ కుటుంబంలోనే పదవుల కోసం గొడవలు
- టైం వచ్చినప్పుడు కేసీఆర్, కేటీఆర్ అరెస్టు : మంత్రి కొండా సురేఖ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఫుడ్ పాయిజన్ ఘటనల్లో ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ హస్తం ఉందనీ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు హాస్టళ్లల్లో ఉన్న ఆయన అనుచరులు కావాలనే సమస్యలను సృష్టిస్తున్నారని రాష్ట్ర అటవీ, పర్యాటక, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి గురుకులాలపై సైకోరావు ఎన్ని కుట్రలు చేసినా ప్రయోజనం ఉండదనీ, ఐదేండ్లు రేవంతన్న ప్రజాపాలన ఉంటుందని స్పష్టం చేశారు. గురుకుల విద్యార్థి శైలజ మృతి బాధాకరమన్నారు. నిమ్స్‌లో ప్రత్యేక చికిత్స అందించినా ఆమె చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి రూ.2 లక్షల పరిహారం, ఇందిరమ్మ ఇల్లు, ఒకరికి ఉద్యోగం ఇస్తున్నామని తెలిపారు. గురుకుల విద్యార్థి మరణాన్ని రాజకీయంగా వాడుకోవాలని బీఆర్ఎస్ చూస్తున్నదని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో కవిత, హరీష్ ఏకమై కేటీఆర్‌ని పక్కనబెడుతున్నారనీ, కేటీఆర్‌తో పార్టీకి నష్టం జరుగుతున్నదనే భావనలో కేసీఆర్ ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం కేసీఆర్ కుటుంబంలోనే పదవుల కోసం గొడవలు జరుగుతున్నాయన్నారు. అధికారం కోల్పోవడంతో కేటీఆర్‌కు పిచ్చిపట్టి సైకోరావుగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. తాను తప్పులు చేశానని కేటీఆర్‌కు తెలుసనీ, అందుకే జైలుకు పోతా..పోతా..అని కలువరిస్తున్నారని దెప్పిపొడిచారు. సరైన సమయం వచ్చినప్పుడు కేటీఆర్, కేసీఆర్ అరెస్టు అవుతారన్నారు. కేటీఆర్ తన పేయిడ్ సోషల్ మీడియాతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా కుటిల యత్నాలు పన్నుతున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వంపై తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్న పెయిడ్ సోషల్ మీడియా వాళ్లకు, యూట్యూబర్లకు భార్యలు, తల్లులు లేరా? అని ప్రశ్నించారు. కించపరిచే వ్యాఖ్యలు చేసేవారిపై కచ్చితంగా చర్యలుంటాయని స్పష్టం చేశారు. ఇంకా నాలుగేండ్లు తమకు అవకాశం ఉందనీ, ఇచ్చిన హామీలు అమలు చేస్తామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో హాస్టళ్లలో ఫుడ్‌పాయిజన్ అయినప్పుడు ఎవరినైనా ఆదుకున్నారా? ఒక్కసారైనా బాధిత కుటుంబాలను పరామర్శించారా? అని నిలదీశారు. వాంకిడి ఘటన జరిగిన వెంటనే తాము స్పందించామనీ, మంత్రులుగా తానూ, సీతక్క, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ బాధిత కుటుంబాన్ని పరామర్శించామని గుర్తుచేశారు. నిజంగా బాధ ఉంటే ఆ అమ్మాయి కుటుంబానికి సైకోరావు ఒక కోటి రూపాయలు ఇవ్వాలని సూచించారు. గురుకులాలకు బాధ్యులుగా ఉన్న సమయంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కోట్ల రూపాయలు దుర్వినియోగం చేశారనీ, గతంలో ఆయనపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్, గ్యాదరి కిషోర్‌లు స్వయంగా అసెంబ్లీలోనే ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో 103 గురుకుల పాఠశాలల భవనాలు బీఆర్ఎస్ నేతల బంధువుల బిల్డింగ్‌లలోనే నడిచాయనీ, వాటికి సంబంధించిన కమిషన్ ఎవరి జేబుల్లోకి వెళ్ళిందో అందరికీ తెలుసు అని చెప్పారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అనుచరగణం లక్షల రూపాయలు వసూలు చేసి ఆయన ఖర్చులకు ఇచ్చేదని ఆరోపించారు. బీఆర్ఎస్‌పై వ్యతిరేకతతో ఉన్న దళిత ఓటర్లను కాంగ్రెస్ వైపు రాకుండా చూసేందుకే ఆర్ఎస్‌పీ ప్రవీణ్‌కుమార్ బీఎస్పీలో చేరి పోటీచేశారని విమర్శించారు. ఎన్నికలు అయిపోగానే తిరిగి బీఆర్ఎస్‌లో చేరిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు అన్ని గురుకులాల్లోనూ ఆయన పెట్టుకున్న టీములు పనిచేస్తున్నాయన్నారు. కమ్యూనిటీ రిలేషన్ ఆఫీసర్ ను పెట్టుకుని పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. దీనిపై కూడా లోతుల్లోకి వెళ్లి ఆరా తీస్తున్నామన్నారు. నిబంధనల మేరకు కొత్తగా టెండర్లు వేసి కొత్తవారికి కాంట్రాక్టులు ఇస్తున్నామని చెప్పారు. పులిదాడి ఘటనలో చనిపోయిన మహిళ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారాన్ని వెంటనే వర్తింపజేశామని తెలిపారు. కవ్వాల్ అటవీ ప్రాంతంలోని వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే పనులకు వెళ్లాలని సూచించారు.

అదానీ వ్యవహారంపై జేపీసీ వేయాల్సిందే

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

- 9న బస్ భవన్ ముందు ధర్నా : సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కార్యదర్శి రంగారావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అదానీ వ్యవహారంపై జేపీసీ వేయాల్సిందేనని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో ఆ పార్టీ నేతలు కె సూర్యం, ఎం హన్మేష్, కె స్వరూప, కెఎస్ ప్రదీప్‌తో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదానీతో మోడీ, అమిత్‌షాకు విడదీయలేని బంధం ఉన్నదనీ, అందుకే ఆయన వ్యవహారంలో జేపీసీ వేసేందుకు జంకుతున్నారని ఆరోపించారు. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయటంలో రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమయిందని విమర్శించారు. ఉచిత బస్సు ప్రయాణమంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం మూడు వేల బస్సులను ఎందుకు తగ్గించిందో చెప్పాలని ప్రశ్నించారు. బస్సులు సరిపోక ఘర్షణలు జరుగుతున్నాయని తెలిపారు.తక్షణమే బస్సుల సంఖ్యను పెంచాలనే డిమాండ్‌తో వచ్చేనెల నాలుగున రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిపోల ముందు ఆందోళనలు, 9న హైదరాబాద్‌లోని బస్సు భవన్‌ముందు ధర్నా నిర్వహించనున్నట్టు ప్రకటించారు. సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో కలుషిత ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు గురికావటం ఆందోళన కలిగిస్తుందన్నారు. దీనిపై ప్రభుత్వం తగిన విధంగా స్పందించటంలో విఫలమయిందన్నారు. ఇలాంటి ఘటనలను సాకుగా చూపించి వంట బాధ్యతను స్వచ్ఛంద సంస్థలకు అప్పగించే కుట్ర జరుగుతున్నదని ఆరోపించారు. శ్రీచైతన్య, నారాయణలాంటి ప్రయివేటు విద్యా సంస్థలకు లబ్ది చేకూర్చేందుకు చర్యలు చేపడుతున్నట్టు విమర్శలున్నాయని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థి సంఘాల ఆందోళనకు మాస్‌లైన్ మద్దతు ప్రకటిస్తున్నదన్నారు. ఆటో వర్కర్స్‌కు ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలనీ, ఆటో మోటారు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో వర్కర్స్ బందుకు వచ్చే నెల 7న బంద్‌కు పిలుపునిచ్చామని చెప్పారు. మూసీ, హైడ్రా విషయంలో పేదలకు ప్రత్యామ్నాయం చూపించిన తర్వాతనే ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల నుంచి బలవంతంగా భూములను లాక్కోవడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తంచేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రయివేటు మెడికల్ షాపుల దందా పెరుగుతున్నదనీ, వాటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పోటు రంగారావు చెప్పారు.

13 జిల్లాల్లో స్పౌజ్ బదిలీలు

చేపట్టాలి : టీపీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 317 జీవోపై మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం పొందిన 13 జిల్లాల స్పౌజ్ టీచర్ల బదిలీలను వెంటనే చేపట్టాలని టీపీటీఎఫ్ ప్రభుత్వాన్ని కోరింది. శుక్రవారం హైదరాబాద్‌లో టీపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎన్ తిరుపతి ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్జీటీలకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన వ్యవహారంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల సస్పెన్షన్లను ఎత్తేయాలని కోరారు.

తెలంగాణ వ్యతిరేకులతో కేటీఆర్ సంబురాలా?

- ఫిషరీస్ చైర్మెన్ మెట్టుసాయికుమార్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర విభజన వ్యతిరేకులైన మాజీ మంత్రులు తలసాని శ్రీనివాసయాదవ్, గంగుల కమలాకర్ పక్కన పెట్టుకుని కేటీఆర్ దీక్షా దివస్ సంబురాలా? అని ఫిషరీస్ చైర్మెన్ మెట్టు సాయికుమార్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ నేతల జీవితమంతా అబద్ధాలేనని విమర్శించారు. కేసీఆర్ లేకపోతే కేటీఆర్ ఎవరు? ఆయన స్థాయి ఎంత? బతుకెంత? అని ప్రశ్నించారు. కేటీఆర్ లాంటి కంచరగాళ్లకు తాము బయపడుతామా? కేటీఆర్ డ్రగ్స్ తీసుకోకుండా బయటకు వస్తాడా? కేటీఆర్ అనుకోకుండా లీడర్ అయ్యారని ఎద్దేవా చేశారు. పదేండ్ల పాలనలో విద్యార్థులను, రైతులను అరెస్టు చేసి జైళ్లకు పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌పై ఇంకోసారి పిచ్చిపిచ్చిగా మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎవరు, ఎవర్ని ఉరికిస్తారో చూసుకుందామా? అని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పేరు పెట్టుకున్న రోజే తెలంగాణతో మీకు పేగు బంధం తెగిపోయిందని తెలిపారు. ఇప్పటికైనా కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి

హైకోర్టులో ఊరట

- రెండు ఎఫ్ఐఆర్‌లు కొట్టివేత

నవతెలంగాణ-కొడంగల్

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై నమోదైన మూడు ఎఫ్ఐఆర్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లను హైకోర్టు కొట్టివేసింది. వికారాబాద్ జిల్లా లగచర్ల దాడి ఘటనలో బొంరాస్‌పేట పోలీసులు పట్నం నరేందర్‌రెడ్డిపై 3 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఒకే ఘటనపై పోలీసులు మూడు కేసులు నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే హైకోర్టును ఆశ్రయించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఒకే ఘటనపై వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయొద్దని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావించారు. పోలీసుల తరపున ఏఏజీ రజనీకాంత్ వాదన వినిపిస్తూ లగచర్లలో జరిగిన దాడి ఆధారంగా పోలీసులు వేర్వేరు కేసులు నమోదు చేశారని కోర్టుకు వివరించారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు ఈ నెల 25న తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా శుక్రవారం తీర్పు వెలువరించింది. పట్నం నరేందర్‌రెడ్డి తరపు లాయర్ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు రెండు కేసులను కొట్టివేయాలని తీర్పు ఇచ్చింది.

డిజిటల్ అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

వ్యవస్థీకృత సైబర్ నేరాలలో 'డిజిటల్ అరెస్టులు' అనేవి పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ఈ సైబర్ నేరాల కారణంగా భారతీయులు రాబోయే సంవత్సరంలో రూ.1.2 లక్షల కోట్లు నష్టపోతారని, ఇది జీడీపీలో 0.7 శాతమని 14సీ అంచనా వేసింది. ఈ సంవత్సరం నవంబర్ 11వ తేదీ వరకూ కేంద్ర విదేశాంగ శాఖ సైబర్ నేరాల పోర్టల్ నమోదు చేసిన ఆర్థిక నేరాల విలువ రూ.19,888.42 కోట్లు. ఇలాంటి నేరాలు జరిగినప్పుడు హెల్ప్‌లైన్ నెంబర్ 1930కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఇందులో ఇప్పటి వరకూ 14.41 లక్షల కాల్స్ నమోదయ్యాయి. గత సంవత్సరం 15.56 లక్షల కాల్స్ వరకూ వచ్చాయి.

వేర్వేరు ఖాతాలకు 'మోసం' సొమ్ము బదిలీ

సైబర్ నేరాలు అనేక రూపాలలో జరుగుతుంటాయి. మీకు వచ్చిన పార్శిల్ కస్టమ్స్ శాఖ వద్ద ఉన్నదని, అందులో కొన్ని నిషిద్ధ వస్తువులు ఉన్నాయని, ఈ కేసు నుండి తప్పించుకోవాలంటే తాము చెప్పిన బ్యాంక్ ఖాతాలకు సొమ్మును బదిలీ చేయాలని చెబుతారు. వారు చెప్పినట్లు ఆ ఖాతాలలో సొమ్ము జమ చేశామా ఇక మోసగాళ్లు పత్తా ఉండరు. వారి ఫోన్లు స్విచ్చాఫ్ అయి ఉంటాయి. ఒకవేళ ఆ బ్యాంక్ ఖాతాల నుండి సొమ్ము బదిలీ కాకుండా అడ్డుకుందామని అనుకున్నా ఫలితం ఉండదు. ఎందుకంటే అప్పటికే ఆ సొమ్ము వేర్వేరు ఖాతాలకు బదిలీ అవుతుంది. నేరస్థులు డబ్బు జమ చేసే వరకూ ఫోన్ చేస్తూ బాధితులను భయభ్రాంతులను చేస్తూనే ఉంటారు.

ఎలా మోసం చేయాలో శిక్షణ ఇస్తారు

ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఓ వైద్యుడిని 48 గంటల పాటు డిజిటల్‌గా నిర్బంధించి, ఆయన వద్ద నుండి రూ.48 లక్షలు గుంజే వరకూ నేరగాళ్లు నిద్రపోలేదు. ఒకరి తర్వాత మరొకరు ఫోన్ చేస్తూ భయపెడుతూనే ఉంటారు. దీనినే 'డిజిటల్ అరెస్ట్' అంటారు. ఎట్టకేలకు లక్నో పోలీసులు విచారణ జరిపి హర్యానాలోని గురుగ్రామ్ నుండి ఐదుగురు సైబర్ మోసగాళ్లను అరెస్ట్ చేశారు. సైబర్ నేరాలకు పాల్పడే వారు ముందుగా ఓ ముఠాను ఏర్పాటు చేసుకుంటారు. వారికి సీబీఐ, పోలీస్, క్రైమ్‌బ్రాంచ్, మాదక ద్రవ్యాల విభాగం అధికారులమని చెప్పి ప్రజలను ఎలా మోసగించాలో వారికి శిక్షణ ఇస్తారు.

యువతకు వల

కాంబోడియా, మయన్మార్, లావోస్, అజర్‌బైజాన్ వంటి ఆసియా దేశాలు ఈ సైబర్ మోసాలకు కేంద్రాలుగా ఉన్నాయని 14సీ గుర్తించింది. ఈ దేశాల నుండే కాల్ సెంటర్లు పని చేస్తుంటాయి. థాయ్‌లాండ్‌లో ఐటీ లేదా అడ్మినిస్ట్రేటివ్ ఉద్యోగాలు ఉన్నాయని నమ్మించి మన దేశానికి చెందిన యువతను రిక్రూట్ చేసుకుంటున్నారని అక్టోబరులో విడుదలైన ఐరాస నివేదిక తెలిపింది. ఆ తర్వాత సరిహద్దులు దాటించి కాంబోడియా, మయన్మార్, లావో పీడీఆర్ పంపుతారు. ఈ సంవత్సరం మే-ఆగస్ట్ మధ్యకాలంలో నేరస్థుల వలలో చిక్కుకున్న 1,300 మంది నిరుద్యోగ యువతను అధికారులు కాపాడారు.

అద్దెకు బ్యాంక్ ఖాతాలు

కాంబోడియా, మయన్మార్ దేశాలలో నేరస్థులకు స్థావరాలు ఉంటాయి. నేరస్థుల ఆదేశాల మేరకు బాధితులు ఎవరి ఖాతాల్లో సొమ్ము జమ చేస్తారో వారికి 30 శాతం వరకూ కమిషన్ అందుతుంది. కొందరైతే తమ బ్యాంక్ ఖాతాలను నేరగాళ్లకు అద్దెకు ఇస్తారంటే అతిశయోక్తి కాదు.

బాధితుల సొమ్మును కొంత కాలం పాటు నిల్వ చేసుకుంటున్న వేలాది ఖాతాలను ప్రతి రోజూ గుర్తిస్తూనే ఉంటామని 14సీ చెప్పింది. గత సంవత్సర కాలంలో ఇలాంటి ఏడు లక్షల ఖాతాలను బ్లాక్ చేశారు. 'ప్రజల మనసులో ఉండే భయాన్ని మోసగాళ్లు సొమ్ము చేసుకుంటారు.

బాధితుడు తన ఆధార్ నెంబర్ ఇస్తే వారు అందులోని సమాచారాన్ని దుర్వినియోగం చేస్తారు. మీరు బలహీనులైతే వారు మీ మనసుతో ఆడుకుంటారు. చివరికి ఆ వ్యక్తి మోసానికి గురవుతాడు' అని అధికారులు తెలిపారు.

బాధితులకు అందింది గోరంతే

నేరం జరిగిన 24 గంటల్లోగా సమాచారం అందిస్తే ఫలితం ఉంటుంది. 14సీ ఆధ్వర్యంలో నడిచే హెల్ప్‌లైన్, పోర్టల్ రాష్ట్రాల పోలీస్ విభాగాలతో అనుసంధానమై ఉంటుంది. బ్యాంకులు, పేమెంట్ వాలెట్లకు 14సీ నుంచి హెచ్చరికలు జారీ అవుతాయి. దీంతో అవి ఆయా ఖాతాలను స్తంభింపజేస్తాయి. అయితే ఈ ఏడాది మొదటి ఆరు నెలల కాలంలో రూ.11,269 కోట్ల మేర మోసం జరిగిందని 14సీ సమాచారం చెబుతోంది. ఇందులో రూ.1,361 కోట్లను బ్యాంకులు ఫ్రీజ్ చేశాయి. కానీ బాధితులకు రూ.11.97 కోట్లు మాత్రమే వాపసు చేశారు.

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 30-11-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

జీడీపీ ఢమాల్



సెప్టెంబర్ త్రైమాసికంలో 5.4 శాతమే

దాదాపు రెండేండ్ల కనిష్టానికి పతనం

ఆర్‌బీఐ అంచనాలకు బహు దూరం


తయారీ, గనుల రంగాలు డీలా

వ్యవసాయం భళా : ఎన్‌ఎస్‌ఓ

వివరాలు 11లో

సంపుటి : 10 | సంచిక : 284 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50

భూసేకరణ రద్దు



నోటిఫికేషన్ ఉపసంహరించుకున్న ప్రభుత్వం

- ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో మరో ప్రయత్నం
- టెక్స్‌టైల్ కంపెనీలపై సర్కారు దృష్టి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం వికారాబాద్ జిల్లా లగచర్ల ఫార్మా కంపెనీల భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దుచేసింది. నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకుంటూ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. లగచర్లలోని 580 మంది రైతులకు చెందిన 632 ఎకరాలను సేకరించాలని గతంలో సర్కారు నిర్ణయించిన సంగతి తెలిసిందే. గత ఆగస్టు 1న ఈ నోటిఫికేషన్‌ను జారీ చేసిన ప్రభుత్వం రైతుల ఆందోళనల నేపథ్యంలో వెనక్కి తీసుకుంది.

అసలు జరిగిందేంటి ?

ఔషధ పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ నిమిత్తం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో నిర్వహించతలపెట్టిన గ్రామసభ గందరగోళమైంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో జరిగిన ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. భూసేకరణకు వ్యతిరేకంగా స్థానిక రైతులు గత కొంతకాలంగా నిరసనలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజాభిప్రాయ సేకరణ కోసం గ్రామసభ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా కలెక్టర్ సహా ముఖ్య అధికారులంతా అక్కడికి వెళ్లారు. ఆ సమయంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్(కడా) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిని ఆయా గ్రామాల రైతులు ఘేరావ్ చేశారు. ఈ సందర్భంగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. దాడిలో పలువురు అధికారులకు గాయాలయ్యాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మాజీ ఎమ్మెల్యేతో సహా పలువురిని అరెస్టు చేసి జైలుకు పంపారు. అధికార, ప్రతిపక్షాల మధ్య ఈ విషయమై వాదోపవాదాలు, పరస్పర ఆరోపణల మధ్య రాష్ట్రవ్యాప్తంగా రాజకీయం వేడెక్కింది. ఈ పరిస్థితుల్లో



క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లిన వామపక్షాలు ప్రజలతో నేరుగా చర్చించడం, ఆపైన ప్రజాభిప్రాయాన్ని ముఖ్యమంత్రికి విన్నవించడం జరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలో లగచర్ల భూసేకరణ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకోవడం గమనార్హం.

మరో పేరుతో నోటిఫికేషన్ ?

ఫార్మా పరిశ్రమలను వ్యతిరేకిస్తూ ఆందోళన చేసిన రైతులను మెప్పించేందుకు సర్కారు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి గ్రామాల్లో చేసేందుకు మరో రూపంలో భూసేకరణ నోటిఫికేషన్ జారీచేయనుందని తెలిసింది. ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో ఇతర పరిశ్రమలను ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్నది. ఇతర కంపెనీలైతే పర్యావరణ కాలుష్యం ఉండబోదనీ, యువతకు భారీగా ఉద్యోగావకాలు వచ్చే అవకాశంముంటుందని ప్రభుత్వం భావిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ప్రధానంగా టెక్స్‌టైల్ కంపెనీలకు ప్రాధాన్యత ఇచ్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది.



వామపక్షాల పోరాట ఫలితమే

ఇది లగచర్ల ప్రజల విజయం : భూసేకరణ రద్దు పట్ల సీపీఐ(ఎం) హర్షం

పెండింగ్‌లో ఉన్న ఇతర డిమాండ్లను పరిష్కరించాలి : తమ్మినేని వీరభద్రం

వివరాలు 10లో

ఇందిరమ్మ ఇండ్లలో నిరుపేదలకు

తొలి ప్రాధాన్యం

వికలాంగులు, వ్యవసాయ కూలీలు సాగుభూమి లేని వారు, పారిశుద్ధ్య కార్మికులకు పెద్దపీట

పూర్తిస్థాయి సిబ్బందితో గృహ నిర్మాణ శాఖ బలోపేతం

లబ్ధిదారులు ఆసక్తి చూపితే అదనపు గదుల

నిర్మాణానికి అనుమతి : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి



నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అత్యంత నిరుపేదలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సూచించారు. వికలాంగులు, వ్యవసాయ కూలీలు, సాగుభూమిలేని వారు, పారిశుద్ధ్య కార్మికులు ఇలా ప్రాధాన్యతా క్రమం ఎంచుకోవాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇండ్లపై సమీక్ష నిర్వహించారు. తొలి దశలో సొంత స్థలాలున్న వారికే ప్రాధాన్యమిసున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో గ్రామ కార్యదర్శితో పాటు మండల స్థాయి అధికారులను బాధ్యులను చేయడంతోపాటు అవసరమైన సాంకేతికతను వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్‌లో ...11లో

తెలంగాణను నిలబెట్టిన

రైతన్నకు ప్రోత్సాహం

సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

1.53 కోట్ల టన్నుల వరి ధాన్యం పండించి దేశానికే అన్నపూర్ణగా తెలంగాణను రైతన్న నిలబెట్టారని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆ రైతన్నను ప్రజా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని శుక్రవారం చేసిన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఎకరాకు రూ.12 వేల బోనస్ ఇవ్వడం ద్వారా వ్యవసాయాన్ని పండగ చేసే ఈ ప్రయత్నం తనకు గొప్ప తృప్తిని ఇస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

వేగంగా తెలంగాణ తల్లి విగ్రహం

తయారీని పరిశీలించిన సీఎం 11లో

అదానీ వ్యవహారంపై సమాచారం లేదు



మొదటిసారి నోరు విప్పిన విదేశాంగ శాఖ ప్రతినిధి

న్యూఢిల్లీ : అదానీలపై అమెరికా నేరారోపణ పత్రాన్ని దాఖలు చేయడంపై కేంద్ర ప్రభుత్వం మొదటిసారిగా శుక్రవారం నోరు విప్పింది. "అమెరికా న్యాయ శాఖకు, ప్రైవేటు సంస్థలు, వ్యక్తుల మధ్య జరిగిన చట్టపరమైన విషయం" అని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వ్యాఖ్యానించారు. పైగా ఈ దర్యాప్తు గురించి ముందుగా భారత ప్రభుత్వానికి అమెరికా తెలియచేయలేదని వివరణ ఇచ్చారు. ఇప్పటివరకు అదానీల అరెస్టు వారంటు లేదా చట్టపరమైన అభ్యర్థనలకు సంబంధించి ...11లో

ప్రభుత్వరంగ సంస్థలు, సొసైటీలు, వర్సిటీ ఉద్యోగులకు శుభవార్త

ఐదు శాతం ఐఆర్ వర్తింపజేస్తూ ఉత్తర్వులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగులు, పెన్షనర్లతో సమానంగా అన్ని ప్రభుత్వరంగ సంస్థలు, సహకార సొసైటీలు, విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న బోధనేతర ఉద్యోగులకు మధ్యంతర భృతి (ఐఆర్) వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూలవేతనంపై ఐదు శాతం ఐఆర్‌ను మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు.

సీపీఎస్, యూపీఎస్ వద్దు..ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

ఎన్‌ఈపీని రద్దు చేయాలి : ఎస్‌టీఎఫ్‌ఐ మహా ధర్నా



నవతెలంగాణ–న్యూఢిల్లీ బ్యూరో

సీపీఎస్, యూపీఎస్ తమకు వద్దని, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీఎఫ్‌ఐ) ధర్నాలో వక్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద ఎస్‌టీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. " సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలి. ఎన్‌పీఎస్, జీపీఎస్, యూపీఎస్, పీఎఫ్ఆర్‌డీఏను వెనక్కి తీసుకోవాలి. జాతీయ విద్యా విధానం-2020ని ఉప సంహరించుకోవాలి. నాణ్యతతో కూడిన తప్పనిసరి ఉచిత విద్యను అందరికీ అందించాలి. తాత్కాలిక, అహడక్, కాంట్రాక్ట్, టెర్మ్ బేసిస్ టీచర్లను, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి. శాశ్వత ప్రాతిపదికన టీచింగ్, నాన్ టీచింగ్ ఖాళీలను భర్తీ చేయాలి. విద్యా హక్కు చట్టాన్ని 12వ తరగతి వరకు పొడిగించాలి. అందుకు చట్టం చేయాలి. పాఠశాలల మూసివేత, విలీనం ఆపాలి. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులకు కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలి" వంటి డిమాండ్లతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌టీఎఫ్‌ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేసీ హరికష్ణన్, సీఎన్ ...11లో



ఈ ఫలితాలు పెద్ద కుదుపే

కఠిన నిర్ణయాలతో పాటు క్రమశిక్షణా అవసరం : కాంగ్రెస్ చీఫ్ ఖర్గే

న్యూఢిల్లీ : మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని పరిణామాలతో కాంగ్రెస్ లోతుగా విశ్లేషణ చేస్తోంది. శుక్రవారం ఢిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అంచనాలను అందుకోలేకపోవడానికి మన పనితీరే పార్టీకి పెద్ద సవాల్‌గా మారిందని అన్నారు. ఈ విషయంలో కఠిన నిర్ణయాలతో పాటు క్రమశిక్షణ అవసరమని, ఈ ఫలితాల నుంచి ఇప్పటికైనా పాఠాలు నేర్చుకోవాలని పార్టీ నేతలకు సూచించారు.

పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయి నుంచి మార్పులు తీసుకురావాలి

"కాంగ్రెస్ ఎన్నికల వ్యూహాన్ని మెరుగుపరుచుకోవాలి. క్యాంపెయిన్ మెరుగుదలకు, తప్పుడు సమాచారాన్ని ఎదుర్కొనేందుకు మెరుగైన మార్గాలను అభివృద్ధి చేసుకోవాలి. దేశవ్యాప్తంగా ప్రజల ఎజెండాను అమలు చేసేందుకు మనం అధికారంలోకి రావడం చాలా ముఖ్యం. లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పెద్ద కుదుపే. ఇందుకు కఠినమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ ఫలితాలతో నిరాశ చెందకుండా పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయి నుంచి ఏఐసీసీ వరకు మార్పులు తీసుకురావాలి" అని ఖర్గే సూచించారు.



ఈవీఎంలతో ఎన్నికల ప్రక్రియ అనుమానాస్పదం!

"ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు ఎన్నికల ప్రక్రియను అనుమానాస్పదంగా మార్చాయి. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరిగేలా ఈసీ వ్యవహరించాలి. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో మహావికాస్ అఘాడీ కూటమి సాధించిన ఫలితాల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలను చూసి రాజకీయ విశ్లేషకులు కన్‌ఫ్యూజన్‌లో ఉన్నారు. ఇప్పటికైనా సమయానుకూలంగా వ్యూహరచన చేసి పార్టీని బలోపేతానికి నేతలంతా మరింత కష్టపడాలి. అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందు నుంచే సిద్ధం కావాలి. ఓటర్ల జాబితాలను పరిశీలించాలి."

క్రమశిక్షణే ఆయుధం

"పార్టీలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యం. అందరం ఐక్యంగా ఉండాలి. ఇదే మన ఆయుధం. పార్టీ విజయమే తమ గెలుపు అని అనుకోవాలి. పార్టీ బలంపైనే మన శక్తి ...11లో



గుజరాత్ గులాములు..

ఢిల్లీ కీలుబొమ్మలు

ఇలాంటి వారితో తెలంగాణ అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి ప్రమాదం

ఆనాడు ఉద్యమంపై గన్నెక్కుపెట్టిన సీఎం రేవంత్

తెలంగాణ ఆనవాళ్లను చెరిపేసేందుకు కుట్రలు పన్నుతున్నడు

ప్రతీ విషయంలోనూ ప్రభుత్వంపై ప్రతిఘటనే : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గుజరాత్ గులాములు, ఢిల్లీ కీలు బొమ్మలతో తెలంగాణ అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి ప్రమాదం పొంచి ఉందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆనాడు ఉద్యమంపై గన్నెక్కుపెట్టిన వ్యక్తే నేడు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారంటూ ఆయన వ్యాఖ్యానించారు. అలాంటి సీఎం... తెలంగాణ ఉద్యమ రథసారథి కేసీఆర్ ఆనవాళ్లే లేకుండా చేస్తానంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. తద్వారా ...10లో

భగ్గుమన్న పార్లమెంట్

అదానీ, మణిపూర్, సంభాల్ హింసపై చర్చకు ప్రతిపక్షాలు పట్టు



మోడీ సర్కార్ నిరాకరణ

నిమిషాల్లో పార్లమెంట్ వాయిదా

నవతెలంగాణ–న్యూఢిల్లీ బ్యూరో

అదానీ ముడుపుల వ్యవహారం, మణిపూర్ హింస, ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో శాంతి భద్రతల ఉల్లంఘన అంశాలపై చర్చించాలని ప్రతిపక్షాల నినాదాల హోరుతో పార్లమెంట్ దద్దరిల్లింది. ఈ అంశాలపై ప్రభుత్వం చర్చకు నిరాకరించడంతో పార్లమెంట్ నిమిషాల్లోనే సోమవారానికి వాయిదా పడింది. శుక్రవారం తొలుత లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాల హోరెత్తించారు. అదానీ ముడుపులు, లంచం వ్యవహారంపై ప్రధాని మోడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల ఆందోళన నడుమ స్పీకర్ ఓం బిర్లా ...11లో



తటస్థంగా వ్యవహరించాలి

శాంతి సామరస్యతలను కాపాడాలి : యూపీ పోలీసులకు, సంభాల్ జిల్లా యంత్రాంగానికి సుప్రీం ఆదేశాలు

వివరాలు 11లో


డిజిటల్ అరెస్ట్

ఇదో రకం సైబర్ నేరం

- బాధితుల బలహీనతతో ఆటలు
- ఫోన్ ద్వారా నిర్బంధించి...బెదిరించి...డబ్బు గుంజుతారు
- భయపడ్డామా అంతే సంగతులు
- 24 గంటల్లో ఫిర్యాదు చేస్తేనే ప్రయోజనం



దేశంలో డిజిటల్ మోసాలు నానాటికీ పెరిగిపోతున్న సంగతి తెలిసిందే. వీటి బారిన పడి అనేక మంది భారీగా డబ్బు పోగొట్టుకుంటున్నారు. అవమానభారంతో కొందరు ప్రాణాలు తీసుకుంటున్నారు కూడా. తాజాగా 'డిజిటల్ అరెస్ట్' పేరుతో ఓ కొత్త కుంభకోణం పుట్టుకొచ్చింది. ఇప్పటికే వేలాది మంది దీనికి బాధితులుగా మారారు. ముందుగా ఫోన్ చేసి ఏదో కేసులో మీ కుమారుడో లేదా కుమార్తో అరెస్టయ్యారని చెబుతారు. కేసును మాఫీ చేయాలంటే డబ్బు ముట్టజెప్పాలని తొందరపెడతారు. వారి మాటలు నమ్మి సొమ్ము సమర్పించుకుంటే అంతే సంగతులు...ఆనక మోసం జరిగిందని గ్రహించినా పెద్దగా ప్రయోజనం ఉండదు.



న్యూఢిల్లీ : ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుండి నవంబర్ 15వ తేదీ వరకూ దేశవ్యాప్తంగా 92,323 'డిజిటల్ అరెస్ట్' కేసులు వెలుగు చూశాయి. వీటి ద్వారా రూ.2,140.99 కోట్ల ప్రజల సొమ్ము మోసగాళ్ల పరమైందని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ సైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (14సీ) తెలిపింది. అయితే ఇవన్నీ పోలీసులకు ఫిర్యాదు చేసిన కేసుల వివరాలే. చాలా మంది ఫిర్యాదు చేయకుండా మిన్నకుండిపోతారు. ఈ కొత్త సైబర్ నేరం విషయంలో జాగ్రత్తగా ఉండాలని ప్రధాని నరేంద్ర మోడీ అక్టోబర్ 27న ప్రజలను హెచ్చరించారు. నేరస్థులు ముందుగా ప్రజల వ్యక్తిగత వివరాలు సేకరిస్తారు. ఆ తర్వాత వారికి ఫోన్ చేస్తారు. వివిధ ప్రభుత్వ సంస్థలకు చెందిన అధికారులమంటూ పరిచయం చేసుకుంటారు. కొందరైతే రిజర్వ్‌బ్యాంక్ నుండి అని చెబుతారు. ఏదో మోసం జరిగిపోయిందని, కేసును మూసేయాలంటే డబ్బు ఇవ్వాలని బెదిరిస్తారు. దీంతో భయాందోళనలకు గురైన బాధితులు వారు అడిగినంత సొమ్ము ముట్టజెబుతారు. పెరుగుతున్న సైబర్ నేరాలు దేశంలో చోటుచేసుకుంటున్న ...2లో

సంపాదకీయం

నేడు అజ్మీర్ షరీఫ్.. రేపు..?



మొన్నటిదాకా అయోధ్య, బాబ్రీ మసీదు, రామమందిరం...! ఆ వివాదం ముగిసిందో లేదో వారణాసి, జ్ఞానవాపి మసీదు, విశ్వేశ్వరాలయం...!! తాజాగా ఆ జాబితాలో రాజస్థాన్‌లోని అజ్మీర్ షరీఫ్ చేరింది. అసలీ దేశంలో ఇవి తప్ప ఇంతకు మించిన సమస్యలే లేవా? అంతులేని అసమానతలు, అదుపులేని ధరలు, అంతకుమించిన ఆకలి, నిరుద్యోగంతో ప్రజాజీవితం అంతకంతకూ అగాథంలోకి జారుతుంటే, ఇవేవీ కనీస చర్చకు నోచుకోకపోవడం వైచిత్రి! మన ప్రయాణం ఏవైపునకు సాగుతుందో తెలుసుకోడానికి ఇంతకంటే ఉదాహరణలేం కావాలి? పాలకులు మనుషుల్ని మతాలుగా చీల్చేస్తున్నారు. 2024 ఎన్నికల ముందు జ్ఞనవాపి వివాదం తెరమీదికి వచ్చింది. త్వరలో మరి కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అజ్మీర్ షరీఫ్ దర్గా శివాలయం అన్న అర్జీ దాఖలైంది. రాజస్థాన్ కోర్టు ఆ పిటిషన్ విచారించడానికి అంగీకరించింది. దర్గా కమిటీకి, భారతీయ పురాతత్వశాఖకు, మైనారిటీశాఖకు సైతం నోటీసులు జారీ చేసింది. సర్వే చేయించడానికి సిద్ధపడింది. ప్రజల భావోద్వేగాలతో చెలగాట మాడటం, వారి నెత్తుటి ధారలతో పీఠాలకు బాటలు వేసుకోవడం ఈ పాలకులకు కొత్తేమీకాదు గానీ, ఈ ఉన్మత్త రాజకీయాల పట్ల ప్రజల ఉదాసీనతే అవాంఛనీయం. న్యాయస్థానాలు కూడా ఇది గుర్తించక పోవడం ఆందోళనాకరం. అందుకే కండ్లకు కాషాయం పులిమి మరీ సామరస్యాన్ని కూల్చేస్తున్నారు.

1947 ఆగస్టు 15నాటికి దేశంలోని దేవాలయాలు, మసీదులు, చర్చిలు, ఇతర ప్రార్థనా స్థలాలన్నీ ఎలా ఉన్నాయో అలాగే ఉంచాలి తప్ప వాటిలో ఎలాంటి మార్పులకు, వివాదాలకు చోటివ్వరాదని నిర్దేశిస్తుందీ చట్టం. ఇప్పుడు అలాంటి వాటి గురించే వివాదాలు లేవనెత్తుతూ పిటిషన్లు దాఖలు చేస్తే వాటిని విచారణకు స్వీకరించడం ఆ చట్టాన్ని ఉల్లంఘించడమేనని జడ్జీలకు ఎందుకు తట్టదో అంతుపట్టదు. 1991 నాటి చట్టాన్ని ఉల్లంఘిస్తే మూడేండ్లు జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం చట్టంలోనే ఉంది. అర్జీలు పెటుకున్నవారికి, వాటిని విచారించిన జడ్జీలకు ఈ చట్టం కింద శిక్ష పడ్డ దాఖలాలు ఎక్కడా లేవు.

అజ్మీర్ షరీఫ్ ఖాజా మొయినుద్దీన్ చిష్టీ దర్గా కింద దేవాలయం ఉందని మధ్యాహ్నం అర్జీ దాఖలు చేస్తే వెంటనే కోర్టు దాన్ని విచారణకు స్వీకరిస్తుంది. పురాతతత్వ శాఖ సర్వే ప్రారంభిస్తుంది. కానీ, ముస్లింలపై దాడులు, మూక హత్యలు గత పదేండ్ల నుంచి కొనసాగుతూనే ఉన్నాయి. వీటి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇది సంఘ్ పరివార్ ఎజెండా అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అజ్మీర్ దర్గా కింద శివాలయం ఉందన్న వాదన మూడేండ్ల నుంచి కొనసాగుతూనే ఉంది. ప్రకటనల మీద ప్రకటనలు జారీ చేస్తూనే ఉన్నారు. అజ్మీర్ షరీఫ్ దర్గా దాదాపు 400 ఏండ్ల నుంచి ఉంది. అన్ని మతాలవారు ఈ దర్గా సందర్శిస్తారు. ఒక రకంగా దర్గాలు భిన్నత్వంలో ఏకత్వానికి తార్కాణం. ఈ దర్గాను "సంకట్ మోచన్ మహాదేవ్" దేవాలయంగా ప్రకటించాలని హిందూ సేనకు చెందిన విష్ణు గుప్తా పిటిషన్ దాఖలు చేశారు. సదరు విష్ణు గుప్తాకు దర్గా కింది హరిహర దేవాలయం ఉన్నట్టు కల వచ్చిందట. ఆ కల ఆధారంగా ఆయన పిటిషన్ దాఖలు చేశారు. విజ్ఞత గల కోర్టు దాన్ని విచారించ డానికి అంగీకరించడం విషాదం.

ఇందులో విష్ణు గుప్తా మత రాజకీయ చదరంగంలో చిన్నపావు కావొచ్చు. దీని వెనక పెద్ద ప్రణాళిక ఉందనడం మాత్రం సత్యం. ఈ దర్గాకు సంబంధించిన రిజిస్ట్రేషన్లన్నింటీ రద్దు చేయాలని కూడా అభ్యర్థించారు. ఈ దర్గా పర్యవేక్షణ ప్రధాన ద్వారం హిందూ వాస్తుశాస్త్రానికి అనుగుణంగా ఉన్నట్టు కనిపిస్తోందని ఈ పిటిషన్‌లో పేర్కొన్నారు. సంభాల్లో ఇటీవలే మత కలహాలు జరిగాయి. అక్కడ కూడా వివాదం మసీదు కింద మందిరం ఉందనేదే.

అయితే, ఇలాంటి పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకోగలిగిన కోర్టులు, 1991 ప్రార్థనా స్థలాల చట్టాన్ని మాత్రం విస్మరించడం విడ్డూరం! 1947 ఆగస్టు 15నాటికి దేశంలోని దేవాలయాలు, మసీదులు, చర్చిలు, ఇతర ప్రార్థనా స్థలాలన్నీ ఎలా ఉన్నాయో అలాగే ఉంచాలి తప్ప వాటిలో ఎలాంటి మార్పులకు, వివాదాలకు చోటివ్వరాదని నిర్దేశిస్తుందీ చట్టం. ఇప్పుడు అలాంటి వాటి గురించే వివాదాలు లేవనెత్తుతూ పిటిషన్లు దాఖలు చేస్తే వాటిని విచారణకు స్వీకరించడం ఆ చట్టాన్ని ఉల్లంఘించడమేనని జడ్జీలకు ఎందుకు తట్టదో అంతుపట్టదు. 1991 నాటి చట్టాన్ని ఉల్లంఘిస్తే మూడేండ్లు జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం చట్టంలోనే ఉంది. అర్జీలు పెటుకున్నవారికి, వాటిని విచారించిన జడ్జీలకు ఈ చట్టం కింద శిక్ష పడ్డ దాఖలాలు ఎక్కడా లేవు.

హిందూ రాజులే హిందూ దేవాలయాలను కొల్లగొట్టిన సందర్భాలు కూడా కోకొల్లలు. ఈ దేశంలో దేవాలయాల విధ్వంసం ఓ కాదనలేని చారిత్రక సత్యం. ఇందుకు ఏ మతానికీ మినహాయింపు లేదు. అదే సమయంలో ఈ విధ్వంసాలు, మత విద్వేషాలు మధ్యయుగాల నాటి అజ్ఞానానికీ, అనాగరికానికీ, రాజ్యవిస్తరణ కాంక్షకూ ప్రతీకలు అనడం కూడా అంతే వాస్తవం. కానీ ఈ తరతరాల మూఢత్వాన్నీ మూర్ఖత్వాన్నీ ఛేదించుకుని శాంతీ, సహజీవనం, సామరస్యాలను సాధించింది పరిణామం. వీటిని కాపాడుకోవడం, మరింత ముందుకు తీసుకుపోవడం నేటి ఆధునిక సమాజ లక్ష్యాలు కావాలి తప్ప, తిరోగమనంలోకి నడవడం కాదు కదా..?!

తెలుగు వెలుగుల నీడ 'గురజాడ'

'దేశమును ప్రేమించమన్నా,మంచి అన్నది పెంచమన్నా, వొట్టి మాటలు కట్టిపెట్టోయ్, గట్టి మేలు తల పెట్టవోయ్, పాడి పంటలు పొంగి పొరలె దారిలో నువ్వుపాటు పడవోయ్,తిండి కలిగితే కండ కలదోయ్,కండ కలవాడె మనిషోయ్" ఈ దేశభక్తి గీతం ఎవరు రాశారని అడిగితే ఇట్టే చెప్పే సమాధానం గురజాడ అప్పారావు. తన రచనల ద్వారా వాడుక భాష వ్యాప్తికి, సమాజ సంస్కరణకి కృషి చేసిన ఆయన అభ్యుదయ కవితా పితామహుడిగా కీర్తి గడించారు. తెలుగు సాహిత్య రంగంలో తన కంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న సాహితీకారుడు.1862 సెప్టెంబర్ 21న ఉమ్మడి ఏపీలోని విశాఖపట్నం జిల్లా యలమంచిలి మండలం రాయవరం గ్రామంలో జన్మించిన ఆయన 1915 నవంబర్ 30న 53 ఏండ్ల వయసులో మృతిచెందారు. విజయనగరంలోనే స్థిరపడ్డ గురజాడ తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన



మహాకవి. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారులలో ఒకరు, హేతువాది. 19వ, 20వ శతాబ్ది మొదటి దశకంలోనూ అతను చేసిన రచనలు ఈనాటికీ ప్రజల మన్ననలను పొందుతున్నాయి. అతను ప్రజలందరికీ అర్థమయ్యే జీవభాషలో రచనలు చేశారు. వీరి కన్యాశుల్కం నాటకానికి సాహితీ లోకంలో ఒక ప్రత్యేకమైన స్థానం. ఈ నాటకంలో అతను సృష్టించిన గిరీశం, మధురవాణి రామప్ప పంతులు మొదలైన పాత్రలు ప్రఖ్యాతి పొందాయి. అభ్యుదయ కవితా పితామహుడు అని బిరుదు పొందిన అప్పారావు, తెలుగు సాహిత్యంలో వాడుక భాష ఒరవడికి కృషి చేసిన వారిలో ముఖ్యుడు. విజయనగరంలో ఆయన డిగ్రీ చదువుతున్నప్పుడు వాడుక భాషా ఉద్యమ నాయకుడు గిడుగు రామమూర్తి అతనికి సహాధ్యాయి.వారిద్దరూ ప్రాణస్నేహితులు. గిడుగు రామమూర్తితో కలిసి వాడుక భాషా వ్యాప్తికి ఉద్యమించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కన్యాశుల్కము నాటకాన్ని 1890 ప్రాంతాల్లో పూర్తి వాడుకభాషలో రచించారు. ఆ రోజుల్లో ప్రబలంగా వున్న కన్యాశుల్కం, వేశ్యావృత్తి వంటి దురాచారాలపై విమర్శ ఈ నాటకానికి కథావస్తువు. ఇప్పుడు మనకు దొరుకుతున్న కన్యాశుల్కం రెండవ కూర్పును 1909లో రచించారు. 1892లో గురజాడ వారి కన్యాశుల్కము నాటకాన్ని తొలిసారిగా ప్రదర్శించారు. మొదటి ప్రదర్శనకే ఎంతో పేరు వచ్చింది. దీంతో సాహిత్యంలో వాడుక భాష ప్రయోగానికి ఒక రకంగా నాంది పలికినట్టయింది. గురజాడ, గిడుకు ఇద్దరూ కలిసి పత్రికల్లో, సభల్లో, మద్రాసు విశ్వవిద్యాలయంలో గ్రాంథిక భాషావాదులతో అలసట ఎరగకుండా తలపడ్డారు. గిడుగు వాదనాబలానికి, గురజాడ రచనాశక్తి వ్యవహారిక భాషోద్యమానికి వినియోగ పడ్డాయి.వీరు నాడు తెలుగు భాషకు చేసిన కృషికి మరింత వన్నెతెచ్చే విధంగా నేడు కవులు, రచయితలు రచనలు చేయాలి. తెలుగు భాషకు సాటి ఏదీ లేదని చాటిచెప్పాలి.

(నేడు గురజాడ వర్థంతి)

- కామిడి సతీష్‌రెడ్డి, 9848445134

'ప్రజాపాలన'లో కార్మికవర్గానికి ఒరిగిందేమిటి?



భూపాల్
9490098034

రాష్ట్రంలో కాంగ్రెసు అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కావస్తున్నది. ఈ సందర్భంగా ఆ పార్టీ ప్రజాపాలన పేరిట విజయోత్సవాలు జరుపుకుంటున్నది. అన్ని స్థాయిల్లోని ఉద్యోగులను, కార్మికులను, ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నది. సంవత్సర కాలంగా ప్రభుత్వం సాధించిన విజయాలను ఏకరువు పెడుతున్నది. వాస్తవంగా పదేండ్ల బీ(టీ)ఆర్ఎస్ పాలనతో విసిగిపోయిన ప్రజానీకం కాంగ్రెస్‌కు పట్టంగట్టింది. కాంగ్రెస్ ఆరుగ్యారంటీల పథకం కూడా ఇందుకు దోహదం చేసింది. మరి రాష్ట్ర ప్రభుత్వ పయనం ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా ఉందా? తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న విధానాలు ప్రజాపాలనేనా?

ప్రధానంగా కార్మికవర్గం సమస్యల్ని ఈ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నది. ఎన్నికల మేనిఫెస్టోలో కొన్ని కీలకమైన వాగ్దానాలు చేసింది. వాటి గురించి ముఖ్యమంత్రి గానీ, మంత్రులు గానీ ఎక్కడా ప్రస్తావించింది లేదు. విజ్ఞప్తులు చేస్తున్నా కార్మిక వర్గం పట్ల నిర్లక్ష ధోరణితో వ్యవహరిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిఆర్‌సి, కాంట్రాక్ట్ - ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమ బద్ధీకరణ, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, స్కీమ్ వర్కర్లలో అంగన్‌వాడీ టీచర్లకు నెలకు రూ.18వేలు, ఆశాలకు వేతనాల పెంపు, మధ్యాహ్న భోజనం కార్మికులకు రూ.10వేలు, బీడీ కార్మికులకు జీవిత బీమా, ఈఎస్ఐ, పరిధి వర్తింపు లాంటి హామీలనిచ్చింది. ఇంకా నిరుద్యోగుల కోసం నెలకు రూ.4వేల భృతి, వికలాంగుల నెలవారీ పెన్షన్ రూ.6వేలకు పెంపు, చక్కెర కర్మాగారాలు, పసుపు బోర్డుల ఏర్పాటు, పద్దెనిమిది సం॥లు పైబడిన ప్రతి విద్యార్థికి స్కూటీ, ఆడపిల్లల పెండ్లికి రూ.లక్షతో పాటు తులం బంగారం తదితర ముఖ్యమైన వాగ్దానాలు చేసింది. ఇవన్నీ కార్మికవర్గానికి వారి కుటుంబాలకు ప్రయోజనం కలి గించే హామీలు. వీటితో పాటు రాష్ట్రంలో కోటి ఇరవై లక్షల మంది కార్మికవర్గానికి వేతనాల సవరణ, సింగరేణికి కొత్త బొగ్గుబావులు, ఆర్టీసీ కార్మికుల హక్కుల పరిరక్షణకు కూడా హామీల్లోని ముఖ్యమైన అంశాలు. వీటిలో ఏ ఒక్కటీ కూడా అమలు చేయకపోవడం కార్మికవర్గాన్ని తీవ్ర అసంతృప్తికి గురిచేస్తున్నది. ఈ పరిస్థితిలో కొత్తసర్కార్ కార్మికవర్గానికి చేసిన మేలేంటి అనేది ఆత్మావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఏడాది కాలంలో పెట్టుబడిదారి వర్గానికి రెడ్ కార్పెట్ పరుస్తూ ఆర్థికరంగంలో బీజేపీ విధానాలనే కొనసాగిస్తున్నది.

రాష్ట్రంలో తొమ్మిది లక్షల మంది ప్రభుత్వ శాఖల్లో పనిచేసే

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్న విద్యుత్ రంగంలోని 23 వేల మంది ఆర్టిజన్ల సర్వీసులను జూనియర్ లైన్‌మెన్లుగా కన్వర్షన్ ఇవ్వాలని జెఏసిగా పోరాడుతున్నది. టీజీఎస్ఆర్టీసీలోని ఉద్యోగులకు పనిభారం పెరిగింది. మహాలక్ష్మి పథకం వల్ల మహిళలకు ఉపయోగపడినా బస్సుల సంఖ్య పెంచకపోవడం, ఉద్యోగులను రిక్రూట్ చేసుకోకపోవడంతో తీవ్ర ఇబ్బంది ఎదురవు తున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నియంతృత్వ ధోరణి వల్ల ఉద్యోగ సంఘాలకు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఆర్టీసీలో ఎన్నికలు వెంటనే నిర్వహించాలనే డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. తెలంగాణకు ఆదాయాన్ని సమకూర్చే నల్ల బంగారం (బొగ్గు) ఉత్పత్తి చేస్తున్న సింగరేణి సంస్థకు కొత్త బొగ్గు బావులు సాధించకుండా, వాటి కోసం కేంద్రంతో పోరాడకుండా లోపాయికారిగా వ్యవహరిస్తున్నది. తెలంగాణ బొగ్గు సింగరేణి హక్కు. కేంద్రం వేలంపాటలను వ్యతిరేకించడం లేదు.

కార్మికుల నుండి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఉన్నారు. వీరికి ప్రతి ఐదేండ్లకోసారి పిఆర్‌సి ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికే పదహారు నెలలు గడిచినా ఎప్పుడిస్తారన్నది తేల్చ లేదు. ఐదు డిఏలలో ఒక డిఏ ఇచ్చి చేతులు దులుపుకున్నది. ఇంకా నాలుగు డిఏలు బకాయి పెట్టింది. ఎప్పుడిస్తారన్నది చెప్ప డం లేదు. ప్రభుత్వ శాఖల్లో రెండులక్షల ఖాళీలుంటే అరకొరగా నోటిఫికేషన్లు వేసి పోలీసులు, టీచర్లు, వైద్యశాఖ తదితరాలలో కొన్ని పోస్టులు మాత్రమే భర్తీ చేసింది. నిరుద్యోగుల ఆకాంక్షలకనుగుణంగా ఖాళీ పోస్టుల భర్తీలేదు. నిరుద్యోగుల కోసం యూత్ కమిషన్ పేరిట రూ.పది లక్షల వడ్డీ లేని రుణం ఊసేలేదు. కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు విద్యాభరోసా కింద ఇస్తామన్న రూ.ఐదు లక్షల హామీ అటకెక్కింది. ఇవన్నీ అమలు చేస్తే కార్మిక కుటుంబాలకు పరోక్షంగా మేలు జరిగేది. రెండు లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులున్నారు. 1995 నుండి పనిచేస్తున్న వారు కూడా ఉన్నారు. వీరందరూ ప్రత్యేక రాష్ట్రం ఏర్ప డితే తాము పర్మినెంట్ అవుతామని ఆశించిన వారిని బీఆర్ఎస్ సర్కార్ మోసం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుంద నుకుంటే స్పందించడం లేదు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏజెన్సీలను రద్దుచేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. వీరందరినీ పర్మినెంట్ చేయడం వల్ల ప్రభుత్వంపై అదనపు భారమేమి పడదు. నిరుద్యోగుల ఉద్యోగాలకు సంబంధం ఉండదు. కానీ హైకోర్టు కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయరాదని ఉత్తర్వులిచ్చింది. దీన్ని ప్రభుత్వం సమీక్షించి అందర్నీ పర్మినెంట్ చేయాల్సిన అవసరం ఉన్నది.

రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో స్కీమ్ వర్కర్లది కీలక పాత్ర. నేషనల్ హెల్త్ మిషన్‌లోని పదిహేడు వేల మంది ఉద్యోగులను పర్మినెంట్ చేయాలనే డిమాండ్ ఉన్నది. కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు తమ సర్వీసులను పరీక్షా విధానం లేకుండా క్రమబద్ధీకరించాలని పోరుబాటలో ఉన్నారు. 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కరువైంది. ఆరోగ్యమిత్రలకు హామీనిచ్చిన డిఇఓ కేడర్ వేతనాలు పెంచడం లేదు. కాంట్రాక్ట్ పారామెడికల్ ఉద్యోగులందర్నీ పర్మినెంట్ చేయాల్సి అవసరం ఉన్నది. కాంగ్రెస్ పార్టీ 70 వేల మంది అంగన్‌వాడీలకు నెలకు రూ.18వేలు జీతం ఇస్తామని చెప్పినా, నేటికీ చర్యలు తీసుకోలేదు. అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్‌కు రూ.2 లక్షలు, ఆయాకు రూ.లక్ష ఇస్తామని ఇవ్వకుండా మోసం చేసింది. వీరికి సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలి. 26వేల మంది ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనంతో పాటు వీరికి రూ.18వేల వేతనమివ్వాలి. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు హామీ నిచ్చిన వేతనం రూ.10వేలకు పెంచనేలేదు. ఐకెపి వివోఏలకు కనీస వేతనాలు పరిస్థితి కూడా అంతే. ఫీల్డ్ అసిస్టెంట్లకు పేస్కేల్ ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నది. 52 వేల మంది గ్రామ పంచాయితీ కార్మికులకు వేతనం పెంచలేదు. మున్సిపల్ కార్మికులకు పక్క రాష్ట్రం మాదిరిగా రూ.21వేలు ఇవ్వాలని డిమాండ్ చేసినా పట్టింపు కరువైంది. అలాగే యూనివర్సిటీలలో పనిచేస్తున్న టైమ్‌స్కేల్ ఉద్యోగుల పర్మినెంట్ గురించి ఆలోచించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వంపై ఎటువంటి భారం లేని ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజీల నాన్‌టీచింగ్ స్టాఫ్‌కు పిఆర్‌సి వర్తింపజేస్తూ ఉత్తర్వులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నది. వేలాదిమంది సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు, స్కూల్ స్వీపర్లు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, గురుకుల కార్మికులు, కస్తూర్బా గాంధీ, మోడల్ స్కూల్స్ ఉద్యోగులకు నెల నెలా జీతాలు చెల్లిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాల్సి ఉంది.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్న విద్యుత్ రంగంలోని 23 వేల మంది ఆర్టిజన్ల సర్వీసులను జూనియర్ లైన్‌మెన్లుగా కన్వర్షన్ ఇవ్వాలని జెఏసిగా పోరాడుతున్నది. టీజీఎస్ఆర్టీసీలోని ఉద్యోగులకు పనిభారం పెరిగింది. మహాలక్ష్మి పథకం వల్ల మహిళలకు ఉపయోగపడినా బస్సుల సంఖ్య పెంచకపోవడం, ఉద్యోగులను రిక్రూట్ చేసుకోకపోవడంతో తీవ్ర ఇబ్బంది ఎదురవు తున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నియంతృత్వ ధోరణి వల్ల ఉద్యోగ సంఘాలకు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఆర్టీసీలో ఎన్నికలు వెంటనే నిర్వహించాలనే డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. తెలంగాణకు ఆదాయాన్ని సమకూర్చే నల్ల బంగారం (బొగ్గు) ఉత్పత్తి చేస్తున్న సింగరేణి సంస్థకు కొత్త బొగ్గు బావులు సాధించకుండా, వాటి కోసం కేంద్రంతో పోరాడకుండా లోపాయికారిగా వ్యవహరిస్తున్నది.



తెలంగాణ బొగ్గు సింగరేణి హక్కు. కేంద్రం వేలంపాటలను వ్యతిరేకించడం లేదు. రాబోయే పదేండ్లలో సింగరేణి పూర్తిగా ప్రయివేటీకరణ అయ్యే ప్రమాదమున్నది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సింగరేణి ఉద్యోగుల సభలో పాల్గొని సొంతింటి కల నెరవేరుస్తామన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పారు. అలవెన్సులపై ఇన్‌కమ్‌టాక్స్‌ను కోలిండియా మాదిరిగా సింగరేణి ఉద్యోగులను రీయంబర్స్‌మెంట్ చేస్తామన్నారు. వీటిన్నింటిని 'ప్రజా పాలన'లోనే మర్చిపోయారు.

అసంఘటిత రంగంలోని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలిలోని వందల కోట్ల రూపాయలు కార్మికుల కోసం కాకుండా ఇతర అవసరాలకు వాడుతున్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలి. ప్రయివేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్‌కు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయలేదు. ఐదు లక్షల మంది హమాలీలకు కూడా వెల్ఫేర్ బోర్డు లేదు. కార్మిక సంక్షేమ నిధి రుసుము యాజమాన్యం వాటా కనీసం రూ.వందలకు ఆదుకోవాల్సి ఉంది. పవర్‌లూమ్, హ్యాండ్‌లూమ్ వర్కర్స్ ఐదు లక్షల వరకు ఉంటారు. వీరి సబ్సిడీలు, కూలీరేట్లు పెంచడం లేదు. నెలకు 26 రోజులు పని కల్పించాలి. రాష్ట్రంలో ఏడు లక్షల మందిలో నాన్‌పీఎఫ్ సమస్య పరిష్కరించాలి. అందరికీ జీవనభృతినివ్వాలి.మరో కీలక సమస్యను కాంగ్రెస్ సర్కార్ విస్మరించింది. తన పెట్టుబడిదార్ల సభ్యత్వాన్ని చాటుకున్నది.

ప్రజాపాలన పేరిట ప్రభుత్వం ప్రజావాణిని నిర్వహిస్తున్నది. అధికారంలోకి వచ్చిన రోజే ప్రగతి భవన్ గేట్లు కూలగొట్టింది. కానీ ప్రజాస్వామ్యం కనబడటం లేదు. సమ్మెలను నిషేధిస్తున్నది. పోరాటాల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తున్నది. ఇటీవల లగచర్ల ఫార్మా బాధితులు, దామగుండం ప్రాజెక్ట్ నిరసనకారులు, దిలావర్‌పూర్ ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని జరిగిన పోరాటం అణచివేయడానికి తీవ్రంగా ప్రయత్నం చేసింది. ప్రజల తిరుగుబాటుతో కొన్నింటిలో వెనక్కి తగ్గడం అనివార్యమైంది. రాష్ట్రంలో పేదలు ఇండ్ల స్థలాల కోసం గుడిసెలు వేసుకుంటే నేటికీ పట్టాలివ్వాలని స్పష్టంగా ఉత్తర్వులివ్వలేదు. గృహలక్ష్మి పథకంతో పాటు ఆరు గ్యారంటీలు అమలు పట్ల నేటికీ స్పష్టత లేదు. రాష్ట్రంలో రైతు, కూలీ సమస్యల పరిష్కారంలో పారదర్శకత లేదు. వ్యవ సాయ కూలీలు, కౌలు రైతుల రక్షణ గురించి పట్టింపు లేదు. మధ్యతరగతి ప్రజల్లోనూ అసంతృప్తి పెరుగుతున్నది.

రాష్ట్రంలో 1.20 కోట్ల మందికి వర్తించే 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ కనీస వేతనాలు పెంచకుండా సవరించి మోసం చేసింది. 2024 జనవరి 30న 73 జీఓలు ఇస్తూ పాత బేసిక్, డిఏలను కలిపి "కొత్త సీసాలో పాత సారా" మాదిరి వేతనాలు నిర్ణయించింది. కనీస వేతనాల సలహా మండలి వేయకుండా చైర్మన్‌ను నియమించడం విడ్డూరం. ఒక వర్కర్స్ పాలసీ అంటూ ఏమీలేదు. పెట్టుబడిదారులకు అన్నిరకాల రాయితీలిస్తూ గత ప్రభుత్వ విధానాల్ని కొనసాగిస్తున్నది. పారిశ్రామిక కార్మికుల హక్కులు కాపాడటం లేదు. నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకించడం లేదు. వలస కార్మిక చట్టం అమలు ఊసే లేదు.

ప్రజాపాలన పేరిట ప్రభుత్వం ప్రజావాణిని నిర్వహిస్తున్నది. అధికారంలోకి వచ్చిన రోజే ప్రగతి భవన్ గేట్లు కూలగొట్టింది. కానీ ప్రజాస్వామ్యం కనబడటం లేదు. సమ్మెలను నిషేధిస్తున్నది. పోరాటాల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తున్నది. ఇటీవల లగచర్ల ఫార్మా బాధితులు, దామగుండం ప్రాజెక్ట్ నిరసనకారులు, దిలావర్‌పూర్ ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని జరిగిన పోరాటం అణచివేయడానికి తీవ్రంగా ప్రయత్నం చేసింది. ప్రజల తిరుగుబాటుతో కొన్నింటిలో వెనక్కి తగ్గడం అనివార్యమైంది. రాష్ట్రంలో పేదలు ఇండ్ల స్థలాల కోసం గుడిసెలు వేసుకుంటే నేటికీ పట్టాలివ్వాలని స్పష్టంగా ఉత్తర్వులివ్వలేదు. గృహలక్ష్మి పథకంతో పాటు ఆరు గ్యారంటీలు అమలు పట్ల నేటికీ స్పష్టత లేదు. రాష్ట్రంలో రైతు, కూలీ సమస్యల పరిష్కారంలో పారదర్శకత లేదు. వ్యవ సాయ కూలీలు, కౌలు రైతుల రక్షణ గురించి పట్టింపు లేదు. మధ్యతరగతి ప్రజల్లోనూ అసంతృప్తి పెరుగుతున్నది.

ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఏడాది పాలనలో కార్మిక రంగం పట్ల ప్రదర్శిస్తున్న వివక్షను ప్రభుత్వం ఆత్మవిమర్శ చేసుకోవాలి. అంబానీ, ఆదానీ, టాటా, బిర్లా లాంటి బడాపెట్టుబడిదారుల స్వప్రయోజనాలు, కాంట్రాక్టర్ల లాభాలకన్నా రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడం కోసమే కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారన్నది గమనంలో పెట్టుకోవాలి. ఏడాదికాలంలోనే ప్రజల్లో ఎందుకింత వ్యతిరేకత వచ్చిందనేది విషయాన్ని కూడా సమీక్షించుకోవాలి. ప్రధానంగా కార్మికవర్గాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించడమే ప్రధాన కారణమని గుర్తెరగాలి. ఇకనైనా కార్మిక,కర్షక వర్గాలకు న్యాయం చేసే విధంగా నిర్ణయాలు తీసుకుని అమలు చేయాలి. అదే అసలు సిసలైన 'ప్రజాపాలన' అనిపించుకుంటుంది.

చావడానికేనా...ఈ చదువులు?



టి. నాగరాజు
9490098292

'రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ కేసులు పెరుగుతున్నాయి. ఇటీవల కాలంలో వరుస ఘటనలు జరుగుతున్నా అధికారులు మొద్దు నిద్రపోతున్నారా?' అంటూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని మందలించే స్థితికి విద్యా వ్యవస్థ చేరింది. సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రే 'విద్యార్థులకు పోషకాహారం అందించడంలో రాజీపడే ప్రసక్తే లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని ఇటీవల ప్రకటించారు. ఆయనే కాదు,రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులూ ఘటన జరిగిన ప్పుడు హడావుడి చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించడం నిత్యకృత్యమైంది. ఆ తర్వాత షరామామూలే.

ఆర్థిక స్థోమత లేనివారు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో చేర్పిస్తారు. అక్కడైనా వారికి కడుపునిండా తిండి, నాణ్యమైన విద్య, భవిష్యత్తుకు భరోసా అందుతుందని వారి ఆశ. కానీ, గురుకులాలు, పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ వల్ల తమ పిల్లలు ఆస్పత్రుల పాలయ్యారని తెలియగానే ఎక్కడో స్వగ్రామాల్లో కూలీనాలీ చేసుకుని బతికే తల్లిదండ్రులు ఎంత వేదనకు గురవుతారో చెప్పనక్కర్లేదు. వారి స్థానంలో ఉండి ఒక్కసారి ఆలోచిస్తేనే కడుపు తరుక్కుపోతోంది. పేద విద్యార్థులు చదువుకుంటున్న ఈ విద్యాసంస్థల పట్ల పాలకులు తమ బాధ్యతను మరచిపోతున్నారని చెప్పడానికి ఫుడ్‌పాయిజన్ ఘటనలు నిదర్శనం. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుండి రాష్ట్రంలో ఇలాంటివి అనేకం వెలుగుచూశాయి. ఈ ఏడాదిలోనే 38 సార్లు ఫుడ్ పాయిజన్ కేసులు నమోదయ్యాయి. నలుగురు విద్యార్థులు చనిపోయారు. 938 మంది విద్యార్థులు ఆస్పత్రుల్లో చేరారు. జగిత్యాల, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, వనపర్తి, ఖమ్మం, నారాయణపేట, కరీంనగర్, కుమురం భీం, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, భువనగిరి జిల్లాల్లో అనేక ఘటనలు గురుకుల విద్యాసంస్థల్లో ఈ కాలంలో జరిగాయి. దీన్ని ప్రభుత్వం ఒక రాజకీయ అంశంగా కాకుండా ఉన్నత చదువుల కోసం వచ్చి పిట్టల్లాగా రాలిపోతున్న పేద విద్యార్థుల భవిష్యత్ గురించి ఆలోచించాలి. అసలెందుకు ఫుడ్ పాయిజన్ అవుతుంది? విద్యార్థుల ఆత్మహత్యలు ఎందుకు జరుగుతున్నాయో? తెలుసుకుని పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? ఉంటే ఈ ఘటనలు పునరావృతం ఎందుకవుతున్నాయి.

కొత్తమెనూ అమలుపై పర్యవేక్షణేది?

2016 నుండి మెస్‌చార్జీలను గత సర్కార్ పెంచలేదు. రెండు నెలల క్రితం మెస్‌చార్జీలను ప్రస్తుత ప్రభుత్వం పెంచింది. ఈ పెంచిన ఛార్జీల ప్రకారం మెనూ అందుతుందా, లేదా అనే పర్యవేక్షణ అధికార యంత్రాంగంలో లేదు. గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో కాంట్రాక్టులు తీసుకున్న వారు నాణ్యమైన వస్తువులు సరఫరా చేయడం లేదనే విమర్శలు అనేకం. ధరలు తక్కువగా ఉన్నవి, కుళ్లిపోయిన కూరగాయలు, పండ్లు అందిస్తున్నరనేది కూడా నిజం. పూర్తిస్థాయిలో మెనూ పాటించక పోవడం వలన తరచుగా ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్న మాట కూడా వాస్తవం. కేవలం ఘటన జరగ్గానే కొందర్ని బాధ్యులను చేస్తూ సస్పెన్షన్ చేస్తున్నది ప్రభుత్వం.ఈ అంశంపై మూలాల్లోకి వెళ్లకపోవడం విచారకరం. ఫుడ్ పాయిజన్ జరగటానికి నాణ్యమైన భోజనం అందకపోవడం ఒక్కటే కారణం కాదు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న గురుకులాల్లో పరిశుభ్రత లేకపోవడం, సరిపడా గదులు లేకపోవడం, అపరిశుభ్రమైన మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానాలు చేయడానికి కూడా నీళ్లు దొరక్క అంటువ్యాధుల బారిన పడుతున్నారు విద్యార్థులు. కొంతమంది దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్నారు. మరో పక్క చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, పాములు, తేళ్లకు నిలయాలుగా మారి అధ్వాన పరిస్థితిలో సంక్షేమవసతి గృహాలు నెట్టబడ్డాయి. ఇందులో వసతిపొందే విద్యార్థుల బతుకులకు మరీ భద్రత లేకుండా పోయింది. ఇన్ని సమస్యలున్నా సర్కార్ ఎందుకు దృష్టి పెట్టటం లేదని ప్రశ్నిస్తే సమాధానం ఉండదు.

అధిక సమయపాలన..మానసిక ఒత్తిడి

దీనికితోడు ఈ మధ్య గురుకులాల్లో తీసుకొచ్చిన అశాస్త్రీయమైన సమయపాలన విద్యార్థులను, ఉపాధ్యాయులను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ఉపాధ్యాయులు సైతం పర్యవేక్షణ చేసే అవకాశం లేకుండా చేసేలా ఉదయం నుండి సాయంత్రం వరకు తీవ్ర ఒత్తిడితో ఉన్న పనిగంటల్ని అమలు



చేయడంతో విద్యార్థులు మానసికంగా బలహీనంగా ఉండి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వీరికి చదువు భారమనే ఫీలింగ్ రాకుండా దృఢంగా ఉంచేందుకు కౌన్సిలింగ్‌లు కూడా లేదు. దీంతో కొత్తగా చేరినవారు, చదువులో ఒత్తిడిని అధిగమించనివారు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఈ ఆత్మహత్యల పరంపర ఓవైపు రాష్ట్రంలో కొనసాగుతుండగానే జగిత్యాల జిల్లా పెద్దాపూర్‌లో, కుమరం భీం జిల్లా వాంకిడిలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు మరణించడం శోచనీయం. ఇంటర్నేషనల్ స్థాయి విద్యను అందిస్తామన్న ప్రభుత్వం వీటి నిర్వహణను మాత్రం గాలికొదిలేసింది. రాష్ట్రంలో ఈ సమస్యలు పరిష్కరించడానికి, సమీక్షలు నిర్వహించడానికి విద్యాశాఖ మంత్రిని నియమించలేదు. స్వయంగా ముఖ్యమంత్రే ఈ శాఖను చూస్తున్నారు. అంటే, విద్యారంగం మరింత ఉన్నతమైన స్థితిలో ఉంటుందని ఎవరైనా ఆశిస్తారు.కానీ క్షేత్రస్థాయిలో చూస్తే ఫలితం శూన్యం. ఈ విద్యాశాఖ ఒక్కటే కాదు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖలకు మంత్రులు లేరు. మరి ఎవరు ఈ సంబంధిత శాఖలకు సంబంధించిన విద్యార్థులను పట్టించుకోవాలి, వీరి సమస్యల్ని ఎవరు తీర్చాలి? దీనికి ప్రభుత్వమే సమాధానం చెప్పాలి.

మధ్యాహ్న భోజనం విద్యార్థుల హక్కు

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఈ ఘటనలు పెరుగుతున్నాయి. వారికి పెట్టే ఒక్కపూట భోజనం కూడా సరిగ్గా అందిం చడం లేదు. పాఠశాలల్లో ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకం ఎవరి దయా దాక్షిణ్యాలతో అమలు చేస్తున్నది కాదు. రాజకీయ నాయకులు ఓట్ల కోసం ప్రకటించే పథకం అంతకన్నా కాదు. అది విద్యార్థులు జీవించే హక్కులో భాగంగా వచ్చినదే. విద్యార్థుల ఆకలి తీర్చేందుకు మధ్యాహ్నభోజన పథకం తీసుకొచ్చామని చెబుతున్న పాలకులు, ఇదిఇది వారి హక్కు అని తెలుసుకోవడంలో విఫలమవుతున్నారు. రాష్ట్రంలో 27 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వాటిలో 23లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. అందులో 80 శాతం వరకు విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకంతో లబ్ధి పొందుతున్నారు. ఇంతమంది విద్యార్థుల ఆకలి తీర్చడానికి 52 వేల మందికి పైగా వంట కార్మికులు పనిచేస్తున్నారు. రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకం అమలు, పర్యవేక్షణలో ఎన్నో సమస్యలు తలెత్తుతు న్నాయి. పాఠశాలల్లో మౌలిక వసతులైన వంటగదులు, వంట పాత్రలు, తాగునీరు లేని పాఠశాలలెన్నో ఉన్నాయి. పాఠశాలలకు బియ్యం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సరఫరా చేస్తే.. పప్పు, నూనె, కూరగాయలు, గుడ్లు వంటి వాటిని ఏజెన్సీవారు కొనుక్కొంటున్నారు.

వడ్డీకి తెచ్చి వండుతున్న కార్మికులు

ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 1నుంచి 5వ తరగతి చదివే ఒక్కో విద్యార్థికి రూ.5.70, 6-8వ తరగతి చదివే విద్యా ర్థులకు రూ.8.40, 9-10 తరగతులు చదివే విద్యార్థులకు రూ.10.40 కేటాయిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు మొత్తం చెల్లిస్తున్నది. 6 నుంచి 8వ తరగతులు చదివే విద్యార్థులకు కేంద్రం 60 శాతం చెల్లిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం చెల్లిస్తున్నది.9, 10 తరగతుల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మొత్తం చెల్లిస్తున్నది. విద్యార్థులకు వారానికి మూడు గుడ్లు ఇవ్వాలి. ఒక్కో గుడ్డు ధర మార్కెట్‌లో రూ.7 నుంచి 8 వరకు ఉన్నది. అయితే, ఇందుకుగాను ప్రభుత్వం నెల నెలా బిల్లులు సరిగా చెల్లించకపోవడంతో వంటకార్మికులే వడ్డీకి అప్పులు తెచ్చి ఆ ఖర్చులను భరిస్తున్నారు.ధరలు పెరగడం, జీతాలు సమయానికి రాకపోవడం వంటి సమస్యలతో నాణ్యమైన భోజనం అందించలేని పరిస్థితి కూడా ఓ కారణంగా కనిపిస్తోంది. వీటికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాలి. అలాగే మధ్యాహ్న భోజనాన్ని స్వచ్ఛంద సంస్థలకు, అక్షయపాత్ర లాంటి సంస్థలకు, సెంట్రలైజ్ కిచెన్‌కు ఇవ్వాలని చేస్తున్న ఆలోచనలు మానుకోవాలి. ప్రభుత్వమే నేరుగా ఈ బాధ్యతల్ని తీసుకుని నిర్వహించాలి.

ఈ ఘటనల నుండి ప్రభుత్వం ఇప్పటికైనా నివారణా చర్యలు తీసుకోవాలి. విద్యావ్యవస్థ బలోపేతానికి తగిన నిధులు కేటా యించడం, రోజువారీగా ప్రభుత్వం ఇస్తున్న మెనూ అమలయ్యేలా చూడటం, ఈ పర్యవేక్షణ కోసం అవసరమైతే ప్రత్యేకంగా అధికారులను నియమించడం చేయాలి. సంక్షేమ వసతిగృహాలు, గురుకులాల్లో సమస్యలు పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలి. బలహీన వర్గాలు చదువుతున్న ఈ విద్యా సంస్థలపై ప్రత్యేకంగా దృష్టి సారించకపోతే ఫుడ్ పాయిజన్ ఘటనలు భవిష్యత్తులోనూ పునరావృతమయ్యే ప్రమాదం ఉంది. ఇలాంటి ఘటనల వల్ల విద్యార్థులు చదువుకోవాలన్నా, వారి తల్లిదండ్రులు పాఠశాలల్లో చేర్పించాలన్నా సంశయించే పరిస్థితి వస్తుంది. విద్య అంటే బరువు కాదని, భవిష్యత్తుకు భరోసా అనే చైతన్యాన్ని సమాజానికి కలిగించాలి. దీనికి కావాల్సింది పాలకుల పర్యవేక్షణ, ప్రదర్శించాల్సింది చిత్తశుద్ధి.

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఈ ఘటనలు పెరుగుతున్నాయి. వారికి పెట్టే ఒక్కపూట భోజనం కూడా సరిగ్గా అందిం చడం లేదు. పాఠశాలల్లో ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకం ఎవరి దయా దాక్షిణ్యాలతో అమలు చేస్తున్నది కాదు. రాజకీయ నాయకులు ఓట్ల కోసం ప్రకటించే పథకం అంతకన్నా కాదు. అది విద్యార్థులు జీవించే హక్కులో భాగంగా వచ్చినదే. విద్యార్థుల ఆకలి తీర్చేందుకు మధ్యాహ్నభోజన పథకం తీసుకొచ్చామని చెబుతున్న పాలకులు, ఇదిఇది వారి హక్కు అని తెలుసుకోవడంలో విఫలమవుతున్నారు.

5

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

కరీంనగర్

శనివారం | నవంబర్ 30, 2024 | www.navatelangana.com

సొంత నియోజకవర్గంలో మంత్రి పొన్నంకు నిరసన..

- తమకు పథకాలు రావడం లేదన్న మహిళలు..
- ఇప్పటికీ రైతుబంధు రాలేదని, రుణమాఫీ కాలేదని నిలదీత
- అన్ని అమలు చేస్తామని సర్దిచెప్పిన మంత్రి పొన్నం


రైతుబంధు, రుణమాఫీ పై మంత్రిని నిలదీస్తున్న మహిళా రైతు

నవతెలంగాణ - చిగురుమామిడి

రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్‌కు సొంత నియోజకవర్గంలో మహిళల నుంచి నిరసన వ్యక్తం అయింది. చిగురుమామిడిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మండల కేంద్రానికి చెందిన పలువురు మహిళలు తమకు రైతుబంధు రావడంలేదని, ఇప్పటివరకు రుణమాఫీ కాలేదని నిలదీశారు. బెజ్జంకి భాగ్యవ్వ అనే మహిళ మాట్లాడుతూ.. గతంలో రైతులకు రైతు బీమా వర్తించేదని, రైతుబంధు ఏడాదికి రెండుసార్లు అందేదని, ఇప్పుడు సంవత్సరం గడుస్తున్నా.. రైతు బంధు ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. దీంతో మంత్రి పొన్నం.. అన్ని వర్గాలకు పథకాలను అందిస్తామని, ఇందులో ఎవరికి ఆపోహలు అవసరం లేదని దాటవేశారు. చిగురుమామిడి మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి పొన్నం మాట్లాడారు. అనుకోని రీతిలో మహిళల నుంచి ప్రశ్నలు ఎదురు కావడంతో మంత్రి అవాక్కయ్యారు.

రైతు ఆత్మహత్య..

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట మండలంలో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. జమ్మికుంట పట్టణ సీఐ వరగంటి రవి తెలిపిన ప్రకారం.. పాపక్కపల్లి గ్రామానికి చెందిన బోరాల రాజేందర్ తనకున్న ఎకరంతోపాటు నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసేవాడు. పంట దిగుబడి సరిగ్గా రాక అప్పుల బాధకు గురై మనస్తాపనతో ఈ నెల 23న ఇంట్లో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతు పరిస్థితి విషమించి శుక్రవారం మరణించాడు. మృతునికి భార్య బోరాల స్వప్న, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ తెలిపారు.



ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ర్యాలీగా వస్తున్న సీపీఐ(ఎం) శ్రేణులు


పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ(ఎం) శ్రేణులు


బహిరంగసభకు హాజరైన పార్టీ శ్రేణులు



అట్టహాసంగా...

ప్రారంభమైన సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా 10వ మహాసభలు

- ఎన్టీఆర్‌చౌరస్తా నుంచి భారీ ప్రజాప్రదర్శనర్యాలీ
- డప్పుచప్పుళ్ల నడుమ అలరించిన మహిళా కార్యకర్తల నృత్యాలు
- దారి పొడవునా మార్మోగిన సీపీఎం జిందాబాద్ నినాదాలు
- జిల్లా నలుమూలల నుంచి హాజరైన ప్రతినిధులు, కార్యకర్తలు
- భవిష్యత్ ఉద్యమకార్యాచరణకు సిద్ధమైన కామ్రేడ్లు
- నేటి ప్రతినిధుల సభలో తీర్మానాలు, కొత్త కమిటీ ఎన్నిక
- నిత్యం ప్రజల్లో ఉండేది కమ్యూనిస్టులే : మహాసభలో వక్తలు


మాట్లాడుతున్న టీ.జ్యోతి




మాట్లాడుతున్న జే.వెంకటేష్


ప్రజాప్రదర్శన ర్యాలీలో డప్పుచప్పుళ్లకు నృత్యం చేస్తున్న మహిళా కార్యకర్తలు

సీపీఐ(ఎం) కరీంనగర్‌జిల్లా పదో మహాసభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్‌గా నామకరణం చేసుకున్న జిల్లా కేంద్రంలోని కోతిరాంపూర్ ముకుందలాల్ భవన ప్రాంతం, అక్కడే కామ్రేడ్ బుద్ధదేవ్‌భట్టాచార్య ప్రాంగణంగా మలుచుకున్న వేదికగా రెండు రోజులపాటు సాగే మహాసభల కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. తొలి రోజు శుక్రవారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా నుంచి భారీ ప్రజాప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ సహా ఆ పార్టీ అనుబంధ రంగాలన్నింటి నుంచి పెద్దఎత్తున శ్రామికవర్గం పాల్గొంది. ఎర్రచొక్కాలు, ఎర్రంగు చీరెలు ధరించి కార్యకర్తలంతా ఒక్కచోటన చేరి వచ్చిన ర్యాలీ తీరు చూస్తే ఆ దారంతా ఎరుపువర్ణాన్ని తలపించింది. డప్పుచప్పుళ్ల మధ్య కార్యకర్తల నృత్యాలు అలరించాయి. సీపీఎం జిందాబాద్.. ఎర్ర జెండా వర్థిల్లాలి అంటూ మార్మోగిన నినాదాల నడుమ శ్రేణులంతా ఉత్సాహంగా కదిలారు. సీతారాంఏచూరి నగర్ వరకూ సాగిన ర్యాలీ.. అనంతరం పార్టీ సీనియర్ నాయకుడు, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు వర్ణ వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా జెండాను ఆవిష్కరించుకున్నారు. అనంతరం ఆ భవన్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టీ.జ్యోతి, కార్యవర్గ సభ్యులు జే.వెంకటేష్ రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన ఉద్యమ కార్యాచరణపై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టారు. ముఖ్యంగా ఓట్ల కోసం బీజేపీ మత రాజకీయాలు చేస్తుందంటూ దేశంలో చెలరేగుతున్న అల్లర్లు, మైనార్టీవర్గాలపై సాగుతున్న దాడులను ఎన్నో ఉటంకిస్తూ ప్రసంగించారు. ఓట్ల కోసమో.. ఎన్నిక సమయంలోనే ప్రజల్లోకి వచ్చే పార్టీకాదని, నిత్యం ప్రజల సమస్యలపై ముందుండి పోరాడే పార్టీ సీపీఎం అంటూ శ్రేణులను ఉత్సాహపరిచారు. మధ్యాహ్నం వరకు బహిరంగ సభ సాగగా.. అనంతరం ప్రతినిధుల సమావేశం సాగింది. శనివారం సైతం నిర్వహించే ఈ ప్రతినిధుల సభలోనే ఈ మూడేండ్ల కాలంలో చేసిన ఉద్యమాలు, సాధించిన విజయాలు, లోపాలపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. అనంతరం రాబోయే మూడేండ్లలో తీసుకోబోయే ఉద్యమ కార్యాచరణను రూపొందించుకోనున్నారు. నేడు జిల్లా పార్టీ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారు.

నవతెలంగాణ ,
కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / భగత్‌నగర్

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు..

కలెక్టర్ పమేలా సత్పతి



నవతెలంగాణ - కరీంనగర్

జిల్లాలో ఖనిజ అభివృద్ధి సంస్థ పరిధిలోకి వచ్చే కంకర, గ్రానైట్ తదితర క్వారీల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకోవాలని.. అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి హెచ్చరించారు. ఈ మేరకు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, నిబంధనలు అతిక్రమించకుండా చూడాలని అన్నారు. శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నీటి పారుదలశాఖ, భూగర్భ గనుల శాఖ, రెవెన్యూ శాఖ, తెలంగాణ ఖనిజ అభివృద్ధి సంస్థ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కంకర గ్రానైట్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి క్వారీ ప్రవేశ ద్వారం, బయటకు వెళ్లే ద్వారంతో పాటు పరిసరాలు కవర్ అయ్యేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలన్నారు. డిఫాల్ట్ అయిన 67 క్వారీల్లో పనులు జరగడానికి వీల్లేదన్నారు. ఆ క్వారీలకు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు అన్ని రకాలుగా క్వారీలను తనిఖీ చేసి నివేదిక అందించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఆర్డీఓ మహేశ్వర్, మైనింగ్ ఏడీ రామాచారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు వివేకానంద విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ - గంగాధర


విద్యార్థినిని అభినందిస్తున్న వివేకానంద హైస్కూల్ కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు గంగాధర మండల కేంద్రంలోని వివేకానంద హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని జె.సాత్విక ఎంపిక అయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న రాజన్న సిరిసిల్లలోని రైసింగ్ ఫిట్‌నెస్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్ బాల, బాలికల సెలెక్షన్స్ ట్రైల్స్ జరిగాయి. జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలలో ప్రతిభ ప్రదర్శించిన సాత్విక నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యింది. పోటీలకు ఎంపికైన సాత్వికను వివేకానంద హైస్కూల్ కరస్పాండెంట్ పర్రెం లక్ష్మారెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఉషారాణి, నర్సింగరావు, డైరెక్టర్ అనంతరెడ్డి అభినందించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు సిద్ధార్థ పాఠశాల విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ - కరీంనగర్


విద్యార్థినిని అభినందిస్తున్న చైర్మెన్

ఇటీవల కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన సబ్ జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలలో స్థానిక భగత్‌నగర్ సిద్ధార్థ విద్యాసంస్థలో 5వతరగతి చదువుతున్న ఎల్.దేవాన్షి ప్రతిభ కనబర్చింది. 300 మీటర్ల కిడ్స్ జావెలిన్‌లో గోల్డ్ మెడల్స్ సాధించి డిసెంబర్ 1న మంచిర్యాలలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీలకు అర్హత సాధించింది. ఆ విద్యార్థినిని పాఠశాల చైర్మెన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు అభినందించారు.

బీఆర్ఎస్‌కు పునర్జన్మనిచ్చింది కరీంనగర్ గడ్డనే!

- కేసీఆర్ అంటే పేరు కాదు.. పోరు
- రేవంత్... నీ దగ్గర అధికారం ఉండొచ్చు...
- తెలంగాణ ప్రజల అభిమానం కేసీఆర్‌కే ఉంది...
- ఆనాటి కేసీఆర్ ఆమరణ దీక్ష ఉద్యమ పతాక సన్నివేశం
- ఈనాటి 18ఏండ్ల పిల్లలకు తెల్వకపోవచ్చు.. ఆయన మంచి చేశారనే తెలుసు...
- రాబోయే నాలుగేళ్లూ ప్రజల కోసం పోరాటం చేద్దాం...
- ప్రతి వేదికలో తెలంగాణ పక్షాన పోరాడుదాం..
- అల్గునూర్ చౌరస్తా వద్ద దీక్షాదివస్‌లో కేటీఆర్



కేసీఆర్‌చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు


ప్రజలకు నమస్కరిస్తున్న కేటీఆర్

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / తిమ్మాపూర్

కేసీఆర్ అంటే పేరు కాదు.. ఒక పోరు... మనీ, మజిల్, మీడియా, క్యాస్ట్ ఇలా ఎలాంటి పవరూ లేకున్నా.. ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన కరీంనగర్ గడ్డలోని అల్గునూర్ వేదికగా చేసిన ఆమరణ నిరాహార దీక్ష అప్పటి ఉద్యమ పతాక సన్నివేశంగా ఎవరూ మరిచిపోలేదు. అయితే ఈనాటి 18-20ఏండ్ల పిల్లలకు తెల్వకపోవచ్చు. కేసీఆర్ మంచి చేశారని మాత్రమే వారికి తెలుసు. రాబోయే నాలుగేళ్లు ప్రజల కోసం పోరాటం చేద్దాం.. ప్రతి వేదికలో తెలంగాణ పక్షా పోరాడుదాం' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా అలుగునూరు చౌరస్తాలో శుక్రవారం నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి కేటీఆర్ హాజరై ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ కృషి అనన్య సామాన్యమైనదని కొనియాడారు. పదవులు ఆశించకుండా తెలంగాణ కోసం కృషి చేశారన్నారు. ఇప్పుడంటే బీఆర్ఎస్ కు ఎంతోమంది నాయకులు, పెద్ద బలగం ఉందని, 2001లో తెలంగాణ ఉద్యమం మొదలు పెట్టిన నాడు ఎవరూ లేరన్నారు. ఆనాడు ఏ పవరూ లేని పరిస్థితుల్లో తెలంగాణ వస్తదా అన్న అనుమానాలు అందరికీ ఉన్నప్పుడు కేసీఆర్ తన ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించారన్నారు. ఎక్కడుంది తెలంగాణ అన్నోళ్లకు ఆనాటి లోక్ సభ ఎన్నికల్లో 2 లక్షల మెజార్టీ ఇచ్చి తెలంగాణ వాదం ఎంత బలంగా ఉందో ఇక్కడి ప్రజలు చూపించారని తెలిపారు. రేవంత్ రెడ్డి ఇవాళ అదృష్టవంతుడు.. అధికారం నీ దగ్గర ఉండొచ్చు కానీ.. తెలంగాణ ప్రజల అభిమానం మాత్రం కేసీఆర్‌కు, గులాబీ జెండాకే ఉంది' అని అన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అరచేతిలో వైకుంఠం చూపించారని ప్రభుత్వంపై మండిపడ్డారు. 'దొంగ మాటలు, నంగనాచి కబుర్లు చెప్పి నువ్వు గెలవచ్చు' కానీ ఏ రోజుకైనా తెలంగాణ చరిత్ర రాసిన రోజు కేసీఆర్ హిమాలయ పర్వతమంతా ఎత్తులో ఉంటే.. కనీసం ఆయన కాలి గోటికి కూడా సరిపోని పాత్రలో ఉంటావనేది అక్షర సత్యమని అన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనతో తెలంగాణలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేరని కేటీఆర్ అన్నారు. ఆఖరకు గురుకులాల్లో ఉండే పిల్లలు కూడా ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని విమర్శించారు హాస్టల్ విద్యార్థులు తిండి కోసం అలమటిస్తున్నారని అన్నారు. ఈ పాటి దానికి విజయోత్సవాలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. 'దమ్ముంటే నీ ఏడాది పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకునేందుకు రాష్ట్రంలోని ఏ ఊరికైనా, ఏ తండాకైనా, ఏ బస్తీకైనా వెళ్లు' అని ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలుసమయి బాలకిషన్, సుంకే రవిశంకర్, సతీష్ బాబు, ఎమ్మెల్సీ బండ ప్రకాష్, జడ్‌పీ మాజీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మేయర్ సునీల్ రావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, సిద్ధం వేణు, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ఏకానందం, మండల అధ్యక్షుడు రావుల రమేష్, పొన్నం అనిల్ గౌడ్, బీఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలి

- ఏఓఐ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.మంజునాథ్
- ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలని ఏఓఐ ధర్నా


ధర్నాలో మాట్లాడుతున్న మంజునాథ్

నవతెలంగాణ - కరీంనగర్

ఎల్ఐసీలో ఏజెంట్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏజెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఓఐ) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.మంజునాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ఎల్ఐసీ డివిషనల్ కార్యాలయం ఎదుట ఏఓఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్లా బ్యాక్ ఆఫ్ కమిషన్ నిబంధనను వెంటనే నిలిపివేయాలన్నారు. ఏజెంట్లకు చెల్లించే మొదటి సంవత్సరం కమీషన్‌ను పాత పద్ధతిలోనే చెల్లించాలని, ఇన్సూరెన్స్ ప్రీమియం మీద జీఎస్టీ విధింపును వెంటనే తొలగించాలన్నారు. పాలసీ తీసుకునేందుకు గరిష్ఠ వయసును 55సంవత్సరాలకు పైబడి పెంచాలని డిమాండ్ చేశారు. పాలసీలో మినీమం సమ్ అష్యూర్డ్‌ను రూ.రెండులక్షల నుంచి ఒకలక్షకు తగ్గించాలన్నారు. అలాగే అపరిష్కృతంగా ఉన్న ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎల్ఐసీ యాజమాన్యాన్ని కోరారు. ఈ ధర్నాకు మద్దతు తెలియజేసిన ఉద్యోగ సంఘం ఐసీఈయూ కరీంనగర్ డివిజన్ అధ్యక్షుడు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. యాజమాన్యం ఏజెంట్లతో చర్చించకుండా వారిని విశ్వాసంలోకి తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. వెంటనే చర్చలు ప్రారంభించి సమస్యలు పరిష్కరించాలన్నారు. అలాగే ఇన్సూరెన్స్ ప్రీమియంపై జీఎస్టీని తొలగించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఏఓఐ స్టేట్ జనరల్ సెక్రటరీ తన్నీరు కుమార్, కోశాధికారి కొత్తపెల్లి రాంనర్సయ్య, కరీంనగర్ డివిజన్ అధ్యక్షుడు పి.రాజబాబురెడ్డి, జగిత్యాల బ్రాంచి అధ్యక్షుడు రాజ్ కుమార్, గాదాసు శ్రీనివాస్, వి.వెంకటేశ్వర్లు, బి.తిరుపతిరావు, తిరుపతి, మహేష్, కుమారస్వామి, ముత్త రమేష్, భూమయ్య, సుధాకర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ డివిజనల్ నాయకులు వామన్‌రావు, సూర్యకళ, బసవేశ్వర్, అనుపమ, శ్రీలత ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలియజేశారు.

క్రీడకారులు నైపుణ్యం పెంచుకోవాలి

వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్.నాగరాజు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కెఆర్.నాగరాజు

నవతెలంగాణ - హుజురాబాద్ : క్రీడలతో క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, క్రమశిక్షణతో నైపుణ్యం పెంచుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే, సీనియర్ హాకీ క్రీడాకారుడు కెఆర్.నాగరాజు అన్నారు. శుక్రవారం హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో రాష్ట్రస్థాయి అండర్ 14 సంవత్సరాల బాలబాలికలకు హాకీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి పది జిల్లాల బాలబాలికల జట్లు 20 పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. క్రీడలతో విద్యార్థులకు యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఉదయం నుండి పాఠశాల మైదానంలో బాల బాలికలకు వేరువేరు కోర్టులో క్రీడలు నిర్వహించారు. రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారులకు బాలికల పాఠశాల, ఉన్నత పాఠశాలలో వసతి ఏర్పాటు చేశారు. క్రీడాకారులకు కోచులకు భోజన సౌకర్యం కల్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందే రాధిక, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, హాకీ క్లబ్ జిల్లా కార్యదర్శి బండ శ్రీనివాస్, హాకీ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, ఎంఈఓ బి.శ్రీనివాస్, జెన్కో వైస్ చైర్మన్ సబ్బని వెంకట్, సామాజిక కార్యకర్త వర్ధినేని రవీందర్రావు, నాగార్జున సీడ్స్ అధినేత పుల్లూరి ప్రభాకర్‌రావు, ఎస్టీఎఫ్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, ఎస్టీఎఫ్ కార్యదర్శి సొల్లు సారయ్య, క్రీడల కన్వీనర్ ఏముల రవికుమార్, పాల్గొన్నారు.

ఉచిత కుట్టు మిషన్లను వినియోగించుకోవాలి

సింగిల్విండో చైర్మన్ వెల్మ మల్లారెడ్డి


కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న సింగల్ విండో చైర్మన్ వెల్మ మల్లారెడ్డి

నవతెలంగాణ - చొప్పదండి : గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద మహిళలు ఉచిత కుట్టుమిషన్లను వినియోగించుకోవాలని చొప్పదండి సింగిల్‌విండో చైర్మన్ వెల్మ మల్లారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని క్రిబ్‌కో ఎరువుల కంపెనీ వారు దత్తత తీసుకోగా శుక్రవారం మూడు కుట్టుమిషన్లను ఉచితంగా అందించారు. మహిళలకు సింగిల్‌విండో చైర్మన్ పంపిణీ చేశారు. ఇంతకుముందు రూ.25వేల వాటర్ కూలర్, 50వేల కుర్చీలు, హెల్త్ క్యాంపులు నిర్వహించినట్లుగా తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ జిల్లా మేనేజర్ ప్రేమ్‌తేజ నాయుడు, ఉపాధ్యక్షుడు, డైరెక్టర్లు, కార్యదర్శి కళ్లెం తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

పత్తి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7వేలు

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం కాటన్ విడి పత్తి 127 క్వింటాళ్లు 20 వాహనాలలో రైతులు విక్రయానికి తీసుకు వచ్చారు. క్వింటాలుకు గరిష్ఠ ధర రూ.7,000, మోడల్ - 6900, కనిష్ఠ - 6600 పలికింది. అలాగే కాటన్ బ్యాగ్స్‌లలో 18 క్వింటార్లు 13మంది రైతులు విక్రయానికి తీసుకురాగా గరిష్ట ధర 6,700, మోడల్ - 6 600, కనిష్ఠ - 6300 పలికిందని మార్కెట్ సెక్రటరీ ఆర్ మల్లేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శని, ఆదివారాలు మార్కెట్‌కు సాధారణ సెలవులు కాగా తిరిగి డిసెంబర్ 2న పునఃప్రారంభం అవుతుందని, రైతులు గమనించి సహకరించాలని మార్కెట్ సెక్రటరీ తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన వారికి రూ.2 కోట్ల 10 లక్షల 15 వేలు 278 సీఎం సహాయనిధి చెక్కులు పట్టభద్రులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. రాజీవ్ ఆరోగ్య శ్రీతో రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం పొందాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, పీసీసీ సభ్యులు, పట్టణ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, కౌన్సిలర్స్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌కు కృతజ్ఞతలు తెలిపిన మండల కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మేడిపల్లి



భీమారం మండలానికి నూతన ఎంపీడీవో కార్యాలయం ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ జీవో జారీ చేయడం పట్ల కాంగ్రెస్ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వేములవాడంలోని ప్రభుత్వ విప్ నివాసంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, జిల్లా నాయకులు నీరటి మల్లేశం, మండల ఉపాధ్యక్షులు పుప్పాల కొమురయ్య, తోకల నర్సయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ మిట్టపల్లి రాజారెడ్డి, మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండి సయ్యద్, యస్సి సెల్ అధ్యక్షులు దాసరి గణేష్, మాజీ సర్పంచ్ లచ్చునాయక్ పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి ఎండీ షాహిద్ అలీ

నవతెలంగాణ-మేడిపల్లి

రైతులు విత్తనాలను తప్పని సరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎండి. షాహిద్ అలీ సూచించారు. శుక్రవారం మండలంలోని కొండాపూర్ గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. లీటర్ నీటికి ఒక గ్రామ్ బావిస్టిన్ గాని, కార్బండజిం గాని మ్యాంగోసెబ్ మందులను వరి విత్తనాలలో చల్లుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సురేందర్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో వెల్గటూర్ యువకుడికి రెండు బహుమతులు

నవతెలంగాణ- వెల్గటూర్

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో వెల్గటూర్‌కు చెందిన యువకుడు పవన్ కల్యాణ్ రెండు బహుమతులు గెలుచుకుని గ్రామానికే గర్వకారణంగా నిలిచాడు. పవన్ కల్యాణ్ పరుగు పోటీలో ప్రథమ స్థానం సాధించగా, షాట్‌పుట్ త్రోలో ద్వితీయ స్థానం దక్కించుకున్నాడు. ఈ విజయాల నేపథ్యంలో అతనికి ప్రభుత్వ వికలాంగుల సాధికార సంస్థ డైరెక్టర్ బి.శైలజ, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, సంక్షేమ అధికారి బొనగిరి నరేష్ బహుమతులు ప్రదానం చేశారు. పవన్ కల్యాణ్ సాధించిన ఈ విజయం పట్ల అతని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అతని ప్రతిభను కొనియాడుతూ మరింత ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



నవతెలంగాణ-మేడిపల్లి

భీమారం మండల కేంద్రంలోని పలు గ్రామాలకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం వేములవాడలో ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ శ్రీనివాస్‌ను కలిసి సంఘం కోసం భూమి కేటాయించాలని వినతి పత్రం ఇచ్చారు.

స్థానిక ఎన్నికల్లో బూత్ అధ్యక్షుడిదే కీలక పాత్ర



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-మల్లాపూర్

స్థానిక ఎన్నికల్లో బీజేపీ బూత్ అధ్యక్షుడిదే కీలక పాత్ర అన్ని బీజేపీ మల్లాపూర్ మండల ఇన్‌చార్జి వడ్డేపల్లి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయా గ్రామాలను అన్ని బూత్ అధ్యక్షులకు క్రియాశీల సభ్యత్వంపై నూతన కార్యవర్గంపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర లక్ష్మి, గుండు భూమాగౌడ్, లవంగ శివకుమార్ తదితరులు ఉన్నారు.

యు ట్యూబ్ విలేకరులపై కేసు నమోదు

నవతెలంగాణ-మెట్‌పల్లి

మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఇద్దరు యూట్యూబ్ విలేకరులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. మల్లాపూర్ మండలం సాతారం గ్రామానికి చెందిన సౌడారపు వెంకట రమణ మెట్‌పల్లిలో కిరణం నడుపుతున్నాడు. ఈ నెల 24న బాధితుడు తన కారులో సాతారం వెళుతున్న క్రమంలో వెంపేట్ రోడ్డులోని వేంకటేశ్వర ఫంక్షం హాల్ వద్ద కారు ఆపి విలేకర్లమని, నీ వద్ద నకిలీ వస్తువులు ఉన్నాయని బెదిరించి, కారులో సామానులను చెల్లాచెదురు చేసి, అతని ఫోన్ లాక్కొని ఫోన్ పే ద్వారా రూ.4వేలు వారి ఖాతాలోకి ట్రాన్స్‌ఫార్ చేసుకున్నారని తెలిపారు. ఎవరికైనా చెపితే చంపుతామని బెదించించినట్టు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

రైతులు సీఎం ప్రసంగం వీక్షించాలి

నవతెలంగాణ-వెల్గటూర్/ మేడిపల్లి

నేడు మహబూబ్‌నగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే రైతు పండగ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమం నేడు మధ్యాహ్నం 3:00 గంటలకు ప్రారంభం అవుతుందని మండలంలోని రైతులందరూ తమ గ్రామానికి సమీపంలోని రైతు వేదిక వద్ద చేరి సీఎం ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వీక్షించాలని వ్యవసాయ అధికారి సాయి కిరణ్ కోరారు.

మేడలిపల్లి : మండలంలోని రైతులందరూ రైతు వేదిక మేడిపల్లి లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించవచ్చని మండల వ్యవ సాయ అధికారి ఎండి. షాహిద్ అలీ సూచించారు. రైతులను అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సంక్షేమ పథకాలు పేదలకు ఒక వరం

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

నవతెలంగాణ-సారంగాపూర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సీఎం సహాయనిధి, కల్యాణ లక్ష్మి ఇలా ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలన్ని పేదలకు వరం లాంటివని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం సారంగాపూర్ మండల కేంద్రం రైతు వేదికలో ఏర్పాటు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందించారు. మండలానికి చెందిన 47 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 9 లక్షల 70 వేల రూపాయల విలువగల చెక్కులను, 14 మంది ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం ద్వారా మంజూరైన 14 లక్షలరూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో జగిత్యాల నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. రేవంత్‌రెడ్డి సర్కార్ గత ప్రభుత్వంలో అందిన సంక్షేమ పథకాలతో పాటు నూతన సంక్షేమ పథకాలను కూడా అమలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో 16 వేల కోట్లు రుణమాఫీ చేస్తే రేవంత్ సర్కార్ రైతులను రుణ విముక్తి చేయాలని ఏకకాలంలో 18 వేల కోట్లతో రుణమాఫీ అమలు చేయడం జరిగిందన్నారు. సాంకేతిక కారణాలవల్ల కొందరి రైతు రుణమాఫీ కాలేదని వారికి కూడా త్వరలో రుణమాఫీ అమలు చేస్తామన్నారు. పొతారం గ్రామం డబల్ బెడ్ రూం ఇండ్ల కరెంటు సదుపాయాల కోసం రూ.10లక్షలు, డ్రైనేజీ కోసం రూ.3 లక్షల 30వేలు మంజూరు అయ్యాయన్నారు. వీటితో పాటు మండలానికి కోటి 30 లక్షలతో సీసీ రోడ్లకు నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఇంకా ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్‌లో ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు అంచనాలు పంపడం జరిగిందన్నారు. రోళ్ల వాగు కొన్ని కారణాల వల్ల ఆలస్యం అయింది కానీ ఆగిపోలేదని ప్రాజెక్ట్ పూర్తి చేయటానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జమీర్, మాజీ జడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, సారంగాపూర్ మాజీ సర్పంచ్ గుర్రాల రాజేందర్‌రెడ్డి, ఫాక్స్ చైర్మెన్ ఏలేటి నర్సింహారెడ్డి, నాయకులు జోగినపెల్లి సుధాకర్‌రావు. మాల్యాల జలపతి, పల్లపు వెంకటేష్, మండల, గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ దొందు దొందే

- తెరచాటు రాజకీయాలతో వారి బంధం తేటతెల్లం.
- కాంగ్రెస్ పట్టణ, మండల నాయకులు

నవతెలంగాణ - మెట్‌పల్లి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై అనవసరపు విమర్శలు, ఆరోపణలు చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండు ఒకటేనని, తెరచాటున రాజకీయాలు చేయడంలో వారికి వారే చాటని కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షుడు జెట్టి లింగం, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. పదేండ్లు రాష్ట్రంలో అధికారం చలాయించిన బీఆర్ఎస్ పార్టీపై నమ్మకం లేకనే ప్రజలు ఆ పార్టీని తిరస్కరించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కలను సహకారం చేసిన కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని కట్టబెట్టారని, ఈ విషయాన్ని బీజేపీ పార్టీ నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశ, రాష్ట్రాల అభివృద్ధిఇన పక్కనపెట్టి మత రాజకీయాలను చేయడం మాత్రమే పనిగా పెట్టుకున్నదని విమర్శించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కులాలను, మతాలను విడగొట్టే ప్రయత్నం చేస్తూ నీచ రాజకీయాలకు పాల్పడుతుందని, ఆరోపించారు. ప్రజలకు బిజెపి పార్టీపై నమ్మకం తగ్గిందనడానికి పార్లమెంటు ఎన్నికల్లో వచ్చిన తక్కువ సీట్లే నిదర్శనమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైనదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించడానికి బీఆర్ఎస్, బీజేపీలో కలిసి పని చేసిందనే విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. జగిత్యాల జిల్లాలో ఏకైక వ్యవసాయ ఆధారిత పరిశ్రమ అయినా ముత్యంపేట చక్కెర కర్మాగారాన్ని నాశనం చేసిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని, అప్పట్లో ఆ ప్రభుత్వం కర్మాగార లే ఆఫ్ ప్రకటించినప్పుడు బీజేపీ నేతలు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముత్యంపేట చక్కెర కర్మగారాన్ని పునరుద్ధరణ చేయడానికి అవసరమైన ప్రక్రియను ప్రారంభించిందని, ఇది తెలియని బీజేపీ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారాన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని, అనవసరపు రాద్ధంతాలకు పోయి బీజేపీ నాయకులు తమ విలువను పోగొట్టుకోవద్దన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు తీగల లింగారెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు పన్నాల మాధవరెడ్డి, మార్గం గంగాధర్, పార్టీ నాయకులు పిప్పెర రాజేష్, చెర్లపల్లి రాజేశ్వర్ గౌడ్, బుర్ర మహేందర్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ గల్ఫ్ బాధితులకు కల్వకుంట్ల కుటుంబం క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు

నవతెలంగాణ-కోరుట్ల



గల్ఫ్ బాధితులకు కల్వకుంట్ల కుటుంబం క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు శుక్రవారం కోరుట్ల పట్టణంలోని జువ్వాడి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కృష్ణారావు మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తెలంగాణ ప్రాంతం నుంచి గల్ఫ్ దేశాలకు పోవాల్సిన అవసరం ప్రజలకు ఉండదని, ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తామని చెప్పి మాజీ సీఎం కేసీఆర్ నమ్మించి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉత్తర తెలంగాణ నుంచి అత్యధికంగా గల్ఫ్ కార్మికుల కోసం రూ.5లక్షల ప్రమాద బీమాను ప్రకటించిందని గుర్తు చేశారు. కోరుట్ల నియోజకవర్గానికి చెందిన పేదలు ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి మరణించగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి, గల్ఫ్‌లో మృతి చెందిన కార్మికులకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చేలా కృషి చేశారని పేర్కొన్నారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ఎమ్మెల్యేగా ఉన్న విద్యాసాగర్, ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్ గల్ఫ్ కార్మికుల కోసం ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గల్ఫ్‌లో మరణించిన మోహమ్మద్ నబి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా పత్రాలను కృష్ణారావు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంతం రాజం, మార్కెట్ కమిటీ చైర్మెన్ పన్నాల అంజిరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేష్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెరుమాండ్ల సత్యనారాయణ, కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం, కౌన్సిలర్ సంగ లింగం పోతుగంటి శంకర్ గౌడ్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

విద్యార్థినులు, మహిళలు ధైర్యంగా ఉండాలి

జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

విద్యార్థినులు, మహిళలు అభద్రత భావానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ భరోసా ఇచ్చారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో షీ టీం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ టీం, తెలంగాణ మహిళ రక్షణ విభాగం రూపొందించిన వాల్ పోస్టర్లను ఎస్పీ ఆవిష్కం చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. సోషల్ మీడియాలో పరిచమయ్యే వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు, విద్యార్థినులు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా సంప్రదించాలని, నేరుగా సంప్రదించలేని వారు 8712670783, డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ భీమ్‌రావు, డీఎస్పీలు రవీంద్రకుమార్, రఘు చందర్, రాములు, ఎస్‌బి ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్, ఎస్సైలు గీత, శ్వేత పాల్గొన్నారు.

ప్రమాద నివారణకు ఫ్లెక్సీలు ఏర్పాటు

నవతెలంగాణ-మల్యాల

మండలంలోని కొండగట్టు ఘాటు రోడ్‌లో జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని ఆ ఘాట్ రోడ్డులో వచ్చే వాహనదారులకు, ప్రయాణీకులకు, భక్తులకు ఎస్పీ ఆదేశాల మేరకు ఐదు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరిగిందని మల్యాల ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

గోదాముల నిర్మాణానికి స్థలం కేటాయించాలి

నవతెలంగాణ-మల్యాల



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న కమిటీ అధ్యక్షుడు

5000 మెట్రిక్ టన్నుల కెపాసిటీ గల గోదాముల నిర్మాణానికి, స్థలం కేటాయింపు కోసం మల్యాల మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్‌గౌడ్ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వినతిపత్రం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ.. మల్యాల, కొడిమ్యాల మండలాల రైతులకు మరింత సేవలు అందించటానికి మల్యాల మండలం రామన్నపేట-నూకపల్లి వరద కాలువకు సంబంధించిన స్థలం, కొడిమ్యాల మండలం తిర్మలాపూర్ వద్ద ప్రభుత్వ స్థలం కేటాయించటానికి కృషి చేయాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చినట్టు చెప్పారు. వైస్ చైర్మెన్ గడ్డం జీవన్ రెడ్డి, కొడిమ్యాల పాక్స్ చైర్మెన్ రాజ నర్సింగారావు, యూత్ కాంగ్రెస్ నాయకుడు ముత్యం శంకర్ తదితరులున్నారు.

యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దు

ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని ఎస్‌ఐ అనిల్ అన్నారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి గ్రామమైన మూడు బొమ్మల మేడిపల్లి గ్రామంలో పోలీస్ కళా బృందం 'మూఢ నమ్మకాలు ఆత్మహత్యలు నివారణ, రోడ్డు ప్రమాదాలు నియమాలు, గల్ఫ్ ఏజెంట్ల మోసాలు, సైబర్ క్రైమ్, సీసీ కెమెరాలు అవేక్షిత తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ అనిల్ కుమార్ హాజరై మాట్లాడారు. సైబర్ నేరాలు బాగా పెరుగు తున్నాయని, ఎవరైనా మోసపోతే 1930కు ఫిర్యాదు చేయాలని కోరారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన ప్రారంభం

నవతెలంగాణ-కోరుట్ల



కోరుట్ల పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నవ చేతన విజ్ఞాన సమితి సంచార పుస్తకాలయంను కాంగ్రెస్ పార్టీ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నరసింగరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుస్తకాలు చదవడం వల్ల కొత్త విషయాలు తెలుసుకోవచ్చుని, ప్రతి ఒక్కరు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ మధ్య కాలంలో ప్రజలు సెల్ఫోన్ మోజులో పడి పుస్తకాలు చదవడంలో చాలా వెనుకబడి పోతున్నారని తెలిపారు. కోరుట్ల పట్టణంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసిన నవచేతన విజ్ఞాన సమితి వారిని అభినందనలు తెలిపారు. ఈ నెల 29 నుండి డిసెంబర్ 5వ తేదీ వరకు పుస్తక ప్రదర్శన అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జువాడి కృష్ణారావు, కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అన్నం అనిల్, చెన్న విశ్వనాథం, సుతారి రాములు, ఏలేటి మహిపాల్ రెడ్డి, కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం, చిట్యాల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మండల స్థాయి గణిత శాస్త్ర ప్రతిభ పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-పెగడపల్లి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ మ్యాథ్స్ ఫోరం మండల శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత శాస్త్ర ప్రతిభ పోటీలు నిర్వహించారు. ఈ పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు శివాని మొదటి బహుమతి, అకిరా భార్గవి రెండో బహుమతి, రమ్య సాహిత్య మూడో బహుమతి, మోడల్ స్కూల్ విద్యార్థి నవ్యకు మొదటి బహుమతిని ఎంఈఓ సులోచన దేవి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు లలిత, భారతి, తెలంగాణ మ్యాథ్స్ ఫోరం మండల అధ్యక్షుడు లింగంపల్లి లచ్చయ్య, జిల్లా బాధ్యులు అశోక్, శ్రీనివాస్, పరమేశ్వర్, సుప్రియ, శివ జ్యోతి, సంగీత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తా

- కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు



భూమి పూజ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-మల్లాపూర్

రాబోయే రోజుల్లో మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శుక్రవారం మండలంలోని గుండం పెల్లి గ్రామంతో పాటు ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనుకు భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలతో పాటు, గల్ఫ్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా అందిస్తుందని అన్నారు. వారి వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ అంతడుపుల పుష్పలత నరసయ్య, కిసాన్ కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఎల్లాల జలపతి రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ నారాయణ, నాయకులు కోటగిరి నందు, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా కొనసాగుతున్న డేటా ఎంట్రీ

నవతెలంగాణ-వెల్గటూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే నవంబర్ 6 నుంచి 18వ తేదీ వరకు పూర్తి కాగా, సర్వేకు సంబంధించిన డేటా ఎంట్రీ ప్రక్రియ వెల్గటూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శరవేగంగా కొనసాగుతోంది. గడచిన ఐదు రోజులుగా ఈ ప్రక్రియకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. ఎంపీడీవో శ్రీనివాస్ వెల్లడించిన వివరాల ప్రకారం ఇప్పటి వరకు వెల్గటూర్ మండలంలో 49 శాతం డేటా ఎంట్రీ పూర్తి కాగా, ఎండపెల్లి మండలంలో 44 శాతం పని ముగిసింది. మొత్తం సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు కార్యాచరణను ముమ్మరం చేస్తున్నారు.


విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

తెలంగాణ గణిత ఫోరమ్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. టాలెంట్ టెస్ట్ పేపర్లను మండల విద్యాధికారి బండారి మధు, కాంప్లెక్స్ ప్రధానో పాధ్యాయులు మ్యాకల రాజన్న విడుదల చేశారు. మండలంలోని ఉన్నత పాఠశాలల నుంచి 32 మంది పాల్గొన్నారు. టెస్టును తెలంగాణ గణిత ఫోరం మండల అధ్యక్షుడు కోటగిరి వెంకట రత్నం, ఉపాధ్యక్షులు రేణుక, రాజేష్, ప్రధానకార్యదర్శి సుమతి, కోశాధికారి ప్రేమాకుమార్, కార్యవర్గ సభ్యులు శ్రీదేవి, శంకర్ నిర్వహించారు.

యథేచ్ఛగా ఇసుక రవాణా

నవతెలంగాణ- మేడిపల్లి



మేడిపల్లి, భీమారం మండలాల్లోని పోరుమళ్ళ ఎక్స్ రోడ్, కొండాపూర్, ఈదుల లింగంపేట, మోత్కు రావుపేట, దమ్మన్నపేట, భీమారం గ్రామాల్లో యథేచ్ఛగా ఇసుక రవాణా కొన సాగిస్తున్నారు. మైనర్లు డ్రైవర్లుగా మారి ట్రాక్టర్లను వేగంగా నడుపుతున్నారు. వాగుల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను డంపు చేస్తూ రాత్రి వేళ్లల్లో ఇసుక తరలిస్తున్నారు. ఇటీవల రెవెన్యూ డివిజన్ ఉన్నతాధికారి ఆదేశాల మేరకు కోరుట్లలో ఏకకాలంలో సుమారు 15 ట్రాక్టర్లను రాత్రి వేళల్లో సంబంధిత రెవెన్యూ అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పును సుమారు రూ.2 వేల 500 నుంచి 4వేల వరకు విక్రయిస్తున్నట్టు సమాచారం. కానీ సంబంధిత అధికారులు మాత్రం చూసిచూడ నట్టుగా వ్యవహరిస్తున్నారు.

అక్రమ ఇసుక రవాణా చట్టరీత్యా నేరం

మైనర్లు వాహనాలు నడిపితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని మేడిపల్లి స్టేషన్ హౌస్ అధికారి జి. శ్యామ్ రాజ్ తెలిపారు. అక్రమ ఇసుక రవాణా చేస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసులు నమోదు చేసి తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఖురాన్ కంఠస్థం చేసిన విద్యార్థులకు సన్మానం

నవతెలంగాణ - మెట్‌పల్లి



మెట్‌పల్లి పట్టణంలోని బిస్మిల్లా మస్జిద్‌లో అరేబియా తజ్వీదుల్ ఖురాన్ మదర్సాలో హాఫిజ్ ఏ ఖురాన్ హిఫ్జ్ పూర్తి చేసిన ఇద్దరు విద్యార్థులను మదర్స పెద్దలు సన్మానించారు. మదర్సా అర్బియా తజ్వీదుల్‌లో చదువుతున్న అబ్దుల్ అజీజ్, మొహమ్మద్ రిజ్వాన్ ఖురాన్ హిఫ్జ్ కంఠపాఠం చేశారని మాదర్స ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మదర్సా ప్రధానోపాధ్యాయులు ప్రిన్సిపాల్ అబ్దుల్ హమీద్, ఖరీ మహిముదుల్ హాసన్, కుతుబొద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేర విచారణ సమర్థవంతంగా ఉండాలి

- రౌడీ షీటర్స్, హిస్టరీ షీటర్స్‌పై నిఘా పెట్టాలి
- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

నవతెలంగాణ - సిరిసిల్ల

నేర విచారణ మరింత సమర్థవంతంగా ఉండాలని, రౌడీ షీటర్లు, హిస్టరీ సీటర్స్‌పై నిరంతరం నిఘా ఉంచాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, అక్రమ వ్యాపారాలపై నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వేములవాడ సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని నేర సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. నేర విచారణ మరింత సమర్థవంతంగా చేయడం తోపాటు కేసులను సత్వరం పరిష్కరించే విధంగా పోలీస్ అధికా రులంతా సమర్థవంతంగా పని చేయాలని,పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.పోలీస్ శాఖ వినియోగిస్తున్నా


సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సాంకేతికతను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటూ నేరాలపై నిఘా పెంచాల్సిన అవసరం ఉన్నదన్నారు.

రౌడీ షీటర్స్,హిస్టరీ షీటర్స్‌లపై నిరంతర పర్యవేక్షణ

వివిధ నేరాల్లో నిందుతులుగా ఉండి షీట్లు తెరువబడి వారు విధిగా పోలీస్ స్టేషన్ కి హాజరు కావాలని లేని పక్షంలో బైండోవర్ చేయాలన్నారు.పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీషీటర్ల,హిస్టరీ షీటర్స్ ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని,శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే వారిపై కొత్తగా రౌడీషీట్స్ తెరవాలని ఆదేశించారు.

చట్ట వ్యతిరేక, అక్రమ వ్యాపారాలపై నిఘా..

జిల్లాల, రాష్ట్ర సరిహద్దుల నుండి వచ్చే గంజాయి సరఫరా చేసే మూలాలను, కీలక వ్యక్తులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి అక్రమ గంజాయి రవాణా పకడ్బందీగా నియంత్రించాలన్నారు. పేకాట, గుడుంబా, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, పీడీఎస్ రైస్ అక్రమ రవాణాపై నిఘా ఉంచి దాడులు నిర్వహించాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు, వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య సి.ఐ లు వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మధుకర్, ఎస్.ఐ లు ,ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

కొంతమంది అధికారులు కేటీఆర్ చెప్పుచేతల్లో ఉన్నారు

- అధికారులు ప్రజాస్వామ్యబద్ధంగా పని చేయాలి
- పద్ధతి మార్చుకోకపోతే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలి
- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కెకె మహేందర్ రెడ్డి



నవతెలంగాణ - సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొంతమంది అధికారులు కేటీఆర్ చెప్పుచేతల్లో పని చేస్తున్నారని, అధికారులు ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయాలని, పాత జ్ఞాపకాలు మర్చిపోలేని పరిస్థితిలో ఉంటే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కెకె మహేందర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి ఒక్కరి సమస్యల పరిష్కారానికి కషి చేస్తున్న జిల్లా అధికారి మీ దోపిడీకి అడ్డుకట్ట వేస్తున్నాడని ఎమ్మెల్యే కేటీఆర్ కించపరిచే విధంగా మాట్లాడడం సరైన విధానం కాదన్నారు. మీ ప్రభుత్వం అధికారంలో లేదని గుర్తుంచుకోవాలని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులకు తాము గౌరవం కల్పిస్తున్నామన్నారు. భూమి వివాదాలు బయటకు వస్తుంటే ఏం జరుగుతుందోనని కేటీఆర్ భయాందోళనలో పడ్డారని అందుకే విచక్షణ కోల్పోయి కలెక్టర్‌పై దురుసుగా మాట్లాడుతున్నాడన్నారు. డబ్బులు ఇచ్చి అధికారులను హత్య చేయించే దుర్బుద్ధి బీఆర్ఎస్ నాయకులదని, దీనికి లగచర్ల ఘటనే ఉదాహరణ అని ఆరోపించారు. కేసీఆర్ ఆ సమయంలో చేసిన కొంగ దీక్షకే తెలంగాణలో విద్యార్థులు అమరులు కావడానికి కారణం కాదా అని ప్రశ్నించారు. 'కేటీఆర్ నిన్ను సిరిసిల్ల ప్రజలు గెలిపిస్తే సిరిసిల్ల ప్రజలకు అండగా ఉండు.. వారి సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడు.. సిరిసిల్ల ప్రాంత అభివృద్ధికి నిధులు కావాలని అడుగు.. పక్క నియోజకవర్గంలోని ఆది శ్రీనివాసును చూసి నేర్చుకో.. 10 మాసాల్లోనే రాజన్న సిరిసిల్ల జిల్లా అభివృద్ధి కోసం వెయ్యి కోట్ల నిధులు తీసుకువచ్చాడు.." అని హితవు పలికారు. 'నేతన్నలకు ఆధారమైన దారం(యారన్ బ్యాంక్)ను నువ్వు ఎందుకు తీసుకురాలేదు కేటీఆర్.. ఇకనైనా నీ చిల్లర చేష్టలు మానుకో.. నీ తాటాకు చప్పుళ్ళకు ఎవరూ భయపడరు" అని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వరూప, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాముని వనిత, కల్లూరి చందన, నేతలు గడ్డం నర్సయ్య, బొప్ప దేవయ్య, ఆకునూరి బాలరాజు, సూర దేవరాజు, రెడ్డి నాయక్, రవికుమార్, శరణ్య, చంద్రకళ, జగన్, నేదురి లక్ష్మణ్ పాల్గొన్నారు.

కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ సాకారం

- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్
- సిరిసిల్లలో ఘనంగా దీక్ష దివస్



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగానికే సిద్ధపడిన మహా నేత కేసీఆర్ అని, ఆయన చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమాన్ని కీలక మలుపు తిప్పిందని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్ వద్ద నిర్వహించిన దీక్ష దివస్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. మొదటగా సిరిసిల్ల కొత్త బస్టాండ్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, పాత బస్టాండ్ లోని తెలంగాణ అమరుల వీరుల స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం దీక్ష దివస్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 50ఏండ్లు తెలంగాణ పోరాటం సాగిందని, ఎందరో నెత్తురు పారించారన్నారు. 1952 ముల్కీ ఉద్యమం రక్త సిక్తమయినదన్నారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో చరిత్రను మలుపు తిప్పిన రోజు, తెలంగాణ పుట్టుకకు నవంబర్ 29అన్నారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణ రాష్ట్రమే లేదన్నారు. ఒకప్పుడు జై తెలంగాణ అంటే నక్సలైట్‌గా ముద్ర వేశారని, నాడు సమైక్య రాష్ట్రంలో తెలంగాణ పాట పాడితే ముక్కలు ముక్కలు చేసే రోజులని గుర్తుచేశారు. అటువంటి నేర పూరిత రాజకీయాలను రూపు మాపిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. అలాంటి ఉద్యమ చరిత్రను చెరిపేయాలని చూస్తున్నారన్నారు. కేసీఆర్ దీపకాంతి కాదు అని మండే సూర్యుడన్నారు. కేటీఆర్ ఢిల్లీలో దీక్ష చేయడంతో లగిచర్లలలో భూసేకరణను ప్రభుత్వం రద్దు చేసుకుందని ఇది కేటీఆర్ విజయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ న్యాల కొండ అరుణ, సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందంకళ, వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వేములవాడ సిగలో మరో మణిహారం

రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు పునాది

నవతెలంగాణ - వేములవాడ

వేములవాడ పట్టణం మరో కీలక సదుపాయాన్ని పొందనుంది. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బ్లడ్ బ్యాంక్ స్థాపనకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వేములవాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో 1000గజాల స్థలం బ్లడ్ బ్యాంక్ నిర్మాణానికి కేటాయించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు, డాక్టర్ వసంత రావు శుక్రవారం ఈ స్థలం కేటాయింపు పత్రాలు రెడ్ క్రాస్ ప్రతినిధులకు అందజేశారు. బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుతో అత్యవసర సమయాల్లో రక్తం అందక ఇబ్బందులు పడుతున్న రాజన్న భక్తులు, స్థానిక ప్రజలు ఎంతో ఊరట పొందనున్నారు. రక్త పరీక్షలు, ప్లాస్మా, ప్లేట్లెట్స్ సమస్యలతో పాటు తలసేమియా బాధితులకు అత్యుత్తమ సేవలు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు రక్త అవసరాలకుకరీంనగర్ లేదా హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. బ్లడ్ బ్యాంక్ అందుబాటులోకి రావడంతో ఈ సమస్యలు తీరతాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వేములవాడకు వచ్చే భక్తులతో పాటు, స్థానిక ప్రజలకు అత్యవసర సమయంలో రక్తం అందుబాటులో ఉండాలన్న ఉద్దేశ్యంతో ఈ బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు చేస్తున్నట్టు అని విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. భవన నిర్మాణానికి 1000గజాల స్థలాన్ని కేటాయించామని, అవసరమైతే మరింత స్థలం కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ ఎస్. రాజేశ్వర్, డాక్టర్ వసంత రావు, రెడ్ క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

వీర్నపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవోగా వాజిద్



నవతెలంగాణ - వీర్నపల్లి : వీర్నపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)గా అబ్దుల్ వాజిద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీవో పనిచేసిన వాజిద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన రఘురాంను జిఐఆర్‌డిలో జునియర్ ఫ్యాకల్టీకి బదిలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అందేంచే సంక్షేమ పథకాలు, అభివృ కార్యక్రమాలు సత్వరమే అందేలా కృషి చేస్తానన్నారు. కార్యాలయ సిబ్బంది, ఎంపీడీవోను కలిసి అభినందనలు తెలిపారు.

పంట పొలాల్లో చెత్తకుప్పలు

నవతెలంగాణ - వీర్నపల్లి

వీర్నపల్లి మండల కేంద్రంలోని నాలుగో వార్డులో మురుగు కాలువ సమస్య తీవ్ర స్థాయికి చేరుకుంది. కాలువలో చెత్తకుప్పలు పేరుకుపోవడం వల్ల కలిగే దుర్వాసనతో ప్రజలు విసిగిపోతున్నారు. స్థానిక రైతులు గొల్లపల్లి ఎల్లం, పిట్ల లింగం, మాడుగుల సాయిలు మాటాడుతూ పంట పొలాల్లోకి మురుగు, చెత్త చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాలువను శుభ్రం చేయకపోవడంతో దోమల బెడద పెరిగి జ్వరాల బారిన పడి, గ్రామ ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. మురుగు కాలువ ప్లాస్టిక్ కవర్లు, డబ్బాలు, సీసాలు, ఇతర చెత్తతో నిండిపోయి, పంట పొలాలను డంపింగ్ యార్డుగా మార్చేస్తోంది. గ్రామ పంచాయతీ అధికారులు, స్థానిక నాయకులకు ఇబ్బందుల గురించి ఎన్నిసార్లు చెప్పినా సరైన చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "మా సమస్యను గుర్తించి వెంటనే మురికి కాలువను శుభ్రం చేయాలి. దోమల బెడద నుంచి మా కుటుంబాలను, పంటలను రక్షించండి" అని రైతులు, కాలనీవాసులు అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు.



రైతు పండుగకు ఆహ్వానం

- రైతు సోదరులు అందరూ తరలిరావాలి
- సీఎం సభ ప్రత్యక్ష ప్రసారం
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



నవతెలంగాణ - సిరిసిల్ల : ఈ నెల 30న రైతు పండుగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. రైతు పండుగ వేడుకల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబ్ నగర్ జిల్లా నుండి రైతులను ఉద్దేశించి సభలో ప్రసంగించనుండగా శనివారం మధ్యాహ్నం 2గంటల నుంచి ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని తెలిపారు. జిల్లాలోని 13రైతు వేదికలలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైతు సోదరులందరూ తమ గ్రామాలకి సమీపంలో ఉన్న సోదరులందరూ పెద్ద సంఖ్యలో రైతు వేదికలకు తరలివచ్చి, సీఎం ప్రసంగాన్ని వీక్షించాలని జిల్లా కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

నవతెలంగాణ - గంభీరావుపేట:

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు పండుగ మహాసభను విజయవంతం చేయాలని గంభీరావుపేట వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ లిలికోమిరిశెట్టి విజయ తిరుపతి పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌లో 30వ తేదీన జరిగే మహాసభలో ఆధునిక వ్యవసాయ పరికరాలు, కొత్త పద్ధతుల ప్రదర్శన ఉంటుందని రైతులు ఆవశ్యకంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ సీజన్‌లో అధిక ధాన్యం ఉత్పత్తి సాధ్యమైందని, రైతుల కృషి, ప్రభుత్వ ప్రోత్సాహంతో ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. వైస్ చైర్మన్ పాతూరు అంజిరెడ్డి, డైరెక్టర్లు అల్లే రాజం, కొత్తపల్లి బాల్ రెడ్డి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట
మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయం ఎదుట శుక్రవారం మిడ్‌డే మిల్స్ కార్మికులు ధర్నా నిర్వహించి ఎంఈవోకు కృష్ణహరికి వినతిపత్రం అందించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పదివేల రూపాయల జీతాన్ని ఇస్తానని చెప్పి ఇప్పటివరకు అమలు చేయలేదని వెంటనే అమలు చేయాలని డ్రెస్ కోడ్ ఇవ్వాలని వినతిలో పేర్కొన్నారు. మిడ్‌డేమిల్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ మాట్లాడుతూ 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు మోడి ప్రభుత్వం మూడు సంవత్సరాలకు 74 పైసలు మాత్రమే పెంచిందన్నారు. 6నుండి 8వ తరగతి వరకు రూ.1.09 పెంచిందన్నారు. దుర్మార్గమైన ఆలోచన మోడీదంటూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు నిరసన తెలిపారు. అధికారం వచ్చి 11ఏండ్లైనా మోడి ప్రభుత్వం మేస్ చార్జీలు పెంచకపోవడం సిగ్గుచేటన్నారు. డిసెంబర్ 10, 11 తేదిల్లో రాష్ట్ర వ్యాప్తంగా విధులను బహిష్కరించి టోకెన్ సమ్మెకు వెళ్తామని ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, మనమ్మ, సత్తక్క, బొడ్డు నర్సవ్వ, రోజా, జ్యోతి, మల్లవ్వ, కృష్ణవేణి, శంకరయ్య, లావణ్య, నిర్మలలు పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థల బంద్

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు
జాలపెల్లి మనోజ్ కుమార్



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : విద్యాసంస్థల బందును విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపెల్లి మనోజ్ కుమార్ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం మండలంలోని పాఠశాలలు, కళాశాలలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఫుడ్ పాయిజాన్ ఘటనలను నిరసిస్తూ శనివారం చేపట్టే ప్రభుత్వ పాఠశాలలు కూడా బందు చేయాలని జాలపెల్లి మనోజ్ కుమార్ అన్నారు. విద్యార్థుల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం, సంబంధిత అధికారులు పట్టించుకోరా, విద్యాకమిషన్ ఎక్కడ అని ప్రశ్నించారు. విద్యాశాఖ మంత్రి లేకుండా సంవత్సరం పాలనా గడిచిపోయిందన్నారు. విద్యావ్యవస్థపై సమీక్షా లేదా, గురుకుల, సంక్షేమ హాస్టల్లు, జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనం నాణ్యత లేని కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఫుడ్ పాయిజాన్‌తో అస్వస్థకు గురవుతున్నారన్నారు. వరుస సంఘటనలపై ముఖ్యమంత్రి బాధ్యత వహించాలన్నారు. నవంబర్ 30న జరిగే ప్రభుత్వ పాఠశాలల బంద్ జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షులు సాత్విక్, నాయకులు సంతోష్‌లు పాల్గొన్నారు.

నవతెలంగాణ - వేములవాడ

ఫుడ్ పాయిజన్ ఘటనలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసనగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల బంద్‌కు పిలుపునిస్తున్నట్టు ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ వేములవాడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం జరిగే ప్రభుత్వ పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో వరుసగా ఫుడ్ ఫాయిజన్ ఘటనలు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 30న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వేములవాడ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు సామల్ల సాయి భరత్, కడారి శివ, విద్యార్థులు అఖిల్, రాఖి, అబ్దుల్, మనీష్, సలావుద్దీన్, సాత్విక్, శ్రీ హర్షిత, శ్రీజ ,అక్షయ, రుచిత, వర్షిని పాల్గొన్నారు.

పేద కుటుంబానికి బియ్యం వితరణ



నవతెలంగాణ - చందుర్తి : మండలంలోని మాల్యాల గ్రామానికి చెందిన మెరుగు లక్ష్మి రాజంకొంత కాలంగా అనారోగ్యం బారిన పడగా ఆయన కుటుం బానికి శుక్రవారం ఆపద్బాంధవు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం,నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొడగంటి గంగాధర్,లోకోజు సతీష్,పాటి సుధాకర్, ప్రమోద్ ఉన్నారు.

నూకలమర్రి గ్రామానికి సబ్ స్టేషన్ మంజూరు

నవతెలంగాణ - వేములవాడ రూరల్

వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో శుక్రవారం రూ.2 కోట్ల 33 లక్షల 72 వేలతో 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మంజూరు చేయించారు. సబ్ స్టేషన్ మంజూరు పట్ల గ్రామస్తులు,రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా సబ్ స్టేషన్ లేకపోవడంతో నూకలమర్రి చుట్టుపక్కల గ్రామస్తులు లో వోల్టేజ్ తో ఇబ్బందులు ఎదుర్కొన్నారు, సబ్ స్టేషన్ మంజూరు కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సబ్ స్టేషన్ మంజూరుకు కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

చెకుముకి రాష్ట్ర స్థాయి పోటీలకు దమ్మన్నపేట మోడల్ స్కూల్ విద్యార్థులు



నవతెలంగాణ - గంభీరావుపేట : : రాజన్న సిరిసిల్లలో గల రంగినేని ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన చెక్ ముక్ సైన్స్ టాలెంట్ టెస్టులో దమ్మన్నపేట మోడల్ స్కూల్ విద్యార్థులు విష్ణుప్రియ పదవ తరగతి, మణిదీప్ 9వ తరగతి, వర్ష 8వ తరగతిలు పాల్గొనే జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులతో పాటు గ్రామస్తులు అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత, ఉపాధ్యాయులు సుమలత, బాబు జాన్, శ్రీనివాస్, అంజూమ్, రేణుక, చంద్రశేఖర్, అబ్దుల్ రావుఫ్, సుహాసిని పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట



మండలంలోని నారాయణపూర్ గ్రామంలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.8లక్షలతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సాబేర బేగం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారాయణపూర్ నుంచి రాగట్లపల్లి వెళ్లే పంచాయతీ రోడ్డు నుండి నల్ల పోచమ్మ ఆలయం వరకు ఈ రోడ్డు నిర్మాణం చేస్తామన్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి సహకరించిన సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జీ కేకే మహేందర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం ఈజీఎస్ పనుల కింద సుమారు 35 లక్షల రూపాయల వరకు సిసి రోడ్డును మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎండి జాఫర్, మాజీ ఉపసర్పంచ్ సిరిపురం మహేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆటల్లోనూ రాణించాలి

ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్



నవతెలంగాణ - కొనరావుపేట

విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణించాలని, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచించారు. కొనరావుపేట మండలంలోని మరిమడ్ల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. మెనూలో ఏ ఆహార పదార్థాలు పెట్టారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారు చదువుతోపాటు ఆటల్లో రాణించేలా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతి పరీక్షలో రాణించాలి

- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- చిన్న బోనాల గురుకుల విద్యాలయం తనిఖీ



నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్ : విద్యార్థులు ప్రతి పరీక్షలో రాణించేలా సిద్ధం చేయాలని టీచర్లను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్న బోనాలలోని గురుకుల విద్యాలయాన్ని కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, విద్యాలయం ఆవరణ, కిచెన్ గది, కూరగాయలు, బియ్యం, కోడిగుడ్లు, పండ్ల నాణ్యతను పరిశీలించారు. విద్యాలయం ఆవరణ స్వచ్ఛంగా, పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారు? అని ఆరా తీశారు. మొత్తం 548మంది విద్యార్థులు చదువుతున్నారని ప్రిన్సిపాల్ థెరిసా కలెక్టర్‌కు వివరించారు. అనంతరం విద్యార్థులను మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లీష్ అంశాల్లో ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేలా తీర్చిదిద్దాలని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.

ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మూశం రమేష్



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

గత ప్రభుత్వం హయాంలో అర్హులై ఉండి డ్రాలో డబుల్ బెడ్ రూం ఇండ్లు రాని వారికి మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇల్లు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మూశం రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం అర్హులైనందరికీ డబుల్ బెడ్ రూంలు ఇస్తామని చెప్పి పూర్తి స్థాయిలో ఇండ్లను కేటాయించకుండా మోసం చేసిందన్నారు. డ్రాలో కొంతమందికి మాత్రమే డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించారన్నారు. అనర్హులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించడం వల్ల నిజమైన నిరుపేదలకు అన్యాయం జరిగిందన్నారు. 10ఏళ్ల నుంచి సొంతింటి కోసం పోరాడుతున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి డబుల్ బెడ్ రూం ఇండ్లు రాని వారికి మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇల్లు పథకంలో నివేషణ స్థలం కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. పట్టణ కార్యదర్శి అన్నల్ దాస్ గణేష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శ వర్గ సభ్యులు కోడం రమణ, కమిటీ సభ్యులు సూరం పద్మ, ఎలిగేటి రాజశేఖర్, బెజిగం సురేష్, వద్నాల వీరేశం, మోర తిరుపతి, నల్ల బాలు, దాసరి రూప,గట్ల సప్న, బోనాల లక్ష్మి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలను ఏంఈఓ తనిఖీ

నవతెలంగాణ - గంభీరావుపేట :



గంభీరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియం పాఠశాలను మండల విద్యాధికారి సంటి. గంగారాం శనివారం తనిఖీ చేశారు. యన్ఏఎస్, ఎల్ఐపీ పర్యవేక్షణలో భాగంగా తరగతి గది పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ప్రధానో పాధ్యాయులు బరిగెల దేవయ్య ఆధ్వర్యంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉర్దూ మీడియం విద్యార్థులకు 65 స్వెటర్స్‌ను ఏంఈఓ చేతుల మీదుగా పంపిణీ చేశారు. నూతనంగా నియామకమైన ఏంఈఓను పాఠశాల అధ్యాపక బృందం సన్మానించింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏండీ ఫసియొద్దీన్, రవి, శైమారాణ, రజని, జా హేదా, రిజ్వాన పాల్గొన్నారు.

స్త్రీల హింసపై వ్యతిరేకంగా పక్షోత్సవాల సమావేశం

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజన్నసిరిసిల్ల జిల్లాలోని సఖి కేంద్రం ఆధ్వర్యంలో స్త్రీల హింసపై వ్యతిరేకంగా పక్షోత్సవాలు భాగంగా కళాశాల విద్యార్ధిని విద్యార్థులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సఖి కేంద్రం కౌన్సిలర్ అంజలి మాట్లాడుతూ గృహహింస, మానసిక హింస, వరకట్నం హింస, మొదలగు దాడుల గురించి బాల బాలికలకు ఎంతో అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సోషల్ మీడియా ద్వారా వాట్సాప్, ఫేస్‌బుక్, ఇంస్టాగ్రామ్, ట్విట్టర్ సామాజిక మాధ్యమాల ద్వారా యువతులు, స్త్రీలపై రోజు రోజుకు హింస పెరుగుతుందన్నారు. ఇలాంటి వాటిని ధైర్యంగా ఎదుర్కొని మా సఖి కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. అమ్మాయిలు ఏలాంటి సందర్భంలో కూడా మానసిక స్థైర్యాన్ని కోల్పోకుండా ధైర్యంగా బయటికి వచ్చి మా సఖి కేంద్రాన్ని సంప్రదిస్తే మేము మీకు బాసటాగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎం. చంద్రమౌళి, సిహెచ్ భూమక్క, బి. కవిత, ఏ గౌతమి, సిహెచ్ ప్రవళిక, ఆర్ గీత, కే సాగర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
పెద్దపల్లి
శనివారం | నవంబర్ 30, 2024 | www.navatelangana.com

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్‌కు సంబంధించిన సమస్యలపై రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు కాంగ్రెస్ డివిజన్ ఇన్‌చార్జ్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బెంద్రం రాజిరెడ్డి వినతి పత్రాన్ని అందజేశారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యేకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బెంద్రం రాజిరెడ్డి వివరించగా, సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే 39వ డివిజన్ అభివృద్ధికి తన శాయశక్తుల కృషి చేస్తానని, అభివృద్ధి నా బాధ్యతని, తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని రాజిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట 100 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.


సమస్యలను ఎమ్మెల్యేకు వివరిస్తున్న రాజిరెడ్డి

ట్రాఫిక్‌పై అవగాహన ర్యాలీ



నవతెలంగాణ-గోదావరిఖని:
ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని శ్రీ చైతన్య హైస్కూల్ విద్యార్థులు ట్రాఫిక్ అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్ నినాదాలతో ప్లేకార్డులు ప్రదర్శిస్తూ ఎఫ్‌సీఐ రోడ్డు చౌరస్తాలో ర్యాలీ చేపట్టి ట్రాఫిక్ నియమ, నిబంధనల గురించి ప్రజలకు స్థానిక ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని, శ్రీ చైతన్య హైస్కూల్, విద్యార్థులు ఎఫ్‌సీఐ రోడ్డు చౌరస్తాలో ర్యాలీ నిర్వహించి ట్రాఫిక్ నియమాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించని వారికి పుష్పగుచ్ఛాలు అందిస్తూ ట్రాఫిక్ నియమాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉదయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ నమ్రత, ఏవో నరేంద్ర కుమార్, డీన్ అనిల్ కుమార్, ఇన్‌చార్జ్ శైలజ, పీఈటి శృతి, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు.

ఓసీపీ-5లో సమస్యలను పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ ధర్నా


ప్రాజెక్ట్ మెనేజర్‌కు వినతి అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని ఓసీపీ-5లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ సదానందం, ఫిట్ సెక్రటరీ ఆంజనేయులు ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓసీపీ-5లో నూతన యంత్రాలను కొనుగోలు చేసి ఉత్పత్తిని చేపట్టాలని, ఓవర్ మెన్లకు ఛార్జ్ అలవెన్స్‌ను వెంటనే తిరిగి పునరుద్ధరించాలని, డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ పనులను కంపెనీ ఉద్యోగులతో చేయించాలని, నూతనంగా నిర్మించిన వాషింగ్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని, కార్మికులపై యాజమాన్యం వేధింపు చర్యలను మానుకోవాలని, బేస్ వర్క్ షాప్‌లో షెల్టర్లు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రాజెక్ట్ మెనేజర్‌కు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ ధర్నాలో నాయకులు గడ్డం కృష్ణ, గంద్ర దామోదర్ రావు, బత్తుల పోచయ్య, దేవులపల్లి రాజేందర్, విజయ్ మోహన్, పోతరవేన సమ్మయ్య, మండ రమేష్, పుట్ట రమేష్, కోర శ్రీనివాస్, కందికట్ల సమ్మయ్య, గడ్డం వెంకటేశ్వర్లు, రామ్‌చందర్, ఎం.సుధాకర్ రెడ్డి, గుండేటి శ్రీనివాస్, ఎదులాపురం శ్రీనివాస్, తాటికొండ అంజయ్య, కూషనపల్లి శంకర్, నాగరాజు, ఆర్‌డి చారి, ఏ.కష్ణ, పైడిపల్లి అశోక్, తాళ్ల కుమార్, ఎల్.అశోక్, రామకష్ణ, మామిడి రవి, పి.సంపత్, వెంకటేష్, దశరథం, లింగయ్య, మురళీ తదితరులున్నారు.

పరామర్శ



నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం కార్పొరేషన్ 27వ డివిజన్ గాంధీ నగర్‌కు చెందిన వర్కింగ్ జర్నలిస్ట్ వడ్డెపల్లి దినేష్ తల్లి రాజ్యలక్ష్మి పెద్ద కర్మశుక్రవారం జరుగగా, వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు వర్కింగ్ జర్నలిస్ట్ వడ్డెపల్లి దినేష్‌ను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, రాజ్యలక్ష్మి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా 50 కిలోల బియ్యాన్ని వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు అందజేశారు.

జానులిరికి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే



జానులిరిని అభినందిస్తున్న రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

నవతెలంగాణ-గోదావరిఖని:
ఢీషోలో కంటెస్ట్‌గా పాల్గొని విన్నర్ ట్రోఫీని అందుకున్న రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి చెందిన జానులిరిని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అభినందించారు. ఢీషో విన్నర్ ట్రోఫీని అందుకున్న జానులిరికి సినీ అభిమాన సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ జానులిరికి శాలువా కప్పి ట్రోఫీని అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో సినీ అభిమాన సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కాంపల్లి సతీష్, అభిమాన సంఘం నాయకులు నెలకంటి రాములు, గౌరవ అధ్యక్షులు గట్ల రమేష్, చైర్మన్ గుండేటి రాజేష్ తదితరులున్నారు.

పెద్దపల్లి జిల్లా స్థాయి ఉమెన్స్ కబడ్డీ పోటీలు

నవతెలంగాణ-పెద్దపల్లి
పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మైదానంలో కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమెన్స్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు ధర్మయ్య తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డుతో హాజరుకావాలని అన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 7 నుండి 10 తారీకు వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగే కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శంకర్, సలహాదారు కృష్ణయ్య, వైస్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, సెక్రటరీ కరుణాకర్, జాయింట్ సెక్రటరీ షఫీ, సీనియర్ క్రీడాకారుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు నిరాశ మిగిల్చిన గుర్తింపు సంఘం

ఎస్‌సీఈయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి



నవతెలంగాణ-గోదావరిఖని:
ఐదు సంవత్సరాల తర్వాత జరిగిన సింగరేణి స్ట్రక్చర్ సమావేశంలో కార్మికులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న సొంత ఇంటి పథకం అమలు, పెర్క్స్ మీద ఇన్కమ్ టాక్స్ సమస్య, పేర్ల మార్పిడి, హాస్పిటల్, విద్యా సమస్యలపై ఎలాంటి ఎజెండానే లేకుండా సింగరేణి యాజమాన్యంతో గుర్తింపు సంఘం చర్చలు ప్రారంభించి కార్మికులకు నిరాశ మిగిల్చిందని సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి ఒక ప్రకటనలో అన్నారు. గురువారం జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో 12 డిమాండ్లపై చర్చలు జరి పిందని, కనీసం వాటిపై కూడా ఎలాంటి పురో గతి లేకుండా చర్చలు వాయిదా పడ్డాయని, దీంతో కార్మికుల ఆశల ను గుర్తింపు సంఘం అడియాశలు చేసింద౦న్నారు. వచ్చే నెలలో సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వద్ద జరిగే చర్చల్లో ఎన్నికల ముందు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యూనియన్ మేనిఫెస్టో లోని 48 డిమాండ్లను నెరవేర్చేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు.

హలో మాల,చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-మంథని
సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్ లో రేపు జరిగే 30 లక్షల పైగా వున్న మాల, మాల అనుబంధ కులాల ఆధ్వర్యంలో నిర్వహించే మాలల సింహగర్జన భారీ బహిరంగ సభను మంథని నియోజకవర్గంలోని మాల,మాల అనుబంధ కులాలు విజయవంతం చేయాలని మాల మహానాడు సంఘం నాయకులు కొవ్వూరి రాజలింగు, బండారి సమ్మయ్య కోరారు.మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో పత్రిక సమావేశం నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంథని నియోజకవర్గంలోని ప్రతి గ్రామ గ్రామం నుండి మాల కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో ఉద్యోగులు,మహిళలు, వ్యాపార వేత్తలు, నాయకులు, న్యాయవాదులు, మేధావులు, జర్నలిస్టులు, కార్మికులు, కర్శకులు, యువకులు, విద్యార్థులు లక్షలాదిగా తరలివచ్చి సభను జనసంద్రంగా మార్చాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాల సింహగర్జన మంథని మండల నాయకులు అప్పాల పోచమల్లయ్య,ఎడ్ల కిష్టయ్య,కొవ్వూరి వేణు ప్రసాద్,కట్ట సదానందం, ఆర్ల సదానందం,పాల్గొన్నారు.

సింగరేణి ఆర్జీ-1లో క్వార్టర్ కౌన్సిలింగ్



నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్‌ల లో, వివిధ క్యాటగిరిలలో పని చేస్తున్న ఎన్‌సీడబ్ల్యూఏ క్యాటగిరి 1 నుంచి 6 వరకు గల ఉద్యోగులకు స్థానిక ఆర్‌సీఓఏ క్లబ్‌లో క్వార్టర్ అలాట్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో క్వార్టర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్‌లో మొత్తం 352 క్వార్టర్‌లకు గాను 70 మంది దరఖాస్తు చేసుకోగా, క్వార్టర్‌లను అర్హత, క్యాటగిరిని, పదవీని బట్టి కేటాయించారు. కౌన్సిలింగ్‌ను పూర్తి పారదర్శకంగా నిర్వహించామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం గోపాల్ సింగ్, డీజీఎం పర్సనల్ కిరణ్ బాబు, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ అరెల్లి పోషం, సీనియర్ పర్సనల్ అధికారులు శ్రావణ్, హనుమంతరావు, సంక్షేమాధి కారులు ఇక్బాల్ షరీఫ్, రవీందర్, ఫిరోజ్ ఖాన్, క్వార్టర్ సెక్షన్ సిబ్బంది శ్రీనివాస్, అన్వేష్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

నేషనల్ గ్రీన్ హైవే రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-మంథని
మంథని మండలం కన్నాల గ్రామపంచాయతీ పరిధిలోని పందులపల్లి గ్రామంలో శుక్రవారం నేషనల్ గ్రీన్ హైవే రోడ్డు పనులు ప్రారంభమ య్యాయి. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు భూసేకరణ సుమారుగా పూర్తి కావడంతో మంథని తహసీల్దార్‌తో కలిసి సంబంధిత కాంట్రాక్టర్ జేసీబీతో పనులు ప్రారంభించారు. మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు భూనిర్వాసితులకు సుమారు రూ.20 లక్షలపైగా నష్టపరిహారం చెల్లించిన అధికారులు త్వరలోనే పూర్తిస్థాయిలోపనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ రోడ్డు పూర్తయితే భూపాలపల్లి జిల్లా మీదుగా వరంగల్,హనుమకొండ,ఖమ్మం, విజయవాడకు రవాణా సౌకర్యాలు మెరుగవుతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టతోపాటు కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ముసుకుల సురేందర్ రెడ్డి, ప్రముఖ సీనియర్ న్యాయవాది ముసుకుల సురేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

దీక్షా దివస్‌లో పాల్గొన్న కొప్పుల



నవతెలంగాణ పెద్దపల్లి టౌన్
పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, అనంతరం అమర వీరుల స్థూపం వద్ద అమరులను స్మరిస్తూ ఘన నివాళులు అర్పించి, దీక్షా దివస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, పుట్ట మధుకర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్, బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గింజ కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోళ్లు

మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్


కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న కొత్త శ్రీనివాస్

నవతెలంగాణ-మంథని
గింజ కటింగ్ లేకుండా వరి ధాన్యం కేంద్రాల్లో కొనుగోళ్లు జరుపుతున్నామని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పోతారం, ఖాన్ సాయిపేట్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ, రైతుల సౌకర్యార్థం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్విని యోగం చేసుకోవాలని కోరారు. 17శాతం తేమ కలిగిన ధాన్యాన్ని విక్ర యించి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో సంఘ డైరెక్టర్లు పెద్దిరాజు ప్రభాకర్,దాసరిలక్ష్మీ-మొండయ్య,ఉడుత మాధవి-పర్వతాల్ యాదవ్, నాయకులు ఎడ్ల సత్యనారాయణ, జాగిరి సదానందం, దాసరి గట్టయ్య, కారెంగుల తిరుపతి, మంథని లింగయ్య, కుడుదుల కోటయ్య, పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన సభా స్థలిని పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-పెద్దపల్లి
డిసెంబర్ 4న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే సభా ప్రాంగణం (పెద్ద కల్వల సబ్ స్టేషన్ సమీపంలో) వద్ద జరుగుతున్న ఏర్పాట్లను శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి సభా స్థలి వద్ద వాహనాల పార్కింగ్ చేసేందుకు ఎంపిక చేసిన స్థలం పరిశీలించి అక్కడ చేయాల్సిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు కట్టుదిట్టంగా భద్రత వ్యవస్థ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యమంత్రి పాల్గొనే సభలో గ్రూప్ 4, ఇతర వివిధ పోటీ పరీక్షలకు కింద ఎంపికైన 9 వేల మది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయడం జరుగుతుందని, ఈ సభలో రుణమాఫీ జరిగిన రైతులు, పెద్ద సంఖ్యలో మహిళలు, ప్రజలు పాల్గొనే అవకాశం ఉన్నందున అవసరమైన ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, తహసీల్దార్ రాజ్ కుమార్, అధికారులు,పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష


ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-పెద్దపల్లి
వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రిలోకి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి లోని ఆయుష్మాన్ భారత్ ఓపీ రిజిస్ట్రేషన్, కంటి శస్త్ర చికిత్సల థియేటర్, ల్యాబ్, జనరల్ వార్డు,ఆపరేషన్ థియేటర్, డెంటిస్ట్ విభాగం, ఫిజియో థెరపీ విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఆస్పత్రి ఎంట్రన్స్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఫిజియోథెరపీ క్రింద ప్రతి రోజు 15 రోగులకు చికిత్స అందిస్తున్నామని, ఈ సంఖ్య రెట్టింపు చేసే దిశగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీల్లో జిల్లా కలెక్టర్ వెంట ఆర్ఎంఓ రవీందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు పండుగ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

నవతెలంగాణ-పెద్దపల్లి
రాష్ట్ర ప్రభుత్వం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రైతు పండుగ మహాసభ కార్యక్రమాన్ని పెద్దపెల్లి జిల్లాలో ఉన్న 14 రైతు వేదికలలో ప్రత్యక్ష ప్రసారం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 30వ తేదీన శనివారం రైతుల పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తారని, ఈ కార్యక్రమం జిల్లాలో ఉన్న 14రైతు వేదికలలో ప్రత్యక్ష ప్రసారం జరుగుతుందని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో గుండారం, ముత్తారం, గుంజపడుగు, రత్నాపూర్, ఎలిగేడు, తెలుకుంట, రాఘవ పూర్, కాట్నపల్లి, శ్రీరాంపూర్, ఓదెల, బ్రాహ్మణపల్లి, ఎలకలపల్లి, మేడిపల్లి, బోట్ల వనపర్తి రైతు వేదికలలో ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ఉంటుందని అన్నారు. జిల్లాలోని రైతు సోదరులు అందరూ తమ గ్రామాలకు సమీపంలో ఉన్న రైతు వేదికలకు తరలివచ్చి సీఎం ప్రసంగాన్ని వీక్షించాలన్నారు.

ప్లేకార్డులతో ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండలంలోని దరియాపూర్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు 010 సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ప్లేకార్డులతో నిరసన చేపట్టారు. 010 పద్దులో వేతనాలు చెల్లించాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు కృష్ణవేణి, శ్రీనివాస్, శాంతి, చైతన్య, అశోక్, సునీత, రాజగోపాల్, నిర్మల ఉన్నారు.

రైతుల ఖాతాలో బోనస్ డబ్బులు జమ : వ్యవసాయ అధికారి


మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి జె.అనూష

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండలంలోని 209 మంది రైతుల ఖాతాల్లో సన్న వడ్లకు సంబంధించిన బోనస్ డబ్బులు జమ అయినట్లు మండల వ్యవసాయా ధికారి జె.అనూష తెలిపారు. శుక్రవారం రైతు వేదికలతో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ప్రభుత్వం హామీగా సన్న వడ్లు పండించిన రైతులకు క్వింటాల్‌కు 500 రూపాయల చొప్పున రైతుల్లో జమ చేయడం జరుగుతుందని, రైతులు వారి ఖాతాలను పరిశీలించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

కుంగిన కల్వర్టు

ఒరిగిన ధాన్యం లోడ్ వ్యాన్



నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామంలో బీసీ కాలనీకి వెళ్లే మార్గంలో ఉన్న కల్వర్టు కుంగిపోయింది. ధాన్యం లోడ్‌తో ఓవ్యాన్ అటుగా రావడంతో కల్వర్ట్ ఆబరువును మోయలేక ఒక్కసారిగా కుంగిపోయింది. దీంతో ధాన్యం లోడ్‌తో ఉన్న వ్యాన్ ఒక్కసారిగా ఓ వైపునకు ఒరిగింది. దీంతో వ్యాన్ డ్రైవర్ వాహనాన్ని అక్కడే నిలిపివేసి, స్థానికుల సహాయంతో జేసీబీ రప్పించి వ్యాన్‌ను కుంగిన ప్రదేశం నుంచి తీయించారు. నిత్యం ఈ మార్గం గుండా చాలా వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. రైతులు, గ్రామస్తులు ఈ మార్గం గుండా వెళ్తుంటారు. కుంగిపోయిన కల్వర్టుతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించిన మరమ్మత్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జాతీయ కళా రత్న అవార్డు అందుకున్న తుంగాని దిలీప్


అవార్డు అందుకుంటున్న తుంగాని దిలీప్

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండలం అడవీ శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన తుంగాని దిలీప్ జాతీయ కళారత్న అవార్డు అందుకున్నారు. అంజలి మీడియా గ్రూప్ 10వ వార్షికోత్సవాన్ని వరంగల్ జిల్లా నర్సంపేట గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవీ శ్రీరాంపూర్ గ్రామానికి చెందినన తుంగాని దిలీప్‌కు జాతీయ కళారత్న అవార్డునుఅందజేసి అభినందించారు. తుంగాని దిలీప్ ఈ అవార్డు అందుకోవడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను అభినందించారు.

శాంతి భద్రతలకు ప్రజల సహకారం అవసరం

ఎన్టీపీసీ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన టి.ఉదయ్ కిరణ్


టి.ఉదయ్ కిరణ్

నవతెలంగాణ-గోదావరిఖని:
శాంతి భద్రతలకు ప్రజల సహకారం అవసరమని ఎన్టీపీసీ ఎస్ఐ టి.ఉదయ్ కిరణ్ అన్నారు. ఎన్టీపీసీ నూతన ఎస్ఐగా టి.ఉదయ్ కిరణ్ శుక్రవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే సహించేది లేదని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ దందాలపై సమాచారం ఉన్న పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యం ఉంచుతామని అన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, తద్వారా వాటి బారిన పడకుండా ఉండవచ్చని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ, నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు.

రైతుల పండుగను విజయవంతం చేయండి

వ్యవసాయ అధికారిని అలివేణి



నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్
రైతుల పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసా య అధికారిని అలివేణి కోరారు. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రైతుల పండగ కార్యక్రమాన్ని పెద్దపల్లి మండలం రాఘవా పూర్ రైతు వేదికలో నవంబర్ 30న సాయంత్రం నాలుగు గంటలకి నిర్వహి స్తున్నా మన్నారు. అన్ని గ్రామాల రైతులు సన్నరకం వడ్లకి బోనస్ పొందేటటువంటి రైతులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారిని, వ్యవసాయ విస్తీర్ణాధికారులు కోరారు.

సమగ్ర శిక్షణ ఉద్యోగుల నిరసన



నవతెలంగాణ ఓదెల
ఓదెల మండల కేంద్రంలో శుక్రవారం భోజన విరామ సమ యంలో మండలం లోని సమగ్ర శిక్ష ఉద్యోగు లు కేజీబీవీ, ఎంఆర్‌సీ, సిబ్బంది, సీఆర్పీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్షణ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామన్న మాట నిలబెట్టుకోవాలని భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల ఓదెల మండలం ప్రెసిడెంట్ ఆది తిరుపతి,వైస్ ప్రెసిడెంట్ లెగిసెట్టి కుమార్ స్వామి, కేజీబీవీ ఎస్ఓ జ్యోతి, కేజీబీవీ సిబ్బంది ఉన్నారు.

రైతులకు డీలర్లు సరైన సూచనలు ఇవ్వాలి : కలెక్టర్ పమేలా సత్పతి

నవతెలంగాణ - కరీంనగర్



మాట్లాడుతున్న కలెక్టర్

విత్తనాలు, ఎరువుల కోసం వచ్చిన రైతుకు ఇన్‌పుట్ డీలర్లు సరైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్‌లోని కృషి భవనంలో ఇన్‌పుట్ డీలర్లకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై డిప్లమా కోర్సు శిక్షణ తరగతులను శుక్రవారం ప్రారంభించారు. 40 మంది డీలర్లకు సంవత్సరం పాటు వారానికి ఒకరోజు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో రైతు ఎంత ముఖ్యమో డీలర్లు అంతే ప్రధానమని అన్నారు. విడిగా విత్తనాల విక్రయం, గడువు తేదీ ముగిసిన ఎరువులు, విత్తనాలు, నకిలీ పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ భాగ్యలక్ష్మి, ఆత్మా పీడీ చత్రునాయక్, డీహెచ్ఓ శ్రీనివాస్, శాస్త్రవేత్తలు మధుకర్, మహేష్, రైతు శిక్షణా కేంద్రం అధికారి మమత, స్రవంతి పాల్గొన్నారు.

సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా

నేటినుంచి బాలల వైజ్ఞానిక సంబురం..

- జిల్లాస్థాయి బాలల వైజ్ఞానిక ప్రదర్శనకు సర్వం సిద్ధం..
- కొత్తపల్లిలో సెయింట్ జార్జ్‌లో మూడు రోజుల పాటు ఆవిష్కరణలు ప్రదర్శించనున్న విద్యార్థులు
- ప్రతిభ కనబరిస్తే రాష్ట్రస్థాయికి ఎంపిక
- హాజరు కానున్న మంత్రులు, ఎమెల్యేలు
- భవిష్యత్ శాస్త్రవేత్తలుగా మారేందుకు ఈ ప్రదర్శనలు ప్రేరణనిస్తాయి : కలెక్టర్ పమేలా సత్పతి



నవతెలంగాణ - కరీంనగర్

విజ్ఞానం, సృజనాత్మకత, పరిశోధనా తత్వం అనేవి నేటి విద్యార్థుల్లో మేల్కొలిపితే రేపటి ప్రపంచానికి శాస్త్రవేత్తలుగా అవతరిస్తారు. ఈ దిశగా విద్యార్థులకు ప్రేరణనిచ్చేందుకు, వారి ఆలోచనకలకు ప్రాక్టికల్ రూపాన్నిచ్చేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడుతుయి. విద్యార్థి దశలోనే వారి సృజనాత్మకతకు పదునుపెట్టేలా విజ్ఞానంపై అవగాహన కల్పిస్తూ కొత్త ఆవిష్కరణలు చేసేలా ప్రోత్సాహం అందిస్తున్నది. ఇందుకు కరీంనగర్ జిల్లాలోని కొత్తపల్లి మున్సిపాలిటీ కేంద్రంలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ (సీబీఎస్ఈ) సిద్ధమైంది. నేటి (శనివారం) నుంచి మూడు రోజుల పాటు జిల్లాస్థాయి బాలల వైజ్ఞానిక ప్రదర్శన జరుగనున్నది. జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనబర్చే ప్రయోగాలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నారు. కలెక్టర్ పమేలా సత్పతి, డీఈఓ సిహెచ్.జనార్దన్‌రావు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ భావి శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఈ ప్రదర్శనలు దోహదపడుతాయిని చెబుతున్నారు.

మూడు రోజుల పాటు ఆవిష్కరణల ప్రదర్శన

సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్(సీబీఎస్ఈ)లో కరీంనగర్ 52వ జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన-2024-2025తోపాటు జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్స్ ప్రదర్శన 2023-2024ను మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి వైజ్ఞానిక ప్రదర్శనకు గుగూల్ ఫారం ద్వారా వివిధ పాఠశాలల నుంచి 578పైగా విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇన్‌స్పైర్‌కు సంబంధించిన మరో 142 ఎంపిక చేయబడిన పాఠశాలల నుంచి విద్యార్థులు వారి ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు.

ఏడు ఉప అంశాలలో ప్రదర్శనలు..

ఏడు ఉప అంశాలలో పాటు నూతన ఆవిష్కరణలకు సంబంధించిన ఏవైనా ప్రయోగాలను ప్రదర్శించవచ్చు. ఏడు ఉప అంశాలలో ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, సహజ వ్యవసాయం, విపత్తుల నిర్వహణ, గణిత నమూనాలు, గణన ఆలోచనలు, వ్యర్థాల నిర్వహణ, వనరుల నిర్వహణతో పాటు నూతన ఆవిష్కరణలకు సంబంధించిన ఏవైనా ప్రయోగాలను ప్రదర్శించవచ్చు. ప్రతి ఉప అంశంలో జూనియర్ నుంచి ఏడు, సీనియర్ నుండి ఏడు రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నారు. ఇన్‌స్పైర్ అవార్డ్స్‌లో 13 రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. సైన్స్, గణితంతో పాటు ఈసారి ప్రత్యేకంగా సోషల్ సబ్జెక్ట్‌పై ఆవిష్కరణలు ఉండాలని విద్యాధికారలు సంబంధింత పాఠశాలలు సబ్జెక్ట్ టీచర్లుకు దిశానిర్దేశం చేశారు. ప్రదర్శనలో పాల్గొనే విదార్థులు ఉదయం 8 గంటల్లోపే సెయింట్ జార్జ్ స్కూల్‌కు చేరుకోవాలి. ముఖ్య అతిథులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లాలోని ఎమ్మెల్యేలు హాజరై వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించనున్నారు.

భవిష్యత్ శాస్త్రవేత్తలుగా మారేందుకు ఈ ప్రదర్శనలు ప్రేరణనిస్తాయి



కొత్తపల్లి మున్సిపాలిటీ కేంద్రంలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ నిర్వహించే వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థుల్లో పరిశోధనా తత్వాన్ని అభివృద్ధి చేస్తుంది. అలాగే భవిష్యత్ శాస్త్రవేత్తలుగా మారేందుకు ప్రేరణనిచ్చే అవకాశం ఉంది. విద్యార్థులు సైన్స్, సోషల్, మ్యాథ్స్‌ను ఇష్టపడి చదవి వాటిలో గొప్పగా ఆవిష్కరణలను ప్రదర్శించి గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలి. రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో రాణించేలా విద్యార్థులు ప్రదర్శనలు ఉంటాయని ఆశిస్తున్నాం.

- కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందుతుంది..



విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల మేధాశక్తి పెంపొందుతుంది. విద్యార్థులు తయారు చేసిన వైజ్ఞానిక ప్రాజెక్టులు, ఆవిష్కరణలు మూడు రోజుల పాటు సందర్శకులకు అందుబాటులో ఉంటాయి. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిస్తే రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. ప్రతి పాఠశాల విద్యార్థులు తప్పకుండా పాల్గొని జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకురావాలి. ఈ ప్రదర్శనలకు సహకరించిన సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ ఫాతిమారెడ్డికి విద్యాశాఖ తరుపన ధన్యవాదాలు. ఇలాంటి ప్రదర్శనలు ఏర్పాటుకు పలు పాఠశాలులు ముందుకు రావాలి.

- సిహెచ్.వి.ఎస్.జనార్ధన్‌రావు, జిల్లా విద్యాధికారి

సెయింట్ జార్జ్ వేదిక కావడం ఆనందంగా ఉంది



జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన 2024-2025, ఇన్‌స్పైర్ అవార్డ్స్ ప్రదర్శన 2023-2024కు మా సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ (సీబీఎస్ఈ) వేదిక కావడం ఆనందంగా ఉంది. విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్న మా విద్యాసంస్థ, విద్యార్థులకు ఉపయోగపడే ఏ కార్యక్రమానికైనా సహకారం అందించడంలో ముందుంటుంది. విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయడానికి ఈ వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతోగానో దోహదపడుతాయి.

- ఫాతిమారెడ్డి,
సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

ఎంఈఓ వి.పావని

నవతెలంగాణ - చిగురుమామిడి


మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని ఎంఈఓ వి.పావని సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వంటచేసే పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని, భోజనం వండేటప్పుడు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రబియా బస్రి, ఉపాధ్యాయులు, సిఆర్పి పాల్గొన్నారు.

కేర్‌టేకర్ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ - చిగురుమామిడి

మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాల బాలికల వసతి గృహంలో అవుట్ సోర్సింగ్ విధానంలో కేర్‌టేకర్‌గా పనిచేసేందుకు మండలంలోని మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ వి.పావని ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండలానికి చెందిన వారై ఉండాలని, డిగ్రీ, బీఈడీ లేదా డిఈడీ ఉత్తీర్ణత సాధించినవారు అర్హులని తెలిపారు. అలాగే 25 నుంచి 45 సంవత్సరంలోలోపు వయసు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 5 సంవత్సరాల మినహాయింపు ఉంటుందన్నారు. అర్హత గల అభ్యర్థులు ఆధార్ కార్డు జిరాక్స్, బయోడేటా ఫామ్, 7 తరగతి నుంచి 10 తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు అలాగే పదవ తరగతి, డిగ్రీ, బిఈడి లేదా డిఈడి మెమోల జిరాక్స్ సెట్ ను డిసెంబర్ 3వ తేదీ సాయంత్రం 5గంటల లోపు మండల వనరుల కేంద్రం(ఎంఆర్సి)లో సమర్పించాలని కోరారు. నెలకు వేతనం రూ.12,500 ఉంటుందని చెప్పారు.

విద్యార్థులకు పోటీలు



నవతెలంగాణ - హుజురాబాద్

హుజురాబాద్ మండలం సింగాపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పెయింటింగ్, డ్రాయింగ్‌లో తెలుగు భాషా పండితుడు కూర్మాచలం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు డ్రాయింగ్ టేబుల్ ప్యాడ్, డ్రాయింగ్ బుక్స్, పెన్సిల్స్ అందజేసారు. హుజురాబాద్ ఎంఈఓ భూపతి శ్రీనివాస్ మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో గాని డ్రాయింగ్ డాన్స్ లాంటి వాటి పట్ల ఆసక్తిని పెంచుకోవాలని అన్నారు.

శుక్రవారం సభ..

నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి పట్టణంలోని 9వ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సభ కార్యక్రమం నిర్వహించారు. పోషకాహార ప్రాముఖ్యత, రక్తహీనతపై అవగాహన కల్పించారు. ప్రాథమిక విద్య, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నార్మల్ డెలివరీ, ఆరోగ్య మహిళా ప్రోగ్రాం గురించి వివరించారు. పిల్లలకు కౌన్సిలర్ పెరుమండ్ల మానసగంగయ్య దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి, డాక్టర్ సమత, సిహెచ్ఓ వెంకటస్వామి, అంగన్వాడి టీచర్ కోమల మల్లేశ్వరి, ఏఎన్ఎం విజయ, వార్డ్ ఆఫీసర్ మధుసూదన్, ఆశా కార్యకర్తలు లావణ్య, ఉమా, ఆయా అంజమ్మ పాల్గొన్నారు.

స్త్రీ, శిశు సంక్షేమానికి శుక్రవారం సభ

- మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి
- ప్లాస్టిక్ నిషేధాన్ని ఈ సభ ద్వారా ప్రచారం చేయాలి
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ - చిగురుమామిడి


సీమంతం కార్యక్రమంలో మంత్రి పొన్నం, కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న శుక్రవారం సభ మహిళలు, పిల్లల సంక్షేమానికి ఎంతో దోహదపడుతోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. చిగురుమామిడి మండల కేంద్రంలో నూతన అంగన్వాడీ భవన నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేసిన మంత్రి గ్రామపంచాయతీ ఆవరణలో జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన శుక్రవారం సభ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్వాడీ పిల్లలకు యూనిఫాం పంపిణీ చేశారు. బాల్య వివాహ ముక్త భారత్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం గర్భిణులకు సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి మహిళా తన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని.. అప్పుడే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మహిళా సమస్యల పరిష్కారానికి ఈ సభ వేదికగా నిలుస్తుందని తెలిపారు. ప్లాస్టిక్ నియంత్రించాలని నినాదాన్ని కూడా శుక్రవారం సభ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో అధికారులందరి సమన్వయంతో గత ఆరు నెలలుగా ఈ శుక్రవారం సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా మహిళలకు సుమారు రూ.50వేలు ఖర్చయే 60రకాల పరీక్షలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఆర్డీవో మహేశ్వర్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.


శుక్రవారం సభలో చంటిపాపను లాలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి


అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న మంత్రి

పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ శుక్రవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. నవాబ్‌పేట గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన నూతన పంచాయతీరాజ్ భవనాన్ని, రూ.10లక్షలతో నిర్మించిన రజక భవనం, రూ.10 లక్షలతో నిర్మించిన యాదవ సంఘ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రానికి చేరుకొని చిగురుమామిడి-2కి రూ.12 లక్షలతో అంగన్‌వాడీ నూతన భవనానికి శంఖు స్థాపన చేశారు. ముదిమానిక్యం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు.

గౌడ సంఘం మండల అధ్యక్షునికి సన్మానం

నవతెలంగాణ - జమ్మికుంట



తెలంగాణ గౌడ సంఘం జమ్మికుంట మండల అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన పంజాల అజయ్‌గౌడ్‌ను శుక్రవారం జమ్మికుంట పట్టణంలో కాంగ్రెస్ నాయకులు దేశిని కోటి, బొంగోని వీరన్న, సుంకరి రమేష్ శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేసి సన్మానించారు. అజయ్ గౌడ్ గీత కార్మికుల సమస్యల పరిష్కారంలో ముందుండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం దీక్షిత్, ఇంగిలే రామారావు, సలీం, ముద్దమల్ల రవి, కిరణ్ గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



నవతెలంగాణ - వీణవంక : వీణవంక మండలం కోర్కల్‌గుట్ట వద్ద శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన హోమంలో 200మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హాకీ క్రీడకు పుట్టినిల్లు హుజురాబాద్

టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్



నవతెలంగాణ - హుజురాబాద్

పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో 68వ అండర్14 ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలను టౌన్ సిఐ తిరుమల్‌గౌడ్ క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హుజురాబాద్ హాకీకి పుట్టినిల్లు లాంటిదని, హుజురాబాద్ నుండి ఎంతోమంది రాష్ట్రస్థాయి జాతీయస్థాయి క్రీడాకారులను అందించిన ఘనత దక్కుతుందన్నారు.

'మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం'

నవతెలంగాణ - రామడుగు : రామడుగు మండలంలోని మోతె వాగుపై నిర్మించిన నూతన బ్రిడ్జిపై రాకపోకలను ఇటీవల చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భూ నిర్వాసిత రైతులను ఒప్పించి ప్రారంభించారు. నిర్వాసితులకు ఇచ్చిన మాట ప్రకారం పరిహారంగా ప్రభుత్వం నుండి వారికి రావలసిన రూ.కోటీ 54లక్షలా 73వేలా 341 మంజూరు చేయించి ఎమ్మెల్యే నిబద్ధతను చాటుకున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షులు జవ్వాజి హరీష్ ఒక ప్రకటన ద్వారా కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

నవతెలంగాణ - చొప్పదండి


విరాళాన్ని అందజేస్తున్న గుర్రం విజయలక్ష్మి-చంద్రారెడ్డి కుటుంబ సభ్యులు

చొప్పదండిలోని శ్రీ వెంకటేశ్వర మణికంఠ ఆలయ అన్నదాన ట్రస్ట్ ఏర్పాటుకు పట్టణానికి చెందిన గుర్రం విజయలక్ష్మిచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు 54,116 రూపాయల ను ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడిగె వెంకటేష్ గౌడ్, సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ మరింతమంది దాతలు ముందుకువచ్చి ఆలయ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు బొడిగె వెంకన్న, ఎన్నం మునీందర్, దండే సత్యానందం, పోరండ్ల భాస్కర్, కత్తి రమేష్, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, పిట్టల మల్లేశం, సభ్యులు పాల్గొన్నారు.

రుచి, శుభ్రతతో భోజనం అందించాలి..



నవతెలంగాణ - వీణవంక : వీణవంక ఎంఆర్‌సిలో ఎంఈఓ కె.శోభారాణి అధ్యక్షతన మండలంలోని ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, తదితర పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం నిర్వహణలో రుచి, శుభ్రత పాటిస్తూ మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సూచించారు. నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో చల్లూర్, వీణవంక స్కూల్ ప్రధానోపాధ్యాయులు సంపత్ కుమార్ చారి, పులి అశోక్‌రెడ్డి, సునీత పాల్గొన్నారు.

తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్.రామ్మోహన్



నవతెలంగాణ - వీణవంక : తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం కరీంనగర్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా వీణవంక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రంథపాలకుడు ఎన్.రమ్మోహన్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు ఈ నెల 28న కరీంనగర్ టీఎన్జీవో భవన్‌లో నిర్వహించారు. ఆయన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రాజిరెడ్డి, అధ్యాపకులు చిట్టి మల్ల భాస్కర్, ఎ.జైపాల్‌రెడ్డి, సిబ్బంది అభినందనలు తెలిపారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంఈఓ


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ

నవతెలంగాణ - చొప్పదండి : మండలంలోని ఆర్నకొండ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఎంఈఓ దీక్షితులు శ్రీనివాస్ మధ్యాహ్నం భోజన సమయంలో తనిఖీ చేశారు. విద్యార్థితో కలిసి మధ్యాహ్న భోజనాన్ని తింటూ పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కచ్చితంగా ఎండిఎం మెనూ పాటించాలన్నారు. వారానికి మూడుసార్లు కోడిగుడ్డు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. వంట గది శుభ్రంగా ఉంచి, వంటను రుచికరంగా వండాలని ఆదేశించారు.

మృత్యుంజయాలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ - తిమ్మాపూర్ : కార్తీక మాసంలో చివరి శుక్రవారం కావడంతో మండలంలోని ఎల్ఎండి కాలనీ శ్రీ మృత్యుంజయ మహా దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించడంతో భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది.

దీక్ష దివస్‌కు తరలివెళ్లిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ - వీణవంక : కరీంనగర్‌లోని అలుగునూర్ చౌరస్తాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరైన దీక్ష దివస్ కార్యక్రమానికి వీణవంక మండలం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుకతిరుపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వనమాల సాధవరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ మావురపు భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ లతాశ్రీనివాస్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట పట్టణంలోని 30 వార్డులు, మండలంలోని 20 గ్రామ పంచాయతీల నుండి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో శుక్రవారం అల్గునూరులో జరిగిన దీక్షా దివస్ కార్యక్రమానికి తరలి వెళ్లారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, సింగిల్‌విండో అధ్యక్షుడు పొన్నగంటి సంపత్, పార్టీ అర్బన్ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ - చొప్పదండి : మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో శుక్రవారం రైతులకు వరి కొయ్యలు కాల్చడం వలన కలిగే నష్టాలపై మండల వ్యవసాయ అధికారి వి.వంశీకృష్ణ అవగాహన కల్పించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం రైతు పండుగ కార్యక్రమాన్ని చొప్పదండి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని తెలిపారు. ఏఈఓ సాయిప్రసన్న పాల్గొన్నారు.

టిప్పర్ లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

నవతెలంగాణ - గన్నేరువరం : మండలంలోని గునుకులకొండాపూర్ గ్రామ సమీపంలోని రహదారిపై శుక్రవారం టిప్పర్ లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ చోటా సాకేత్‌కు గాయాలయ్యాయి. గునుకుల కొండాపూర్ నుండి జంగాపల్లి డబుల్‌రోడ్డు నిర్మాణంలో భాగంగా కాంక్రీట్‌లోడుతో ఉన్న టిప్పర్ జంగాపల్లి వైపు వెళ్తుండగా ప్రమాదానికి గురైంది. రైతు పొలంలో కంకర పడటంతో రైతు ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల నాణ్యత లేని రోడ్డు వేయడంతో వాహనాలు ప్రమాదానిక గురవుతున్నారని వాపోతున్నారు.



కేసీఆర్‌ది దొంగదీక్ష

- ప్రజల ఆకాంక్షను గౌరవించి సోనియానే

తెలంగాణ ఇచ్చారు : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నవతెలంగాణ-ధర్పల్లి

'కేసీఆర్ వల్లనే తెలంగాణ వచ్చిందని బీఆర్ఎస్ నాయకులు అబద్ధాలు చెబుతున్నారు. కానీ కేసీఆర్ చేపట్టింది దొంగ దీక్ష. ఆ దీక్ష వల్ల తెలంగాణ రాలే.. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకున్న సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారు" అని రోడ్లు భవనాల శాఖ మంత్రి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆయన నిజామాబాద్ జిల్లాలో శుక్రవారం పర్యటించారు. డిచ్‌పల్లి, ధర్పల్లిలో రోడ్ల విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. అంతకుముందు ధర్పల్లిలో నిర్వహించిన సభలో ప్రసంగించారు. తెలంగాణ కోసం కోట్లాది మంది ప్రజలు ఉద్యమించారని, వేల మంది యువకులు బలిదానాలు చేసుకున్నట్టు తెలిపారు. శ్రీకాంతాచారి, కానిస్టేబుల్ కిష్టయ్య ఇలా ఎందరో ప్రాణ త్యాగాలతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు తమ పదువులను తృణప్రాయంగా వదిలి సోనియాకు తెలంగాణ ఆకాంక్షపై వివరించామని, దీంతోనే సోనియమ్మ చలించి తెలంగాణ ఇచ్చారని తెలిపారు. అలాంటి కాంగ్రెస్ పార్టీని నేడు బావ, బామ్మర్దులు పిచ్చి కుక్కల్లా ప్రతిరోజూ తిట్ల పురాణం మొదలు పెట్టారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు.

చివరి గింజ వరకు ధాన్యాన్ని కొంటాం :

వ్యవసాయ కమిషన్ సభ్యులు కేబీఎన్ రెడ్డి

- రైతులు మోసపోకుండా చర్యలు తీసుకుంటాం



నవతెలంగాణ-వంగూరు

రైతులు పండించిన వరి ధాన్యాన్ని చివరి వరకు పూర్తిగా మద్దతు ధరతో కొంటామని వ్యవసాయ కమిషన్ సభ్యులు కేబీఎన్ రెడ్డి అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో సింగిల్ విండో సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు దళారుల చేతిలో మోసపోకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఏ-గ్రేడ్ రూ.2,320 మద్దతు ధరతోపాటు సన్నాలకు రూ.500 బోనస్ అందిస్తూ కొనుగోలు చేస్తోందన్నారు. అందువల్ల రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే అమ్ముకునేందుకు ముందుకు రావాలని సూచించారు. ఐకేపీ ఆధ్వర్యంలో మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా ఎక్కడికక్కడ కొనుగోళ్లు చేస్తామన్నారు. రైతులకు రుణమాఫీ చేయడంతోపాటు రైతు భరోసా కూడా త్వరలోనే అమలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మెన్ సురేంద్రరెడ్డి, వేమారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికారులు సాయిబాబు, రాఘవేందర్, సీఈవో విష్ణుమూర్తి, గిరి, సురేష్, అశోక్, రైతులు పాల్గొన్నారు.

మాడిపోయిన అన్నం పెడితే ఎట్లా తింటారు..?

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

- మెస్ చార్జీలు పెంచినా భోజనం నాణ్యత లేకపోవడంపై ఆగ్రహం
- గురుకుల హాస్టల్ ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-మునుగోడు

మాడిపోయిన అన్నం పెడితే విద్యార్థులు ఎలా తింటారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మెస్ చార్జీలు పెంచినప్పటికీ నాణ్యతలేని కూరలు, సాంబారు ఎందుకు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. భోజన సమయంలో అన్నం, కూరలను పరిశీలించి అన్నం మాడిపోవడంతో వంట ఏజెన్సీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలు, పెరుగు ఎక్కడి నుంచి వస్తున్నాయని, పెరుగు ఇంత పుల్లగా ఎలా ఉంటుందని అధికారులను ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచిందని, పెంచిన తర్వాత కూడా భోజనం నాసిరకంగా ఉంటే ఊరుకోమని హెచ్చరించారు. హాస్టల్లో స్వయంగా విద్యార్థినులకు అన్నం, కూరలు వడ్డించి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని అడిగారు. మరోమారు హాస్టల్‌కి వస్తానని, భోజనం నాణ్యతతో లేకపోతే ఊరుకోబోమని హెచ్చరించారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మెన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, చండూర్ ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో విజయ్ భాస్కర్, పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి, రాష్ట్ర నాయకులు వట్టికోటి శేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు భీమనపల్లి సైదులు, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పాల్వాయి చెన్నారెడ్డి, జిట్టగోని యాదయ్య, పాల్వ జితేందర్ రెడ్డి, మేకల ప్రమోద్ రెడ్డి, ఎండి అన్వర్, నాయకులు ఆరేళ్ల సైదులు, మార్నేని గ్రాగోరి, సాగర్, జంగిలి నాగరాజు, జిట్టగోని సైదులు, పాపయ్య, దుబ్బ ప్రభాకర్ ఉన్నారు.

పేదలకు కష్టమొస్తే అండగా నిలిచేది కమ్యూనిస్టులే..

దేశంలో, రాష్ట్రంలో పెరుగుతున్న వామపక్షాల ప్రాధాన్యత

- ఓట్ల కోసం మతరాజకీయాలతో ఎంతకైనా తెగిస్తున్న బీజేపీ
- రాష్ట్రంలో ఫ్రీ బస్సు తప్ప ఏమీ అమలు కాలే..
- కమ్యూనిస్టుల ఉద్యమ ప్రారంభంతోనే లగచర్ల భూసేకరణ రద్దు..
- సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా పదో మహాసభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'ఎక్కడ పేదలకు కష్టమొచ్చినా.. ఎక్కడ పీడితవర్గాలకు ఆపదొచ్చినా.. వారికి అండగా మొదట నిలిచేది కమ్యూనిస్టులే. ప్రజల మధ్య వైషమ్యాలు రగుల్చుతూ ఓట్ల కోసం మత రాజకీయాలు చేస్తున్న బీజేపీ ఆగడాలను ప్రశ్నిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తుందీ ఎర్రజెండాలే. ప్రజాస్వామ్యంగా ఉంటామని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలను అడ్డుకుంటుందీ వామపక్షాలే. పేదల సంక్షేమం, వారి హక్కుల రక్షణ కోసం నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ ఉద్యమించేది ఎర్రజెండా పార్టీలే. అందులోనూ ముందు వరుసలో సీపీఐ(ఎం) ఉంటుంది' అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి వివరించారు. సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా పదో మహాసభ కరీంనగర్ పట్టణంలో శుక్రవారం ప్రారంభమైంది. రెండ్రోజులపాటు సాగే ఈ మహాసభలో తొలి రోజు ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ముకుందలాల్ మిశ్రాభవన్ (కామ్రేడ్ సీతారాం ఏచూరినగర్) వరకు భారీ ప్రజాప్రదర్శన జరిగింది. అనంతరం కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య వేదికగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగసభలో టి.జ్యోతి ప్రసంగించారు.

కష్టజీవులు, శ్రామికుల పని ప్రదేశాల్లో ఎక్కడా మత విశ్వాసాలు ఉండవని, అందరూ కలిసే పని చేసుకుంటారని జ్యోతి తెలిపారు. అలాంటి పేదల్లో కూడా విద్వేషాలు రెచ్చగొట్టేలా కేంద్రంలోని బీజేపీ వ్యవహరిస్తోందన్నారు. ఇందుకు ఉత్తర భారతదేశంలోని 'గంగాజల కావడియాత్ర'నే అద్దం పడుతోందన్నారు. దేశ సమగ్రత అనే అంశాన్ని జోడించి ఉపా చట్టం కింద రాజద్రోహం కేసులు పెడుతూ తమను ప్రశ్నించిన న్యూస్‌క్లిక్ ఎడిటర్‌ను, పౌరహక్కుల ఉద్యమ నేత ప్రొఫెసర్ సాయిబాబాను జైల్లో పెట్టిందని గుర్తు చేశారు. అయితే, గుజరాత్ అల్లర్లలో బిల్కిస్‌భాను కేసులో హత్య, లైంగికదాడిన చేసి జైల్లో ఉన్న దోషులకు క్షమాభిక్ష పేరుతో బయటకు తీసుకొచ్చి ఊరేగించారని అన్నారు.



ఒలంపిక్స్‌లో బంగారు పతకాలు తీసుకొచ్చిన మహిళా రెజ్లర్లు తమపై లైంగిక దాడికి పాల్పడుతున్న బీజేపీ నేతను శిక్షించాలని వీరోచితంగా పోరాడితే చివరకు ఆ నేతకే వత్తాసుపలికిన తీరు అందరికీ తెలిసిందేనన్నారు. రాజ్యాంగ, లౌకిక హక్కులపైనా, రాష్ట్రాల అధికారాలపైనా కేంద్రం దాడులు చేస్తోందన్నారు. ఇలా ఎన్నో ఘటనల్లో దోషుల పక్షాన నిలబడుతూ ప్రశ్నించే గొంతులను అణచివేస్తున్న తీరు బీజేపీ రాక్షస పాలనకు అద్దం పడుతోందని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో వామపక్షాల ప్రాధాన్యత ఎంతగానో పెరిగిందని, కమ్యూనిస్టు ఉద్యమం బలపడితేనే బీజేపీలాంటి రాక్షస పార్టీకి చరమగీతం పాడగలుగుతామని అన్నారు.

మహాసభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు జె.వెంకటేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వర్ణ వెంకట్‌రెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, జి.భీమాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు యు.శ్రీనివాస్, ఎస్.సంపత్, ఎడ్ల రమేష్, వెల్మారెడ్డి రాజిరెడ్డి, జి.రాజేశం, నరేష్ పటేల్, మక్కపల్లి పూజ, శీలం అశోక్, సీనియర్ న్యాయవాది సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల్లో ఫ్రీ బస్సు ఒక్కటే అమలు

రాష్ట్రంలో గత ప్రభుత్వ నిరంకుశ పాలనను కాదనుకుని, ప్రజాస్వామ్య పాలన అందిస్తారని ఆశించి ఆరు గ్యారంటీలు ఇచ్చిన కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం గట్టారని జ్యోతి అన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది అయినా మహిళలకు ఫ్రీ బస్సు ఒక్కటే అమలు చేస్తోందని, రూ.500కే సిలిండర్, 200యూనిట్లలోపు ఫ్రీ కరెంటు, రూ.2లక్షల్లోపు రైతు రుణాల మాఫీ పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. ఫార్మాసిటీ పేరుతో లగచర్లలో గిరిజన బిడ్డలపై లాఠీ ఝులిపించి అక్కడ నిర్బంధకాండను ప్రయోగించిందన్నారు. అక్కడి ప్రజానీకానికి తాము ఉన్నామంటూ మొదటగా వెళ్లింది కమ్యూనిస్టులేనన్నారు. కమ్యూనిస్టుల రాకను అడ్డుకునేందుకు రాష్ట్ర సర్కారు శతవిధాలా ప్రయత్నించిందన్నారు. అయినా ఆ భూసేకరణను ఆపితేగానీ ఉద్యమం ఆపబోమంటూ తేల్చిచెప్పడంతో ప్రభుత్వం ఫార్మాసిటీ భూముల సేకరణను రద్దు చేసుకుందని తెలిపారు. ఈ ఘటనే కమ్యూనిస్టుల బలానికి అద్దం పడుతోందన్నారు.

గుజరాత్ గులాములు.. ఢిల్లీ కీలుబొమ్మలు

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ ఆనవాళ్లే లేకుండా చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని వాపోయారు. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యలపై ప్రతిఘటనకు పూనుకోవటం ద్వారా రేవంత్ సర్కార్ చర్యలను ఎక్కడికక్కడ ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దీక్ష చేపట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం 'దీక్షా దివస్' పేరిట రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సంబురాలు నిర్వహించారు. అంతకుముందు బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో కేటీఆర్... తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులనుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ... కాంగ్రెస్ పార్టీపైనా, రేవంత్ సర్కార్‌పైనా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తూర్పారబట్టారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాలకు సంబంధించిన వివిధ ఘట్టాలను ప్రస్తావిస్తూ భావోద్వేగంతో ప్రసంగించారు. లగచర్లలో భూ సేకరణను ప్రభుత్వం నిలిపేయటం బీఆర్ఎస్ విజయంగా ఆయన అభివర్ణించారు.

తెలంగాణ కోసం ఆనాడైనా, ఏనాడైనా కొట్లాడేది తమ పార్టీయేనని అన్నారు. రాష్ట్రం నుంచి కాంగ్రెస్ తరపున ఎనిమిది మంది, బీజేపీ తరపున మరో ఎనిమిది మంది ఎంపీలున్నా... తెలంగాణ కోసం పార్లమెంటులో ఏనాడూ కొట్లాడలేదని విమర్శించారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు అదానీ, ప్రధాని... ఇక్కడ అడుగు పెట్టే సాహసం చేయలేకపోయారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు తెలంగాణ మీద పట్టుకోసం ఆ రెండు పార్టీలు రాబందుల్లా వస్తున్నాయని హెచ్చరించారు. అంతేతప్ప రాష్ట్ర ప్రయోజనాల కోసం పట్టుబట్టే వాళ్లే లేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మామూలుగా తీసుకోకూడదని అన్నారు. రాష్ట్రంలోని కవులు, కళాకారులు, మేధావులంతా తెలంగాణపై జరుగుతున్న దాడిని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్ తరాల వారిలోనూ ఆత్మగౌరవ స్ఫూర్తిని రగిలించాలని పిలుపునిచ్చారు.

లగచర్ల భూ సేకరణకు సంబంధించి ప్రభుత్వం వెనక్కి పోవటమనేది బీఆర్ఎస్ విజయంగా కేటీఆర్ అభివర్ణించారు. అక్కడ బ్రిటీషర్ల కంటే ఎక్కువగా రేవంత్ సర్కార్ వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల పట్ల పోలీసులు బందిపోట్లలాగా వ్యవహరించారని వ్యాఖ్యానించారు. అయినా ప్రజలు, బీఆర్ఎస్ పోరాట పటిమ ముందు ప్రభుత్వం తలవంచక తప్పలేదని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన రేవంత్‌ను తక్కువగా అంచనా వేయొద్దనీ, మరో రూపంలో భూములు లాక్కొనేందుకు వస్తారని హెచ్చరించారు. అందువల్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

కాకతీయలో హాస్టల్ విద్యార్థి మృతి

అనారోగ్యానికి గురికాగా.. టాబ్లెట్స్ ఇచ్చిన వార్డెన్

- ఒకటో అంతస్తులో కుప్పకూలిన విద్యార్థి
- యాజమాన్యం తీరుపై తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఆగ్రహం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని కాకతీయ విద్యాసంస్థల హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్న 9వ తరగతి విద్యార్థి శివజాస్విత్‌రెడ్డి మృతిచెందాడు. అనారోగ్యానికి గురికావడంతో సిబ్బంది టాబ్లెట్స్ ఇచ్చి సరిపెట్టగా.. శుక్రవారం స్కూల్ 3వ అంతస్తు నుంచి కిందకు నడుచుకుంటూ వస్తుండగా ఒకటో అంతస్తులో కుప్పకూలాడు. వెంటనే పక్కనే ఉన్న ప్రతిభ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే తమ కొడుకు మృతిచెందాడని కుటుంబీకులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన శివ జాస్విత్‌రెడ్డి నిజామాబాద్ నగరంలో కాకతీయ స్కూల్లో హాస్టల్‌లో ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. అనారోగ్యంతో వాంతులు కాగా, బాలునికి వార్డెన్ టాబ్లెట్ ఇచ్చారు. గురువారం రాత్రి 7 గంటల సమయంలో కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో ఉదయం వస్తామని తెలిపారు. శుక్రవారం ఉదయం తల్లిదండ్రులు రావడంతో.. మూడో ఫ్లోర్‌లో ఉన్న శివ జాస్విత్ నడుచుకుంటూ వస్తుండగా.. ఒకటో ఫ్లోర్‌కు రాగానే కుప్పకూలాడు. వెంటనే తండ్రి బాలున్ని ఎత్తుకొని పక్కనే ఉన్న ప్రతిభ ఆస్పత్రిలో చేర్పించారు. కాగా బాలుడు మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.



కుటుంబీకుల, బంధువుల ఆందోళన

పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే బాలుడు మృతిచెందాడని కుటుంబీకులు, బంధువులు ఆందోళన చేపట్టారు. యాజమాన్యం రాకుండా వార్డెన్‌ను పంపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలుడు వాంతులు చేసుకుంటే ఆస్పత్రికి తీసుకెళ్లకుండా టాబ్లెట్లు మాత్రమే ఇచ్చానని, ఆ తర్వాత ఏమైందో తమకు తెలియదని వార్డెన్ చెప్పినట్టు తెలిపారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థి చనిపోతే కనీసం చూసేందుకు కూడా యాజమాన్యం రాలేదన్నారు. కాగా, ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా 4వ టౌన్ ఎస్ఐ శ్రీకాంత్, నగర సీఐ శ్రీనివాస్ రాజ్ ఘటనా స్థలానికి చేరుకొని బందోబస్తు నిర్వహించారు. శివ జాస్విత్ రెడ్డి మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని, పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నగర సీఐ శ్రీనివాస్ రాజ్, ఎస్ఐ శ్రీకాంత్‌కు ఫిర్యాదు అందించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

కాకతీయ విద్యాసంస్థల నిర్లక్ష్యం :ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విగ్నేష్

కాకతీయ విద్యాసంస్థల నిర్లక్ష్యానికి ఓ విద్యార్థి బలయ్యాడని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విగ్నేష్ అన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఆస్పత్రికి చేరుకొని కుటుంబీకులతో మాట్లాడారు. స్కూల్‌కు కూత వేటులో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఉన్నా కాకతీయ యాజమాన్యం సమయానికి స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి విద్యార్థి మృతికి కారణమైందని విగ్నేష్ అన్నారు. యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

వామపక్షాల పోరాట ఫలితమే...

- తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో ఫార్మాసిటీ కోసం ఆగస్టు ఒకటిన జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయడం పట్ల సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. మొత్తం 580 మంది రైతులకు చెందిన 632 ఎకరాల భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయడానికి వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగిన పోరాట ఫలితం, కృషి కారణమని తెలిపింది. ఇది లగచర్ల ప్రాంత ప్రజల విజయమని పేర్కొంది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భూసేకరణ ప్రజాభిప్రాయం సందర్భంగా లగచర్ల వెళ్లిన అధికారులు, రైతుల మధ్య జరిగిన తోపులాట, ఘర్షణ ఫలితంగా ప్రభుత్వం ఆ ప్రాంతంలో నిర్బంధం విధించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 21న 10 వామపక్ష పార్టీల రాష్ట్ర బృందం లగచర్ల, సమీప గ్రామాలను సందర్శించి, ప్రజలను ప్రత్యక్షంగా అనేక విషయాలను అడిగి తెలుసుకుందని పేర్కొన్నారు. ఈనెల 23న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అక్కడ పరిస్థితులను వివరిస్తూ వినతి పత్రం సమర్పించామని వివరించారు. ముఖ్యమంత్రి స్పందించి తక్షణమే ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారని తెలిపారు. ప్రస్తుతం నోటిఫికేషన్‌ను రద్దు చేసినట్టుగానే ఇతర సమస్యలు కూడా పరిష్కరించాలని గతంలోనే విజ్ఞప్తి చేశామని పేర్కొన్నారు. రైతులపై పెట్టిన కేసులను రద్దు చేయాలనీ, పోలీస్ క్యాంపులను ఎత్తేయాలనీ, వరికోత యంత్రాలకు అనుమతులు ఇవ్వాలని కోరారు. వ్యవసాయానికి ఉపయోగ పడే భూముల్లో పరిశ్రమల నిర్మాణాన్ని విరమించుకోవాలనే డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఇతర డిమాండ్లను కూడా తక్షణమే పరిష్కరిం చాలని విజ్ఞప్తి చేశారు.

పెద్దపులి దాడిలో మహిళ మృతి



- కాగజ్‌నగర్ డివిజన్‌లో నాలుగేండ్లలో ముగ్గురిని చంపిన పులులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలో శుక్రవారం పెద్దపులి దాడిలో ఓ మహిళ మృతిచెందింది. పత్తి ఏరేందుకు చేనుకు వెళ్లిన ఆమెపై పెద్దపులి వెనుక నుంచి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణం కోల్పోయింది. వివరాలిలా ఉన్నాయి. కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మోర్లె లక్ష్మి(22), ఇతర కూలీలతో కలిసి ఈజ్‌గాం బెంగాలీ క్యాంప్ నెంబర్-6 నుంచి 11కు వెళ్లే దారిలో పత్తి ఏరేందుకు వెళ్లింది. పత్తి ఏరుతుండగా.. చేనులో అప్పటికే మాటు వేసి ఉన్న పెద్దపులి ఒక్కసారిగా లక్ష్మిపై దాడి చేసింది. మెడ భాగంలో పంజాతో దాడి చేయగా కేకలు వేసింది. ఈ కేకలు విన్న తోటి కూలీలు పెద్దపులిని చూసి భయపడి పరుగులు తీశారు. కొద్దిసేపటికి గ్రామస్తులు, పక్క చేల వారు రావడంతో అందరూ కలిసి చేనులోకి వెళ్లి చూడగా అప్పటికే లక్ష్మి తీవ్ర గాయాలతో ఉంది. వెంటనే కాగజ్‌నగర్‌లోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్తులు కాగజ్‌నగర్ అటవీ డివిజన్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. వీరికి సీపీఐ(ఎం), కాంగ్రెస్, బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు, అటవీ అధికారి నీరజ్ టోబ్రివాల్ వచ్చి బాధిత కుటుంబానికి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో అటవీ డివిజన్ కార్యాలయం ముందు భారీ బందోబస్తు చేపట్టారు.

ఇప్పటి వరకు ముగ్గురు మృతి

2020 నుంచి ఇప్పటి వరకు కాగజ్‌నగర్ డివిజన్‌లో పులుల బారిన పడి ముగ్గురు మృతిచెందారు. నాలుగేండ్ల కిందట ఇదే రోజున పెంచికల్‌పేట మండలం కొండపల్లి గ్రామానికి చెందిన పసుల నిర్మల పులి దాడిలో మృతిచెందింది. దీనికి ముందు అదే ఏడాది నవంబర్ 11వ తేదీన దహెగాం మండలం దిగిడ గ్రామానికి చెందిన విఘ్నేష్ పులి బారిన పడి ప్రాణం కోల్పోయాడు. ప్రస్తుతం లక్ష్మి మృతితో కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో పులుల బారిన పడి ప్రాణం కోల్పోయిన వారి సంఖ్య మూడుకు చేరుకుంది.

సాగర్ డ్యాంపై ఆక్టోపస్ బలగాల మాక్ డ్రిల్

నవతెలంగాణ-నాగార్జునసాగర్

నాగార్జునసాగర్ ప్రధాన డ్యాంపై శుక్రవారం ఆక్టోపస్ బలగాలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. అత్యవసర పరిస్థితుల్లో, ఉగ్రవాదులు ప్రాజెక్టులపై దాడులను నిర్వహిస్తే ఎలా ఎదుర్కోవాలని అంశంపై ప్రధాన ప్రాజెక్టుల వద్ద, దేవాలయాలు, అత్యంత సున్నితమైన ప్రదేశాల వద్ద ఆక్టోపస్ దళాలు మాక్ డ్రిల్ నిర్వహిస్తుంటాయి. ఈ సందర్భంగా సాగర్ ప్రధాన డ్యాంపై, డ్యామ్ గ్యాలరీస్ వద్ద, ప్రధాన డ్యామ్‌కు ఇరువైపులా, 420 గ్యాలరీ వద్ద, ప్రధాన జల విద్యుత్ కేంద్రం పరిసరాలలో ఆక్టోపస్ దళాలు పలు విధాలుగా మాక్ డ్రిల్ నిర్వహించాయి. ఈ మాక్ డ్రిల్‌లో స్థానిక పోలీసులు, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ భద్రత దళాలు పాల్గొన్నాయి.

టర్కీ - తెలంగాణ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు

- మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టర్కీ - తెలంగాణ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆకాంక్షించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఇండియాలోని టర్కీ రాయబారి ఫిరాట్ మంత్రితో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ఎంతో ప్రాధాన్యతనిస్తున్నదని తెలిపారు. 34 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, 28 నర్సింగ్ కళాశాలలు, పారామెడికల్ కాలేజీలు వైద్యవిద్యనందిస్తున్నాయని చెప్పారు. పారామెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 74 ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో వరి దిగుబడి

66.7 లక్షల ఎకరాల్లో సాగు

నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు : నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

నవ తెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

దేశంలో ఎన్నడూ ఏ రాష్ట్రంలో పండని విధంగా ఈ వానాకాలంలో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి వచ్చిందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. 66.7లక్షల ఎకరాల్లో 153 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండిందని, ఇది జీవిత కాల రికార్డు అని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఏర్పాటు చేసిన మూడ్రోజుల "రైతు పండుగ"లో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. స్టాళ్లను పరిశీలించారు. అనంతరం అవగాహన సదస్సులో మంత్రి మాట్లాడుతూ.. దేశంలోనే అత్యధికంగా వరిసాగు చేసి రాష్ట్రం మొదటి స్థానం సాధించిందన్నారు. రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం ధాన్యం కొంటుందని తెలిపారు. రైతు పండుగ ఏర్పాట్లు, స్టాళ్లు చాలా అద్భుతంగా ఉన్నాయని, ఇందుకు కారణం వ్యవసాయ శాఖ మంత్రి అనుభవం, వారి దక్షత అని కొనియాడారు. రాష్ట్ర పరిస్థితులు ఎలా ఉన్నా ప్రభుత్వం పూర్తిగా రైతు పక్షపాతి, వ్యవసాయ పక్షపాతిగా ముందుకెళ్తుందని చెప్పారు. నూతన సాంకేతిక పద్ధతులు, పరిజ్ఞానంతో సాగును ముందుకు తీసుకెళ్తామన్నారు. గత పాలకులు రుణమాఫీ చేస్తామని చెప్పి మొదటి ఐదు సంవత్సరాల్లో వడ్డీ మాత్రమే మాఫీ చేశారని, తర్వాత అరకొర రుణమాఫీ చేసి చేతులెత్తేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం 18 వేల కోట్లతో 21 లక్షల మంది రైతుల రుణమాఫీ చేసిందని, మిగిలిన కొంత మంది రైతుల రుణమాఫీపై సీఎం ఒక ప్రకటన చేస్తారని తెలిపారు.

రైతులకు అండగా ఉండేందుకే ఈ సదస్సు

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఏది మంచిదో రైతులే చెప్పాలని, మీ సలహాలు సూచనలు వినడానికే ఈ రైతు సదస్సును ఏర్పాటు చేసినట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతుల అభిప్రాయం మేరకు వారికి మేలు చేసే పథకాలనే కొనసాగిస్తామన్నారు. రైతులు పామాయిల్ సాగు చేయాలని, నాలుగేండ్లు ప్రభుత్వమే పెట్టుబడి భరిస్తుందని చెప్పారు. ఈ నాలుగు సంవత్సరాలు అంతర పంటలు సాగు చేసి అత్యధిక లాభాలు పొందొచ్చని సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు పామాయిల్ మిల్లులు ఏర్పాటు చేస్తామని, పామాయిల్ పంటను రైతు ఇంటి



వద్దనే కొంటామని అన్నారు. వలస జిల్లాగా పేరు పడిన మహబూబ్‌నగర్ జిల్లాకు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు చాలా ముఖ్యమైనదని, దీనికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి త్వరగా పూర్తి చేయించాలని నీటిపారుదల శాఖ మంత్రిని కోరారు. ఎండాకాలం పంట కోతలు మార్చి లోపలే ప్రారంభిస్తేనే నూకలు తక్కువ అవుతాయని, లేకుంటే బియ్యంలో నూకల శాతం అధికంగా ఉంటుందని అన్నారు. అందువల్ల ఎండాకాలం పంటకు నీరు ఎప్పుడు విడుదల చేస్తారో త్వరగా నిర్ణయం తీసుకోవాలని మంత్రిని కోరారు.

ఈ కార్యక్రమంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జి.చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు జి.మధుసుధన్ రెడ్డి, యెన్నం శ్రీనివాసరెడ్డి, అనిరుధ్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, తూడి మేఘారెడ్డి, వాకిటి శ్రీహరి, డా.వంశీకృష్ణ, పర్ణిక రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, రాష్ట్ర రైతు సంఘాల అధ్యక్షులు కోదండరెడ్డి, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, కమిషనర్ గోపి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్. చౌహాన్, జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.



ఆమె ఓపిక నశిస్తే..?

భర్తకు భార్యా, భార్యకు భర్త... చివరి వరకు ఈ బంధమే తోడుండేది. అయితే చాలా మంది భర్తలు తమ భార్యలను చులకనగా చూస్తారు. ఆమె పక్కన ఉన్నప్పుడు నన్ను వదిలి ఎక్కడకు పోతుందిలే అనే భావనతో ఉంటారు. అదే ఆమె ఒక్కసారి వదిలి వెళ్లిపోతే అప్పుడు ఆమె విలువేంటో తెలుస్తుంది. సాధారణంగా మగవారు భార్య తప్ప ప్రపంచం మొత్తం మనదే అనుకుంటారు. కానీ మహిళలు భర్తే తమ ప్రపంచంగా బతుకుతారు. ఇది భర్తలకు అర్థం కాదు. 'ఆమె నన్ను ఏమీ చేయలేదు, ఏమన్నా అలా పడుంటుంది' అనే ఆలోచనే ఉంటుంది. అందుకే ఆమంటే అంత చులకన. ఇలాంటి భర్తను ఆమె మాత్రం ఎన్ని రోజులని భరిస్తుంది. ఓపిక నశిస్తే ఏం చేస్తుందో తెలియజేసే కథనమే ఈ వారం ఐద్వా అదాలత్...

రాధికకు సుమారు 32 ఏండ్లు ఉంటాయి. 18 ఏండ్ల కిందట సందీప్‌తో పెండ్లి జరిగింది. వీరికి ఇద్దరమ్మాయిలు, ఒక అబ్బాయి. రాధిక వాళ్ల పెద్దమ్మకు ముగ్గురు మగపిల్లలు. ఆడపిల్లలు లేకపోవడంతో రాధికను దత్తత తీసుకుంది. అప్పటి నుండి వాళ్ల దగ్గరే పెరిగింది. పెండ్లి కూడా వాళ్లే చేశారు. అయితే ఆమెను పెద్దగా చదివించలేదు. సమాజం అంటే ఏమిటో తెలియకుండా, ఆ ఇల్లే ప్రపంచంగా పెరిగింది.

పెండ్లి చేసినప్పుడు 20 తులాల బంగారం, ఐదు లక్షల కట్నం, కిలో వెండి ఇచ్చి ఘనంగా పెండ్లి చేశారు. సందీప్ బీఎడ్ చేసి టీచర్‌గా ఉద్యోగం కోసం చాలా ప్రయత్నించాడు. కానీ రాలేదు. అతనికి ఓ తమ్ముడు, ఇద్దరు అక్కలున్నారు. సందీప్‌కి ఉద్యోగం రాకపోవడంతో రాధిక అన్నలు అతనికి పదిహేను లక్షలు ఇచ్చి బంగారం షాపు పెట్టించారు. అది బాగా నడిచింది. సందీప్‌తో పాటు వాళ్ళ తమ్ముడు కూడా షాపులో ఉండేవాడు. లాభాలు కూడా బాగా వచ్చాయి. అతని దగ్గర ఉన్న డబ్బుతో పాటు మరో పది లక్షలు అప్పు చేసి రెండు షాపులు కొన్నాడు. ఆర్థికంగా బాగానే ఉన్నారు.

కానీ రాధికను పెద్దగా పట్టించుకోడు. పెండ్లి అయిన దగ్గర నుండి 'నీకు చదువు రాదు, ఏమీరాదు. దేనికీ పనికి రావు' అంటూ అందరి ముందు అవమానించేవాడు. ఆమెను ఓ మనిషిగానే చూడడు. ఎప్పుడూ తిట్టడం, కొట్టడం. రాధికకు సరదాగా బయటకు వెళ్లాలని ఉండేది. పెండ్లయి ఇన్నేండ్లు అవుతున్నా ఒక్కసారి కూడా ఆమెను బయటకు తీసుకెళ్లలేదు. పైగా చాలా బాధపెట్టేవాడు. ఆ బాధలు భరించలేక పుట్టింటికి వెళదామన్నా వెళ్లలేకపోయేది. పెంచిన పెద్దమ్మ వాళ్లు తనకోసం ఎన్నో చేశారు. భర్తను వదిలి వెళితే ఏమనుకుంటారో అని భయం.

కొన్నేండ్లకు సందీప్ తాగుడు, పేకాట, ఐపీఎల్ బెట్టింగ్స్ అంటూ తిరుగుతూ షాపును నిర్లక్ష్యం చేశాడు. దాంతో నష్టాలు వచ్చాయి. అప్పులు పెరిగిపోయాయి. దాంతో రాధిక బంగారం మొత్తం తీసుకెళ్లి అప్పులు తీర్చాడు. అయినా ఆమె ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఆమె పెద్దమ్మ వాళ్లే మళ్లీ కొంత సాయం చేసి వెండి వస్తువులు ఇప్పించి వాటితో వ్యాపారం చేసుకోమన్నారు. కానీ సందీప్ అది కూడా సరిగ్గా చేయలేకపోయాడు. అప్పులు ఇంకా పెరిగిపోయాయి. అతను ఇంత చేసినా రాధిక ఎంతో సహనంగా ఉండేది. అయినా ఆమెను ఏదో ఒకటని బాధపెడుతూనే ఉన్నాడు.

ఐద్వా అదాలత్
సెల్ : 9490098024

సందీప్ అప్పుల్లో కొంత అతని తమ్ముడు తీర్చాడు. దానికి బదులుగా షాపు, కారు తీసుకున్నాడు. ఇవేవీ రాధికకు చెప్పలేదు. ఒకవేళ ఆమె ఏమైనా అడిగినా 'నీకెందుకు చెప్పాలి' అంటాడు.

అప్పుల వాళ్లు ఇంటికి వచ్చి రాధికను బెదిరిస్తున్నారు. సందీప్ ఇవేవీ పట్టించుకోకుండా మద్యానికి బానిసయ్యాడు. రాధిక ఉద్యోగం చేస్తానంటే 'చదువు రాదు, ఏమీ చేయలేవు, నిన్ను పెండ్లి చేసుకోవడం వల్లే నా జీవితం ఇలా తయారయ్యింది' అంటూ తిట్టేవాడు. అతని అక్కలు కూడా రాధికనే నానా మాటలు అనేవారు. శారీరకంగా, మానసికంగా హింసించేవారు. పెద్దమ్మ వాళ్ల దగ్గర డబ్బులు తెచ్చి పిల్లల ఫీజులు కట్టేది. ఇలా ఇంట్లో పరిస్థితి దారుణంగా తయారయ్యింది. తినడానికి తిండి కూడా లేదు.

రాధిక తన మెడలోని తాళిపెట్టి ఇంట్లోకి సరుకులు తెచ్చింది. సందీప్ మాత్రం భార్యా పిల్లలను పట్టించుకోకుండా తిరుగుతున్నాడు. రాధిక మూడు నాలుగు సార్లు ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. ఇరు కుటుంబాల సమక్షంలో పంచాయితీలు కూడా జరిగాయి. అప్పుడు అందరూ రాధికనే తప్పు పట్టారు. దాంతో సందీప్ మరింత రెచ్చిపోయాడు. నోటికి వచ్చినట్టు మాట్లాడేవాడు. పిల్లలు కూడా ఆ మాటలు భరించలేకపోయేవారు. ఎప్పుడూ అసభ్య వీడియోలు చూసేవాడు. వాటి ప్రభావం పిల్లలపై పడుతుందని రాధిక అంటే పెద్ద గొడవ చేసి పంచాయితీ పెట్టించాడు. వీటన్నింటి ప్రభావం రాధిక ఆరోగ్యంపై పడింది. అయినా ఆమెను పట్టించుకోలేదు. పైగా తనను దగ్గరకు రానీయడం లేదంటూ ఊరంత చెప్పుకుంటూ తిరిగేవాడు.

ఈ విషయం గురించి సందీప్ అక్కలు కూడా ఆమెను నిలదీశారు. ఒకపక్క రాధిక నడవలేని స్థితిలో ఉంది. దీని గురించి మాత్రం ఎవ్వరూ పట్టించుకోలేదు. చివరకు తన 14 ఏండ్ల పాప 'అమ్మా నువ్వు నాన్నతో ఎందుకు ఉండటం లేదు. నాన్నకు కావల్సింది అదే కదా! ఆయనకు కావల్సింది చేస్తే సరిపోతుంది కదా!' అన్నది. ఆ మాటలకు రాధిక గుండె పగిలిపోయింది. 'నా బతుకు ఎందుకు ఇలా అయిపోయింది. భార్యగా కాదు కదా నన్ను ఓ మనిషిగా కూడా చూడడం లేదు. ఇక నేను ఇతనితో బతకలేను' అని నిర్ణయించుకుంది. పిల్లల్ని తీసుకొని హైదరాబాద్ వచ్చేసింది. ప్రస్తుతం ఇల్లు అద్దెకు తీసుకొని పిల్లలతో ఉంటుంది. ఐద్వా లీగల్‌సెల్ గురించి తెలుసుకొని తనకు విడాకులు ఇప్పించమంటూ వచ్చింది. మేము ఫోన్ చేసి సందీప్‌ను పిలిపించాము. రాధిక చెప్పిన విషయాల గురించి అడిగితే అంతా నిజమే అని ఒప్పుకున్నాడు.

'నా వల్ల ఆమె ఇంత బాధపడుతుందని అనుకోలేదు. నా కుటుంబం లేకుండా నేను బతకలేను. నా తప్పులు సరి చేసుకుంటాను. ఆమెను నాతో పాటు ఊరికి తీసుకెళతాను పంపించండి' అన్నాడు. మరి అప్పుల సంగతేంటి అంటే, 50 లక్షల అప్పులు ఉన్నాయి. నేను వాటిని సెటిల్ చేశాను. అప్పులు తీర్చడానికి 10, 15 ఏండ్ల సమయం తీసుకున్నాను. దానికి అందరూ ఒప్పుకున్నారు. ఉద్యోగం కూడా చేస్తాను. నేను తప్ప ఆమెకు ఇంకో ఆప్షన్ లేదు అనుకున్నాను. మా పెండ్లి జరిగిన ఇన్నేండ్లకు ఆమె ఇలా మొదటి సారి ఇల్లు విడిచి వచ్చేసింది.
తను వెళ్లిపోయిన తర్వాతనే తన విలువేంటో తెలిసింది. మీ వల్ల ఆమెను మళ్లీ కలిసే అవకాశం వచ్చింది. ఇక మీదట ఆమెకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూసుకుంటాను' అన్నాడు.

రాధిక మాత్రం 'అతను నన్ను ఓ మనిషిగానే చూడలేదు. తాగొచ్చి ఇష్టం వచ్చినట్టు తిడతాడు, కొడతాడు. భార్యా, పిల్లలంటే ప్రేమ, బాధ్యత వంటివి ఏమీ లేవు. అలాంటి వ్యక్తితో ఇక నేను బతకలేను. అతనిపై నాకు నమ్మకం లేదు. ఏదో ఒక పని చేసుకొని నా పిల్లల్ని బతికించుకుంటాను. ఆ ధైర్యం నాకు ఉంది. చదువుకున్న వాళ్ల మాత్రమే ఒంటరిగా బతకగలరా! నేను కూడా బతకగలనని నిరూపించుకుంటాను. దయచేసి నాకు అతనితో విడాకులు ఇప్పించండి' అంటూ కన్నీళ్లు పెట్టుకుంది.

మేము ఇద్దరికీ ఆరు నెలల సమయం ఇచ్చాము. సందీప్‌తో 'నిజంగా మీ భార్యపై ప్రేమ వుంటే బాధ్యతగా ఉండండి. ఆమెకు మీపై నమ్మకం వస్తే అప్పుడు ఆమే మీతో వస్తుంది. ఇష్టం లేకుండా ఇప్పుడు బలవంతంగా మీతో పంపించలేము' అన్నాము. రాధికతో 'ఆరు నెలలు సమయం ఉంది కాబట్టి బాగా ఆలోచించుకోండి. కోర్టులో విడాకులు కూడా అంత తొందరగా రావు. అతను మారతానంటున్నాడు. అతనిపై మీకు నమ్మకం వచ్చిన తర్వాతనే అతనితో వెళ్లొచ్చు. లేదంటే మీ బతుకు మీరు బతకండి. మీకు మా సహకారం ఉంటుంది' అని చెప్పి పంపించాము.

- వై వరలక్ష్మి
9948794051

ఈజీగా తీయొచ్చు..



వెల్లుల్లి గురించి ప్రత్యేకంగా పరిచయాలు అవసరం లేదు. వెల్లుల్లి లేకుండా వంటలను ఊహించుకోలేం. వేపుళ్లకు, చట్నీలకు మరింత రుచిని జోడించేది ఇవే. వీటితో కేవలం రుచి మాత్రమే కాదు ఆరోగ్యం కూడా. వెల్లుల్లి తీసుకోవడం వల్ల ఎన్నో లాభాలున్నాయి. ఈ విషయం పక్కన పెడితే.. వెల్లుల్లి తొక్క తీయడం చాలా కష్టం. ఈ విషయం ప్రతిరోజూ వంట చేసేవారికి అర్థమవుతుంది. . ఒకవేళ వెల్లుల్లి తొక్క తీసేటప్పుడు దాని జిగురు గోళ్లకు కూడా అంటుకుంటుంది. ఒకటి, రెండు అయితే తీయవచ్చు కానీ.. పచ్చళ్లు పెట్టేటపుడు మాత్రం చాలా ఇబ్బందిగా ఉంటుంది. కొన్ని టిప్స్ ఉపయోగించి వెల్లుల్లి తొక్కలను ఈజీగా తీయవచ్చు. ఆ టిప్స్ ఏంటో ఇప్పుడు చూద్దాం.

- వెల్లుల్లి తొక్కలు ఈజీగా రావడానికి మైక్రోవేవ్ చక్కగా సహాయ పడుతుంది. మీకు ఎన్ని వెల్లుల్లి రెబ్బలు కావాలో వాటిని మైక్రోవేవ్‌లో వేడి చేయాలి. ఆ తర్వాత బయటకు తీసి.. వేళ్లతో తీస్తే తొక్క వచ్చేస్తుంది.
- ఒక వెల్లుల్లి పాయ తీసుకుని దాని చేతితో గట్టిగా ప్రెస్ చేయండి. ఆ తర్వాత మూత ఉన్న ఒక బాక్స్ తీసుకుని అందులో వెల్లుల్లి పాయల్ని వేసి గట్టిగా షేక్ చేయండి. ఇలా చేసినా వెల్లుల్లి రెబ్బలు వచ్చేస్తాయి.
- వెల్లుల్లి రెబ్బ తీసుకుని చాకుతో ప్రెస్ చేయండి. ఆ తర్వాత చేతితో ప్రెస్ చేసి తీసేస్తే.. తొక్క ఈజీగా వచ్చేస్తుంది.
- వెల్లుల్లి మీద ఉండే పొట్టు ఈజీగా రావాలంటే వాటికి ఆయిల్ రాసి.. ఎండలో ఆరబెట్టండి. ఆ తర్వాత తీస్తే.. పొట్టు ఈజీగా వస్తుంది.

భగ్గుమన్న పార్లమెంట్

(మొదటిపేజి తరువాయి)

ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు. కేంద్రం సమాధానం చెప్పాలంటూ ప్రతిపక్ష సభ్యులు తమ ఆందోళన కొనసాగించారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొనడంతో పది నిమిషాలకే సభను మధ్యాహ్నం 12 గంటలకు స్పీకర్ వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి. ప్యానల్ స్పీకర్ దిలీప్ సైకియా అదానీ వ్యవహారం, మణిపూర్ హింస, సంభాల్ హింసపై ప్రతిపక్షాలు ఇచ్చిన వాయిదా తీర్మాన నోటీసులను తిరస్కరిస్తున్నట్టు ప్రకటించారు. దీంతో ప్రతిపక్షాలు తమ ఆందోళనను ఉధృతం చేశాయి. మరోవైపు నేషనల్ ఏఆర్‌టీ అండ్ సరోగసీ బోర్డులో ఇద్దరు మహిళా సభ్యులను నియమించాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి నడ్డా తీర్మానాన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దీన్ని మూజువాణి ఓటుతో ఆమోదించారు. పది నిమిషాల్లో సభను సోమవారానికి వాయిదా వేశారు. మరోవైపు రాజ్యసభలోనూ ఇదే కొనసాగింది. సభను చైర్మెన్ జగదీప్ ధన్కర్ ప్రారంభించగా ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. ప్రతిపక్ష సభ్యులు ఇచ్చిన 17 వాయిదా తీర్మాన నోటీసులను తిరస్కరించారు. దీంతో ప్రతిపక్షాల నినాదాలతో సభ హోరెత్తింది. 13 నిమిషాల్లోనే సభను సోమవారానికి వాయిదా వేశారు.

ఢిల్లీలో శాంతి భద్రతలపై ఆప్ ఆందోళన

ఢిల్లీలో శాంతిభద్రతలు క్షీణించడాన్ని నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనలో ఆప్ ఎంపీలు సంజయ్ సింగ్, రాఘవ్ చద్దా తదితరులు ప్లకార్డులు చేతబూని మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

తటస్థంగా వ్యవహరించాలి



న్యూఢిల్లీ : హింస, ప్రాణ నష్టం, అరెస్టులు, మతోన్మాద ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో పూర్తిగా తటస్థంగా వుంటూ శాంతి సామరస్యతలను కాపాడాల్సిందిగా ఉత్తరప్రదేశ్ పోలీసులకు, సంభాల్ జిల్లా యంత్రాంగానికి సుప్రీం కోర్టు శుక్రవారం కఠినమైన ఆదేశాలు జారీ చేసింది. 16వ శతాబ్దంలో ఆలయాన్ని ధ్వంసం చేసి దానిపై మసీదును నిర్మించారనే వాదనలను నిర్ధారించేందుకు సర్వే చేపట్టాల్సిందిగా సివిల్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసిన తరుణంలో ఈ ఆదేశాలు వెలువడ్డాయి. కాగా, తమ ముందున్న కార్యకలాపాలను నిలిపివేయాల్సిందిగా సివిల్ కోర్టును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన బెంచ్ ఆదేశించింది. సివిల్ కోర్టు అడ్వకేట్ కమిషనర్ రూపొందించిన మసీదు సర్వే నివేదికను సీల్డ్ కవర్‌లో వుంచాల్సిందిగా సుప్రీం కోర్టు ఆదేశించింది. పిటిషనర్, మసీదును నిర్వహించే సంభాల్ షాహి జామా మసీద్ కమిటీపై సుప్రీం కోర్టు పలు చట్టపరమైన చర్యలు తీసుకుంది. సర్వే నిర్వహించాలని లేదా ఆదేశాలు సవరించాలని లేదా అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాలని కోరుతూ నవంబరు 19న సివిల్ కోర్టు పరోక్షంగా ఇచ్చిన ఆదేశాలను తోసిపుచ్చేందుకు సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని 13వ నిబంధనలోని 9వ ఆదేశాల కింద కమిటీ పిటిషన్ దాఖలు చేయవచ్చని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా చెప్పారు. కమిటీ దాఖలు చేసే పిటిషన్‌పై హైకోర్టు విచారించేవరకు ఎలాంటి కార్యకలాపాలను విచారణా కోర్టు చేపట్టరాదని బెంచ్ స్పష్టం చేసింది. సివిల్ కోర్టు ఆదేశాలపై పిటిషన్ దాఖలైతే మూడు రోజుల్లోగా దానిని విచారణాంశాల జాబితాలో చేర్చాలని కోరింది. ఈలోగా ఈ కేసులో ఎలాంటి పరిణామాలు జరుగుతున్నాయో సుప్రీం కోర్టు పర్యవేక్షిస్తూ వుంటుందని అధికారులు తెలుసుకోవాలని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 6తో ప్రారంభమయ్యే వారంలో కమిటీ పిటిషన్‌ను విచారణకు చేర్చాలని సీజేఐ ఆదేశించారు.

జీడీపీ ధమాల్



న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ ఉరుకులు పెడుతోందన్న బీజేపీ పాలకుల ఊకదంపుడు ఉపన్యాసాలు, రిపోర్టులు వాస్తవ రూపంలో కార్యరూపం దాల్చడం లేదు. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి మందగించడమే ఇందుకు నిదర్శనం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో వృద్ధి ఏకంగా 5.4 శాతానికి పడిపోయి.. దాదాపు రెండేండ్ల కనిష్టానికి క్షీణించింది. ఆర్‌బీఐ, రేటింగ్ ఏజెన్సీల అంచనాల కంటే ఘోరంగా క్షీణించడం గమనార్హం. కేంద్ర గణంకాల శాఖ (ఎన్ఎస్ఓ) శుక్రవారం జీడీపీ రిపోర్ట్‌ను వెల్లడించింది. మైనింగ్, గనుల రంగాలు అత్యంత పేలవ ప్రదర్శన కనబర్చాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో జీడీపీ ఏకంగా 8.1 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. గడిచిన ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 6.7 శాతానికి పరిమితమయ్యింది. ఈ రెండింటితోనూ పోల్చినా జీడీపీలో భారీ తగ్గుదల నమోదుకావడం ఆందోళనకరం. మరోవైపు రేటింగ్ ఏజెన్సీలు కూడా 6 శాతం ఎగువన వృద్ధి ఉండొచ్చని చేసిన అంచనాల కంటే మరింతగా పడిపోవడం విశేషం. జీడీపీ 7 శాతం పెరగనుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ అంచనా వేశారు. ఆర్‌బీఐ అంచనాలు మించి జీడీపీ పతనం కావడం ఆర్థిక వ్యవస్థ పట్ల తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వీటిన్నిటీ పరిశీలనలోకి తీసుకుంటే భారత ఆర్థిక వ్యవస్థ బయటికి కనబడుతున్నంత బలంగా ఏమీ లేదని.. మందగమనం చాయలు స్పష్టమవుతున్నాయి. ఒక ఏడాదిలో దేశంలో ఉత్పత్తి అయిన సరకులు, సేవల మొత్తం విలువను జీడీపీగా పేర్కొంటారు. ఇది ఆర్థిక వ్యవస్థ పనితీరును తెలుపుతోంది. జీడీపీ పడిపోతుందంటే దేశంలో ఆర్థిక కార్యకలాపాలు సన్నగిల్లుతున్నాయని అర్థం.

రెండంకెల నుంచి మైనస్‌లోకి..

గడిచిన సెప్టెంబర్ త్రైమాసికంలో వ్యవసాయ రంగం 3.5 శాతం వృద్ధితో మెరుగైన ప్రగతిని కనబర్చింది. ఈ రంగం ఇంతక్రితం త్రైమాసికంలో 2 శాతంగా, గతేడాది సెప్టెంబర్ త్రైమాసికంలో 1.7 శాతంగా నమోదయ్యింది. గనుల రంగం గతేడాది రెండంకెల పెరుగుదలను సాధించగా.. ఈ ఏడాది ప్రతికూల వృద్ధిలోకి జారుకుంది. ఈ రంగం క్రితం క్యూ2లో మైనస్ 0.1 శాతంతో ప్రతికూల వృద్ధిని చవి చూసింది. ఏడాదిక్రితం ఈ రంగంలో 11.1 శాతం పెరుగుదల ఉంది. అదే సమయంలో తయారీ రంగం 14.3 శాతం వృద్ధిని సాధించగా.. గడిచిన క్యూ2లో ఏకంగా 2.2 శాతానికి పడిపోయింది. విద్యుత్ రంగం వృద్ధి 10.5 శాతం నుంచి 3.3 శాతానికి క్షీణించింది. క్రితం క్యూ2లో నిర్మాణ రంగం 7.7 శాతం వృద్ధితో సరిపెట్టుకుంది. గతేడాది ఇదే త్రైమాసికంలో 13.6 శాతం పెరుగుదలను సాధించింది. ఇదే సమయంలో వాణిజ్యం, హోటళ్లు, రవాణ రంగాల జీడీపీ 4.5 శాతంగా ఉండగా.. గడిచిన క్యూ2లో 5.7 శాతానికి పెరిగింది. ఫైనాన్సియల్, రియల్ ఎస్టేట్, నైపుణ్యాల సర్వీసులు ఏడాదికేడాదితో పోల్చితే 6.2 శాతం నుంచి 6.7 శాతానికి పెరిగాయి. ఊహించినదానికంటే బలహీనమైన వృద్ధి చోటు చేసుకోవడంతో భారత ఆర్థిక స్థిరత్వంపై ఆందోళనలను పెంచనుందని నిపుణులు పేర్కొంటున్నారు.. ముఖ్యంగా, తయారీ, మైనింగ్ లాంటి కీలక రంగాలు సవాళ్లను ఎదుర్కొంటున్నాయని స్పష్టమవుతోందన్నారు.

కీలక రంగాల నేల చూపులు

దేశ ఆర్థికవ్యవస్థలో అత్యంత ముఖ్యమైన ఎనిమిది కీలక రంగాలు డిమాండ్ లేక పడకేశాయి. ప్రస్తుత ఏడాది అక్టోబర్‌లో కీలక రంగాల వృద్ధి 3.1 శాతానికి పరిమితమయ్యింది. 2023 ఇదే మాసంలో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, విద్యుత్ లాంటి ఎనిమిది కీలక రంగాలు ఏకంగా 12.7 శాతం శాతం వృద్ధిని సాధించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ కాలంలో ఈ రంగాలు 4.1 శాతం వృద్ధికి పరిమితమయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో 8.8 శాతం శాతం వృద్ధిని కనబర్చాయి. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో ఈ రంగాలు ఏకంగా 40.27 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యత గల రంగాల వృద్ధి పడిపోవడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపనుంది.

సీపీఎస్, యూపీఎస్ వద్దు..ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

(మొదటిపేజి తరువాయి)

భార్తి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న పాఠశాలల మూసివేతను ఆపాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో పేదలకు నాణ్యమైన విద్యను దూరం చేసి, కార్పొరేట్లకు లాభాలను అందించే జాతీయ విద్యా విధానాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఎస్‌టీఎఫ్ఐ ఉపాధ్యక్షులు, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ చందాతో కూడిన పింఛన్ పథకం (సీపీఎస్)ను రద్దు చేయాలని, ఇరవై ఏండ్లుగా చేస్తున్న పోరాటానికి తలొగ్గి కేంద్ర ప్రభుత్వం ఏకీకృత పింఛను పథకాన్ని (యూపీఎస్) ప్రతిపాదించిందని అన్నారు. అయితే పాత పింఛను విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించడం మినహా మరే పథకాన్ని అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ఇదే స్ఫూర్తితో ఉద్యోగులు, ఉపాధ్యాయులు దేశవ్యాప్తంగా ఐక్య పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని, పోరాటంతోనే ఓపీఎస్ సాధించుకోగలమని స్పష్టం చేశారు.

వామపక్ష ఎంపీల సంఘీభావం

ఉపాధ్యాయుల ధర్నాకు సీపీఐ(ఎం) రాజ్యసభ సభ్యుడు శివదాసన్, సీపీఐ(ఎంఎల్) లోక్‌సభ ఎంపీలు సుధామ ప్రసాద్, రాజారాం సింగ్ పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఈపీ ప్రజల కోసం లేదని ,కార్పొరేట్ల కోసం మాత్రమే ఉందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రయివేటీకరణ అనుకూల విధానాలను ఉపాధ్యాయులు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్) అధ్యక్షుడు సుభాష్ లాంబ, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.పి సాను, మయూఖ్ బిశ్వాస్, విద్యావేత్తలు మధుప్రసాద్, నందితా నారాయణ్‌లు ప్రసంగిం చారు. తెలంగాణ రాష్ట్రం నుంచి టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, రాష్ట్ర కార్యదర్శి నాగమణి, రాష్ట్ర కమిటీ సభ్యులు బక్కా శ్రీనివాస చారి, సృజన్ కుమార్, ఎల్లయ్య, కిరణ్ కుమార్, టి కుమార్, రమేష్, శ్రీనివాసరెడ్డి, చిన్న వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



అదానీ వ్యవహారంపై సమాచారం లేదు

(మొదటిపేజి తరువాయి)

ఎలాంటి సమాచారం అమెరికాలోని భారతీయ ఎంబసీకి అందలేదని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిస్థితుల గురించి ప్రశ్నించగా, అక్కడి హిందువులు, ఇతర మైనారిటీలు ఎదుర్కొంటున్న బెదిరింపుల గురించి బంగ్లాదేశ్ ప్రభుత్వంతో కేంద్ర ప్రభుత్వం మాట్లాడుతోందని, తీవ్రంగా నిరసన కూడా తెలియచేశామని చెప్పారు. ఈ విషయంలో మన వైఖరి చాలా స్పష్టంగా వుందన్నారు. మైనారిటీలందరినీ కాపాడాల్సిన బాధ్యత అక్కడి తాత్కాలిక ప్రభుత్వంపై వుందన్నారు. తీవ్రవాద భావజాలం కలిగిన సంఘటనలు, హింస, కవ్వింపు చర్యలు పెరగడం పట్ల ఆందోళన చెందుతున్నామ న్నారు. ఈ పరిణామాలను కేవలం మీడియా అత్యుత్సాహంగా కొట్టిపారేయలేమని అన్నారు. సామాజిక సేవలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన సంస్థ ఇస్కాన్ అని పేర్కొన్నారు. మైనారిటీల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాల్సిందిగా బంగ్లాదేశ్‌కు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. చిన్మయ్ దాస్ అరెస్టు గురించి స్పందిస్తూ, వ్యక్తులకు సంబంధించిన వరకు చూసినట్లైతే, చట్టపరమైన ప్రక్రియలు కొనసాగుతు న్నాయన్నారు. అంతా కూడా స్వేచ్ఛగా, సక్రమంగా పారదర్శకంగా జరుగుతుందని ఆశిస్తున్నట్టు చెప్పారు.

ఇందిరమ్మ ఇండ్లలో నిరుపేదలకు తొలి ప్రాధాన్యం

(మొదటిపేజి తరువాయి)

ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఏ దశలోనూ లబ్ధిదారుకు ఇబ్బంది కలగవద్దన్నారు. అదే సమయంలో శాఖాపరంగా ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా చూడాలని సీఎం ఆదేశించారు. ఆదివాసీ ప్రాంతాలు, ఐటీడీఏల పరిధిలో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ప్రత్యేక కోటా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లకు అదనంగా గదులు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపితే అందుకు అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు. పథకం సమర్థమంతంగా కొనసాగించేందుకు వీలుగా గృహ నిర్మాణ శాఖ బలోపేతం కావాలన్నారు. ఇందుకు అవసరమైన అధికారులు, సిబ్బందిని నియమించుకోవాలని శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి డాక్టర్ జ్యోతి బుద్ధప్రకాష్, ప్రత్యేక కార్యదర్శి వీపీ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా తెలంగాణ తల్లి విగ్రహం

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

హైదరాబాద్‌లోని సెక్రటరియేట్‌లో డిసెంబర్ 9న రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేయనున్న సంగతి తెలిసిందే. అందుకు సంబంధించిన తెలంగాణ తల్లి విగ్రహం రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలో ఓ విగ్రహ రూపకర్త వద్ద రూపుదిద్దుకుంటోంది. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలోని ఔటర్ రింగ్ రోడ్డు దగ్గర తయారవుతున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని పరిశీలించారు. శిల్పిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఎం వెంటన ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఉన్నారు.

ఈ ఫలితాలు పెద్ద కుదుపే

(మొదటిపేజి తరువాయి)

ఆధారపడి ఉంటుందని భావించాలి. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తన పనితీరుతో నూతనోత్సాహంతో పునరాగమనం చేసింది. మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మాత్రం పార్టీ ఆశించినట్లుగా లేవు. 'ఇండియా' కూటమి పార్టీలు రెండు రాష్ట్రాల్లో మాత్రమే ప్రభుత్వాలను ఏర్పాటు చేశాయి. ఇది భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారుతుంది"

ఈ ఏడాది పాత పద్ధతిలోనే టెన్త్ పరీక్షలు

వచ్చే విద్యాసంవత్సరంలో ఇంటర్నల్ మార్కుల ఎత్తివేత

గ్రేడింగ్ విధానంలో మార్పులేదు : విద్యాశాఖ సవరణ ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పదోతరగతి వార్షిక పరీక్షల నిర్వహణలో మార్పులు చేసిన రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో పాత పద్ధతిలోనే పదో తరగతి పరీక్షలను నిర్వహిస్తామని స్పష్టం చేసింది. 20 ఇంటర్నల్ మార్కులుంటాయని వివరించింది. 80 మార్కులకే వార్షిక పరీక్షలను నిర్వహిస్తామని వివరించింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం శుక్రవారం సవరణ ఉత్తర్వులను జారీ చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 20 ఇంటర్నల్ మార్కులను ఎత్తివేస్తున్నట్టు గురువారం ప్రకటించిన విషయం తెలిసిందే. వంద మార్కులకు వార్షిక పరీక్షలుంటాయని ప్రకటించిన మరుసటి రోజే వెనక్కి తగ్గడం గమనార్హం. ప్రస్తుత విద్యాసంవత్సరంలో పాత పద్ధతిలోనే పదో తరగతి వార్షిక పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం (2025-26) నుంచి 20 ఇంటర్నల్ మార్కులను ఎత్తివేస్తున్నట్టు ప్రకటించారు. వంద మార్కులకు వార్షిక పరీక్షలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచే గ్రేడింగ్ విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. గ్రేడింగ్ విధానం అమల్లో ఎలాంటి మార్పు లేదని వివరించారు. పదో తరగతి పరీక్షల్లో చేసిన మార్పుల పట్ల ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నుంచి విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాల నుంచి కూడా వ్యతిరేకత వచ్చింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గడం గమనార్హం. అయితే ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచే పదో తరగతి వార్షిక పరీక్షల్లో 24 పేజీల బుక్‌లెట్‌ను ఇచ్చే విధానం అమల్లోకి రానుంది. ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ పేపర్లకు మాత్రం 12 పేజీల చొప్పున వేర్వేరుగా బుక్‌లెట్‌లను ఇస్తారు.







అభివాదం చేస్తున్న తమ్మినేని, జూలకంటి, మల్లు నాగార్జున రెడ్డి, మల్లు లక్ష్మి, నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరి రావు, శేఖర్ రావు తదితరులు

అదానీతో దోస్తీ వద్దు..

రూ.1200 కోట్ల ఒప్పందాన్ని రద్దు చేయండి | అన్ని వర్గాలకు అండగా ఎర్రజెండా

- ఫార్మా కంపెనీ రద్దు నిర్ణయం పట్ల హర్షం
- హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలి: సీపీఐ(ఎం) సూర్యాపేట జిల్లా 3వ మహాసభలో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

అదానీతో దోస్తీ వద్దని, ఫార్మా కంపెనీ కోసం చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. సీపీఐ(ఎం) సూర్యాపేట జిల్లా మూడో మహాసభ సందర్భంగా శుక్రవారం పట్టణంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. పదేండ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ కుటుంబ పాలనలో ప్రజలకు స్వేచ్ఛ లేకుండా పోయిందని, అందుకే కాంగ్రెస్‌కు పట్టం కట్టారని అన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఆరు గ్యారంటీ స్కీములు ఇవ్వడంతో పాటు ఏడో గ్యారంటీ కూడా ఇస్తున్నాం.. అదే స్వేచ్ఛ అని ప్రకటించి ప్రగతిభవన్ చుట్టూ కంచెను తొలగించిందని చెప్పారు. లగచర్లలో కలెక్టర్‌పై దాడిని ఖండించామన్నారు. ఫార్మా కంపెనీ కోసం భూములు అమ్మం అని ఆ గ్రామస్తులు తిరగబడితే వారిపై కేసులు నమోదు చేశారన్నారు. ఈ క్రమంలో వామపక్ష పార్టీల నేతలు ఆ గ్రామాన్ని సందర్శించి ఇంటింటికీ తిరిగి వాస్తవాలను తెలుసుకున్నామని చెప్పారు. ప్రతిఏటా రెండు పంటలు పండే పచ్చని పొలాలు ఉన్నాయని గ్రామస్తులు చూపించారని తెలిపారు. ఆ పర్యటనంతరం ముఖ్యమంత్రిని కలిసి వాస్తవాలను వివరించిన తర్వాత రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెనక్కు తగ్గి ఫార్మా కంపెనీ పెట్టడం లేదని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అదే క్రమంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తామని చెబుతున్నా.. పేదల భూములు తీసుకోవద్దని కోరారు. వృథాగా ఉన్న భూములు, మాజీ ఎమ్మెల్యే గురునాథ్ రెడ్డి ఆధీనంలో ఉన్న వందల ఎకరాలను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వానికి ఆ భూములు కనిపించకపోతే సీపీఐ(ఎం)గా ఎర్రజెండాలు పాతి చూపిస్తామన్నారు. ప్రపంచంలో అన్ని వర్గాల ప్రజలకు ఎల్లప్పుడూ ఎర్రజెండా అండగా ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లోని ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్క గ్యారెంటీ పూర్తిస్థాయిలో అమలు జరగలేదన్నారు. ఉచిత బస్సు పథకం పూర్తిస్థాయిలో అమలైనప్పటికీ తగినన్ని బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మోడీ మాటలు విడ్డూరం



ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులకు అదానీ రూ.1750 కోట్లు లంచం ఇచ్చినట్టు అమెరికాలో అభియోగాలు రాగా, చట్టాల ప్రకారం ఆయన దోషి అని ప్రపంచం కోడై కూస్తుంటే ప్రధాని మోడీ మాత్రం దేశం హర్షించే వ్యక్తి అదానీ అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అమెరికా చట్టాల ప్రకారం దోషిగా ఉన్న అదానీతో దోస్తీ వద్దని, రాష్ట్రంలో పెట్టుబడులకు ఎక్కడి నుంచి అయినా డబ్బులు వస్తాయని, ప్రభుత్వానికి మచ్చ తెచ్చుకోవద్దని తమ్మినేని సీఎం రేవంత్ రెడ్డికి హితవు పలికారు. ఈ మహాసభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి నాగార్జున రెడ్డి, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, నెమ్మాది వెంకటేశ్వరరావు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, పారేపల్లి శేఖర్‌రావు, నాగారపు పాండు, కోట గోపి, మట్టిపల్లి సైదులు, చెరుకు ఏకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ.1200 కోట్ల ఒప్పందాన్ని రద్దు చేయండి

రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం అదానీ ఇస్తానన్న 100 కోట్ల రూపాయలను తిరస్కరిస్తున్నట్టు పకటించడం పట్ల సీపీఐ(ఎం) హర్షం వ్యక్తం చేస్తోందని తమ్మినేని అన్నారు. అదే క్రమంలో రూ.1200 కోట్లతో ఫార్మా కంపెనీ ఏర్పాటు చేసేందుకు చేసుకున్న ఒప్పందం సంగతి ఏంటని ప్రశ్నించారు. 100 కోట్లను తిరస్కరించినట్లే ఫార్మా కంపెనీ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. లగచర్లలో పేదలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

ట్రంప్ ప్రకటనలతో ఆసియాన్ దేశాల్లో భయాందోళనలు

పెట్టుబడులపై, అభివృద్ధిపై ప్రభావం చూపుతుందంటున్న విశ్లేషకులు



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన నేపథ్యంలో ఎగుమతుల ఆధారిత ఆగ్నేయాసియా దేశాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. దిగుమతి చేసుకున్న వస్తువులపై టారిఫ్‌లను పెంచుతామంటూ ట్రంప్ తన ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ కారణంగా ప్రాంతీయ దేశాల ఆర్థిక వ్యవస్థలన్నీ పోటీ పడాల్సి వుంటుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈసారి ట్రంప్ తన రెండో పదవీ కాలంలో ఆగ్నేయాసియా దేశాలతో తన కార్యకలాపాలను పెంచుతారని భావిస్తున్నారు. ట్రంప్ తిరిగి వైట్‌హౌస్‌కు వచ్చినందున ఎదురయ్యే కొత్త భౌగోళిక, రాజకీయ సవాళ్లను ఎదుర్కొనడానికి ఆసియాన్ కూడా తన దౌత్య సంబంధాలను ఉపయోగిస్తుందని కూడా భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అమెరికాకు ఆసియాన్ ఎగుమతులు బలమైన ప్రతికూలతలను ఎదుర్కొంటున్నందున టారిఫ్‌లను పెంచుతామన్న ప్రతిపాదన కచ్చితంగా చెడ్డ వార్తే, అందులో ఎలాంటి సందేహం లేదని సింగపూర్ అంతర్జాతీయ వ్యవహారాల సంస్థకు చెందిన ఓ ఇ సన్ వ్యాఖ్యానించారు. 'అమెరికాను మహత్తంగా తీర్చిదిద్దాలి' అన్న ట్రంప్ డిమాండ్, ఆయన నినాదానికి అనుగుణంగా బహుశా ఆగ్నేయాసియా దేశాల్లోని పెద్ద పెద్ద తయారీ సంస్థలు అమెరికాలో ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసే యోచన చేయాల్సి వుంటుందని అన్నారు. మరింత రక్షణవాదంతో కూడిన అమెరికా విధానాల వల్ల ఆసియాన్ ఎగుమతులు దెబ్బ తినగలవని మే బ్యాంక్ తన నోట్‌లో పేర్కొంది. ఆగ్నేయాసియాకు పెట్టుబడుల రాక కూడా తగ్గుతుందని, ప్రతి ద్రవ్యోల్బణ షాక్ తగులుతుందని పేర్కొంది.

ఎక్కువ మందికి పకోడీలు.. కొద్ది మందికే హల్వా



న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వ పాలనలో అదానీలకు హల్వాలు, పేద ప్రజలకు పకోడీలు అని కాంగ్రెస్ నాయకులు జై రాం రమేష్ విమర్శించారు. భారత్‌లో వేతన అసమానతలు అత్యంత తీవ్రంగా ఉన్నాయని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) విడుదల చేసిన నివేదికను ప్రస్తావిస్తూ ఆయన ఈ విమర్శలు చేశారు. నివేదిక ప్రకారం దేశంలో టాప్ 10 శాతంలో ఉన్న ఆదాయాన్ని సంపాదించే వారు దిగువున ఉన్న 10 శాతం కంటే 6.8 రెట్లు ఎక్కువగా సంపాదిస్తున్నారని జైరాం రమేష్ తెలిపారు. 'దేశంలో వేతన అసమానత పాకిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, మయన్మార్‌లతో సహా మన పొరుగు దేశాలు కంటే తీవ్రంగా ఉంది' అని ఎక్స్‌లో జైరాం రమేష్ పోస్టు చేశారు. 'ఇది మన నాన్-బయోలాజికల్ ప్రధాని సృష్టించిన పకోడా-నామిక్స్ యొక్క ప్రత్యక్ష పరిణామమని గుర్తుంచుకోండి. ఎక్కువ మందికి పకోడీలు, ఎంపిక చేసుకున్న కొద్ది మందికి హల్వాలు' అని జైరాం రమేష్ విమర్శించారు.



మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న బీజేపీ

అంబేద్కర్‌ను పొగుడుతూనే రాజ్యాంగ ధ్వంసానికి యత్నం

దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగిస్తోంది : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ.. రాజకీయ పబ్బం గడుపుకుంటోందని, హిందూ దేశంగా మార్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తోందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సీపీఐ(ఎం) జిల్లా 13వ మహాసభలో ప్రారంభోపన్యాసం చేశారు. బీజేపీ ప్రమాదాన్ని ప్రజలు పసి గట్టాల్సిన అవసరముందని చెప్పారు. దేశంలో బీజేపీ ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు తూట్లు పొడుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సంపదను అదానీ, కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందని విమర్శించారు. అంబేద్కర్‌ను ఒకపక్క పొగుడుతూనే మరోవైపు రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తోందని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఒకలా.. ఇతర రాష్ట్రాల్లో మరోలా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆదిలాబాద్‌లో సీసీఐని తెరిపించాలని, ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పత్తి అధికంగా పండించే ఆదిలాబాద్ జిల్లాలో టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా హైడ్రా పేరుతో ఇండ్లు కూల్చడం, ఫార్మాసిటీ కోసం రైతుల భూములు లాక్కుంటూ కేసులు నమోదు చేస్తోందని అన్నారు. మహాసభలో మాజీ ఎంపీ మిడియం బాబురావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, ఆశాలత, జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, మంజుల, భీంరావు, నాయకులు జమున, విష్ణు పాల్గొన్నారు.



మహారాష్ట్రలో బస్సు బోల్తా 12 మంది మృతి

గోండియా : మహారాష్ట్ర రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఎంఎస్ఆర్‌టిసి)కి చెంది బస్సు బోల్తా పడిన ప్రమాదంలో 12 మంది మరణించగా, 30 మంది గాయపడ్డారు. గోండియా జిల్లాలోని దవ్వ గ్రామంలో ఉదయం 11:30 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఈ సమయంలో 40 మంది ప్రయాణీకులు ఉన్నారు. మీతిమీరిన వేగంతో వెళ్తుతున్న బస్సుపై డ్రైవర్ నియంత్రతణ కోల్పోవడమే ఈ ప్రమాదానికి కారణంగా ప్రాథమిక దర్యాప్తులో వెల్లడయింది. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రజీత్ నాయర్ తెలిపారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ప్రజాస్వామ్య పునరుద్ధరణ అంటే నిర్బంధాలా..?

- యేడాది పాలనలో ప్రజలకు మార్పులు.. బడాబాబులకు మూటలు
- సీఎం రేవంత్‌రెడ్డి ఎవరి పక్షమో చెప్పాలి
- బీఆర్‌ఎస్ ప్రజాస్వామ్యంపై మాట్లాడడం హాస్యాస్పదం
- బీజేపీ మతం పేరుతో విధ్వంసం
- ప్రభుత్వాలను నిలదీసేది ఎర్ర జెండానే.. : సీపీఐ(ఎం) వరంగల్ జిల్లా 20వ మహాసభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎస్ వీరయ్య, వేదికపై జి. నాగయ్య, పోతినేని సుదర్శన్ తదితరులు

నవతెలంగాణ-నర్సంపేట

"ప్రజాపాలన.. ప్రజాస్వామ్య పునరుద్ధరణ అంటే రైతుల నిర్బంధాలు.. మహిళలపై చిత్ర హింసలు.. రోజుల తరబడి జైల్లో పెట్టడమా..? కాంగ్రెస్ యేడాది పాలనలో ప్రజలకు మార్పులు.. బడాబాబులకు మూటలు చేరాయి" అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షమా.. యజమాన్యాలు, కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ బ్రోకర్‌ల పక్షమో చెప్పాలి అని అన్నారు. ఆరు గ్యారంటీల అమలుపై వెంటనే శ్వేత పత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) వరంగల్ జిల్లా 20వ మహాసభ శుక్రవారం నర్సంపేటలో ప్రారంభమైంది. అంగడీ రోడ్డు సెంటర్‌లో సీపీఐ(ఎం) జిల్లా కమిటి సభ్యులు హన్మకొండ శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో వీరయ్య ప్రసంగించారు.

భారత దేశం చుట్టూ ఉన్న దేశాల్లో ఎర్ర జెండా రెపరెపలాడుతోందని, ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వాలను నిలదీసేది ఎర్ర జెండానే అని అన్నారు. పేదలు, కార్మికులు ఐక్యంగా పోరాడితే భవిష్యత్ అంతా ఎర్ర జెండాదే అని చెప్పారు. వీర తెలంగాణ పోరు గడ్డ.. పోరాటాలు పురుడు పోసిన ఓరుగల్లు గడ్డపై ఎర్ర జెండా రెపరెపలాడాలని, ప్రజా ఉద్యమాలకు ప్రజలు సన్నద్ధం కావాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేసిందని ప్రజాపాలన సంబురాలు చేసుకోవాలని పాలకులు పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ధాన్యంపై బోనస్ రూ.500 ఇస్తామని హామీనిచ్చి అధికారంలోకి రాగానే కేవలం సన్న రకం ధాన్యానికే ఇస్తామని చెప్పి మెలికపెట్టారన్నారు. రైతులు అడ్డికి పావుషేరులా వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

పదేండ్ల కేసీఆర్ పాలనలో ప్రగతి భవనంలోకి సామాన్యుడు రాలేకపోయాడని, ఇక తాము ముండ్ల కంచెలను తొలగించి ప్రజాసామ్య పునరుద్ధరణ చేశామని సీఎం రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పారన్నారు. నాడు ప్రగతి భవనంలో కేసీఆర్ ఉన్నా ప్రజలు పోలేకపోయారని, నేడు ప్రజలు వెళ్లడానికి అవకాశం ఉన్నా అక్కడ సీఎం లేకుండా పోయారని అన్నారు. హైదరాబాద్ మహానగరమే కాదు రాష్ట్రం మొత్తం పోలీసు నిర్బంధాలు విధిస్తున్నారన్నారు. నాడు కేసీఆర్ మల్లన్న సాగర్ రైతులను అరెస్టు చేసి జైళ్లు, నిర్బంధాలు పెట్టి రాచరిక పాలన సాగించారని గుర్తు చేశారు. నేడు లగచర్లలో ఫార్మాసిటీ పేరిట సీఎం రేవంత్‌రెడ్డి రైతులను భయభ్రాంతులకు గురిచేశారని చెప్పారు. రైతుల వ్యతిరేకతతో వెనక్కి తగ్గి పారిశ్రామిక కారిడార్ పేరిట భూములను లాక్కోవాలని చూస్తున్నారని విమర్శించారు. పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఏకంగా సుప్రీం కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించిందని, ఇందుకు విరుద్ధంగా రేవంత్ సర్కార్ 20జిల్లాల్లో 60 కేంద్రాలలో పేదల గుడిసెలను తొలగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతుకు గుర్తింపు కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరగా ఉన్న ఆ కాస్తా 5జీవోలను బుట్టదాఖలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేసీఆర్ నిజస్వరూపం అర్థం చేసుకోవడానికి పదేండ్లు పట్టిందని, కానీ కాంగ్రెస్ పాలనలో పది మాసాలు కూడా పట్టలేదని రేవంత్ రెడ్డి అర్థం చేసుకోవాలన్నారు. ఇప్పుడు బీఆర్‌ఎస్ నాయకులు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. పదేండ్లలో కేసీఆర్ అవలంబించిన రాజరిక, అప్రజాస్వామిక పద్ధతిని ప్రజలు మరిచిపోలేరన్నారు. ప్రజలు తిరస్కరించి ఓడించినా కేసీఆర్‌కు బుద్ధి రాలేదని, కనీసం పశ్చాత్తాపం చెందడం లేదని అన్నారు.

తెలంగాణలో బీజేపీ మతతత్వ చిచ్చు చెల్లదు

మహారాష్ట్రలో గెలవడాన్ని ఆదర్శంగా తీసుకొని తెలంగాణలో అధికారంలోకి రావాలని ప్రధాని మోడీ బీజేపీ నాయకులకు హితబోధ చేయడం సిగ్గుచేటు అని వీరయ్య అన్నారు. అప్రజాస్వామ్య పద్ధతిలో తెలంగాణలో బీజేపీ అధికారంలో రావడం కోసం ప్రజల్లో మతచిచ్చు రేకెత్తించే ప్రయత్నంలో ఉందన్నారు. అడ్డదారిలో అధికారంలోకి రావడానికి అర్రుల చాస్తోందన్నారు. విషబీజాలు నాటడానికి మత చిచ్చుపెడుతుందని ఇటీవల మెదక్, అదిలాబాద్ జిల్లాల్లో జరిగిన దుర్మార్గపు విధ్వంసమే నిదర్శమన్నారు. కానీ, తెలంగాణలో బీజేపీ ఎత్తుగడలు పారవని, ప్రజలు తిప్పికొట్టడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జి.నాగయ్య, సీనియర్ నాయకులు జి.రాములు, జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ అధికారుల సమన్వయ లోపంతోనే పులి దాడి

రక్షణ కల్పించడంలో అధికారులు విఫలం | టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిడియం బాబురావు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫారెస్ట్ అధికారుల సమన్వయ లోపం వల్లే పెద్దపులులను పట్టుకోవడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని మాజీ ఎంపీ, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మిడియం బాబురావు అన్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే పులి దాడిలో ముగ్గురు ప్రాణం కోల్పోయారని, ఇంకా ఎంత మంది చనిపోవాలని ప్రశ్నించారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో టీఏజీఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో కవ్వాల్ ఇతర ఫారెస్ట్‌లో ఎక్కడా పులి జాడ లేదన్నారు. మహారాష్ట్ర తిప్పేశ్వర్, తడోబా నుంచి వస్తున్న పులులను ఆపడంలో, ప్రజలకు రక్షణ కల్పించడంలో ఫారెస్ట్ అధికారులు విఫలమవుతున్నారని అన్నారు. అందువల్లే అమాయక ప్రజలు పులుల దాడిలో ప్రాణం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే ఈ ప్రాంతంలో తిరుగుతున్న పెద్దపులిని వెంటనే బంధించి తడోబా పులుల సంరక్షణ ప్రాంతానికి తరలించాలని కోరారు. అదేవిధంగా ఏనుగు దాడిలో ఇద్దరు మరణించినా ఫారెస్ట్ అధికారుల నుంచి ఎటువంటి స్పందనా లేకపోవడం బాధాకరమన్నారు. జంతువుల ప్రాణాలకు ఇచ్చిన విలువ మనుషుల ప్రాణాలకు



ఇవ్వడం లేదని వాపోయారు. పెద్దపులి దాడిలో మరణించిన మొర్లె లక్ష్మీ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 1972 వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1980 ఫారెస్ట్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ యాక్ట్ ప్రకారం రూ.45లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, 5ఎకరాల సాగుభూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటలు చేతికి వస్తున్న సమయంలో పులి దాడి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోందని, మరొక ప్రాణం పోక ముందే చర్యలు చేపట్టాలని అన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు, నాయకులు ఆత్రం తనుష్, కిష్టన్న, బైరి సోమేశ్, మేస్రం నర్మద, నాగోరావ్, తొడసం మోతీరామ్ పాల్గొన్నారు.

ఉమర్ ఖాలీద్ బెయిల్ పిటిషన్ విచారణ 6న

న్యూఢిల్లీ : చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం(ఉపా) కేసులో.. విద్యార్థి నాయకులైన ఉమర్ ఖాలీద్‌తో పాటు గుల్ఫిషా ఫాతిమా, ఖాలీద్ సైఫీల బెయిల్ పిటిషన్‌పై వచ్చే నెల 6న విచారణ జరగనున్నది. న్యాయమూర్తులు జస్టిస్ నవీన్ చావ్లా, జస్టిస్ శైలిందర్ కౌర్‌లతో కూడిన ఢిల్లీ హైకోర్టు ధర్మాసనం దీనిని చేపట్టనున్నది. 2020లో ఢిల్లీ అల్లర్లకు సంబంధించి ఉపా కింద ఈ ముగ్గురూ కేసులను ఎదుర్కొంటున్నారు. అయితే, తాము సుదీర్ఘ కాలం జైలులో ఉన్నామనీ, దానిని పరిగణలోకి తీసుకొని బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వారు ఈ పిటిషన్‌ను వేశారు. వాస్తవానికి ఉమర్ ఖాలీద్ బెయిల్ పిటిషన్‌ను ఈ ధర్మాసనం అక్టోబర్ 7న చేపట్టాల్సి ఉన్నది. కానీ, బెంచ్ సమావేశం విఫలం కావటంతో అది సాధ్యపడలేదు. ఆ తర్వాత పిటిషన్ విచారణ నవంబర్ 25కు జాబితా చేయబడింది. ఈ ఏడాది సెప్టెంబర్ 14తో ఉమర్ ఖాలీద్ నాలుగేండ్లు జైలులో గడిపినట్టయ్యింది. బెయిల్ కోసం దిగువ కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు పలుమార్లు ఉమర్ ఖాలీద్ పిటిషన్లు దాఖలు చేశారు.